ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Ongole, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
29-6-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 149 పేజీలు: 12 వెల: 6.50

ప్రకృతి సంపదకు ఈశాన్య భారతం పుట్టినిల్లు: ప్రధాని 9లో

కరాచీలో భీకర ఉగ్రదాడి: నలుగురు సైనికులు మృతి

## రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో ప్రారంభం

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా 'పల్స్ పోలియో' కార్యక్రమం ప్రారంభమైంది. ఐదేళ్లలోపు వయసున్న పిల్లలకు తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేస్తున్నారు. రాష్ట్రంలో 49.20 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు. రైల్వేస్టేషన్లు, బస్ స్టాండ్లు, విమానాశ్రయాలు, మార్కెట్లు వంటి రద్దీ ప్రదేశాల్లో పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాల్లో పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగుతోంది. ఆరోగ్యకరమైన సమాజ ఏర్పాటుకు రెండు పల్స్ పోలియోచుక్కలు అమృతం లాంటివని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. తణుకులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అధికారులతో కలిసి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. కృష్ణా జిల్లా పెడనలో బంటుమిల్లి బస్టాండ్‌నందు 'పల్స్ పోలియో' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రధాన కూడలిలో పల్స్ >>2

# ఉమ్మడి కుటుంబమే ముద్దు


ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమంలో చిన్నారికి చుక్కల మందువేస్తున్న సిఎం చంద్రబాబు

### పిల్లల పెంపకంలో తండ్రి బాధ్యత తీసుకోవాలి

### ఇప్పుడు సంతానం భారం కాదు.. సంపద

### పిల్లలు ఎక్కువ ఉంటే ప్రభుత్వంనుంచి ప్రోత్సాహం

### చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సిఎం క్యాంప్ కార్యాలయంలో పిల్లలకు పోలియో చుక్కలువేశారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి ఆప్యాయంగా మాట్లాడారు. పిల్లలను ఎత్తుకుని కొంతసేపు ఆడించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్నిరకాల టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పల్స్ పోలియో కార్యక్రమం అమలుకు చేసిన ఏర్పాట్లను కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో నేటి నుంచి మూడు రోజుల పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా 5 సంవత్సరాల లోపు ఉన్న సుమారు 49.20లక్షలమంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన పిల్లల తల్లిదండ్రులుతో సిఎం చంద్రబాబు ఈ సందర్భంగా మాట్లాడారు. పిల్లల పెంపకం భారంగాఉంటుందా అని అడిగి తెలుసుకు >>2


ఆదివారం ప్రధాని మోడీకి "గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజాన్" అవార్డు ప్రదానం చేస్తున్న సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మిని

## ప్రధాని మోడీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం

### 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజాన్'ను అందించిన అధ్యక్షుడు పాట్రిక్ హెర్మిని

**విక్టోరియా,జూన్ 28:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా సీషెల్స్ ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారమైన "గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజాన్"ను ప్రదానం చేసింది. హరిత భవిష్యత్తు కోసం ప్రధాని మోడీదార్శనికతను ఈ అవార్డు గుర్తించింది. ప్రస్తుతం ప్రధాని మోడీ మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్‌లో ఉన్నారు. ఆ దేశ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యటనలో భాగంగా ఆయన సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినితో సమావేశమయ్యారు. అంతకుముందు, ప్రధానికి స్టేట్ హౌస్‌లో గౌరవ వందనంలభించింది. ఈ సందర్భంగా, మేడ్ >>2

## బాంబులు దూస్తున్న ఇరాన్



### పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ జ్వాలలు

### కువైట్, బహ్రెయిన్‌లోని యుఎస్ స్థావరాలపై ఇరాన్ దాడులు

### ప్రపంచ పటంనుంచి ఇరాన్‌ను చెరిపేస్తాం: ట్రంప్ తీవ్ర హెచ్చరిక

**కువైట్ సిటీ, జూన్ 28:** పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు మరింత తీవ్రరూపం దాల్చాయి. తమ భూభాగంపై అమెరికా జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) సంచలన చర్యకు దిగింది. కువైట్, బహ్రెయిన్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బలగాలు ఆదివారం క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. ఈ ఆకస్మిక పరిణామంతో ఆ ప్రాంతంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా పక్కకుపోయి, ఉభయ దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధం మొదలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హర్ముజ్ జలసంధి సమీపంలో ఉన్న తమ క్షిపణి కేంద్రాలు, డ్రోన్ గిడ్డంగులు, తీరప్రాంత >>2


ఆదివారం తిరుమలలో అనంత్ అంబానీకి స్వామివారి చిత్రపటం బహుకరిస్తున్న టిటిడి అధికారులు

## టిటిడికి అనంత్ అంబానీ రూ. 27.5 కోట్ల భారీ విరాళం

### 25 ఎలక్ట్రిక్ బస్సులు సమర్పణ

### టిటిడి గోశాల ఆధునీకరణకు సమ్మతి

**తిరుమల,జూన్ 28ప్రభాతవార్తప్రతినిధి:** పారిశ్రామికవేత్త అనంత్ అంబానీ ఆదివారం వేకువజామున తిరుమల శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. ఆలయంలోనికి చేరుకున్న అనంత్ సుప్రభాతసేవలో కలియుగదైవాన్ని దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, రిసెప్షన్ డిప్యూటీ ఇఒ భాస్కర్ >>2

## రొట్టెల పండుగకు జన ప్రభంజనం

### 5 లక్షల మంది పైగా విచ్చేసిన భక్తులు

### ఉద్యోగం, వివాహం, సంతానం రొట్టెలకు డిమాండ్

### భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన అధికారులు


ఆదివారం రొట్టెల పండుగకు భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త - కలెక్టరేట్ :** నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు మూడో రోజు భక్తులు పోటేత్తారు. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. సుమారు 5 లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఎండ బాగా వున్నప్పటికీ భక్తుల రద్దీ కొనసాగింది. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజిత వేజెండ్ల, మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు >>2



## స్మార్ట్ కిచెన్లు చూసి ఓర్వలేని జగన్

### వైఎస్సార్ కడప జిల్లాలో 5 స్మార్ట్ కిచెన్లు పెట్టాం: మంత్రి నారా లోకేష్

**విజయవాడ. జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** స్మార్ట్ కిచెన్ల ద్వారా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు రుచి, శుచి, శుభ్రతతో కూడిన భోజనం పెడుతుంటే జగన్ గారు ఓర్వలేకపోతున్నారని ఎపి ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆరోపించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఉన్నవారితోపాటు అదనంగా మహిళలు, పేదలకు ఉపాధి కల్పిస్తుంటే ఉసూరుమంటున్నారు. ఆదివారం ఆయన "ఎక్స్" వేదికగా స్మార్ట్ కిచన్ వ్యవస్థపై చేసిన విమర్శలకు స్పందిస్తూ మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లాలో ఐదు స్మార్ట్ కిచెన్లు పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాం. ఈ స్కూళ్ల పరిధిలో పనిచేస్తున్న 233 మంది కుక్‌కమ్‌హెల్పర్లు యథావిధిగా తమ విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేయబోతున్న మరో 33 స్మార్ట్ కిచెన్ల పరిధిలో ఏ ఒక్కరి ఉపాధికీ ఢోకాలేదు. పైగా స్మార్ట్ కిచెన్ల నిర్వహణ ద్వారా స్వయంశక్తి సంఘ మహిళలకు 38 మంది హెడ్ కుక్స్, 22 మంది అసిస్టెంట్ కుక్స్, 256 మంది హెల్పర్లు, సుమారు 76 మంది డ్రైవర్లకు అదనంగా ఉపాధి కల్పించబో తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేయబోయే స్మార్ట్ కిచెన్లతో ఉన్నవారితోపాటు అదనంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తుంటే ఎందుకు ఏడుస్తున్నారు జగన్ గారు? పేదలు బాగుపడితే చూడలేరా? స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుతో వేతనాలు చెల్లించలేదని జగన్ ఆరోపించిన వైఎస్సార్ కడప జిల్లాలో పనిచేస్తున్న మొత్తం 3,450 మంది కుక్‌కమ్‌హెల్పర్లు ఏప్రిల్ 2026 నెల వరకు గౌరవ వేతనాలు పూర్తిగా చెల్లించేశాం. మే నెలలో పాఠశాలలకు వేసవి సెలవుల కారణంగా గౌరవ >>2

## ఆందోళన బాటలో ఆర్టీసీ ఉద్యోగులు

### 7,8న ఆర్టీసీ పరిరక్షణ దినం

### ప్రైవేటీకరణపై ఉద్యోగుల నిరసన

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిఎస్ ఆర్టీసీలో విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేట్ ఆపరేటర్లకు అవకాశం కల్పిస్తూ రూ.వేల కోట్లు విలువైన ఆర్టీసి డిపో స్థలాలను కూడా వారికి కట్టబెట్టడాన్ని నిరసిస్తూ ఉద్యోగులు మరోసారి నిరసనల బాట పట్టబోతున్నారు. దశల వారీగా ఆర్టీసీని ప్రైవేటుపరం చేయాలన్న ప్రభుత్వం ఆలోచనలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ చేస్తూ సంస్థ పరిరక్షణ, ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం, పిటిడి(ఆర్టీసి) ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న రెండవ దశ ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను ఇవాళ విజయవాడలో విడుదల చేశారు. విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఆర్టీసి ఉద్యోగసంఘాల జెఎసి సమావేశం జరిగింది. ఈ >>2

## 1నుంచి జిల్లాల్లో సిఎం పర్యటనలు

### హీరో మోటోకార్ప్, జీరాంజీ, రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభోత్సవాలు

**విజయవాడ, జూన్28, ప్రభాతవార్త ప్రతినిధి:** సిఎం నారా చంద్రబాబు నాయుడు జూలై 1వ తేదీ నుంచి వరుసగా పలు కార్యక్రమాల్లో పాల్గొనను న్నారు. 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఆయన పలు జిల్లాల్లో పర్యటించను న్నారు. జిల్లా పర్యటనల్లో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యమాల్లో సిఎం పాల్గొననున్నారు. 1వ తేదీ పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం కోసం నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలో పర్యటించ నున్నారు. అదే రోజు తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీ సిటీలో ద్విచక్ర వాహనాల సంస్థ హీరో మోటో కార్ప్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. దాదాపు రూ.750 కోట్ల పెట్టుబడులతో హీరో సంస్థ ఈ పార్ట్స్ సెంటర్ ను ఏర్పాటు చేస్తోంది. దీనికి శంకుస్థాపన చేయనున్నారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. 2వ తేదీ ఉదయం తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ ఆజీవికా మిషన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొం టారు. అదే రోజు సాయంత్రం తిరుపతి పట్టణంలో ప్రైవేటు హోటల్‌లో జరిగే జిఎస్‌డిపూ కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్ నకు హాజరవుతారు. >>2



## 22 రాష్ట్రాల్లో విస్తరించిన 'నైరుతి'

### ఎపి, తెలంగాణలో భారీ వర్షాలకు అవకాశం

### ఈశాన్యంలోనూ అధిక వర్షపాతం

### వాతావరణ శాఖ అంచనా

**న్యూఢిల్లీ, జూన్ 28:** నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా దాదాపు 22 రాష్ట్రాల్లో విస్తరించాయి. మరింతగా విస్తరిస్తున్నందున తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఉరుములు కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) అంచనా వేసింది. ఐఎండి ప్రకారం, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు రుతుపవనాలు ఉత్తర అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు గుజరాత్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లోకి మరింతగా విస్తరించడానికి తోడ్పడుతున్నాయి. తెలంగాణ, కోస్తా ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, లక్షద్వీప్ లలో భారీ వర్షాలు కురిసే అవకాశంఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఉరుములతో కూడిన వర్షాలు, మెరుపులు, బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. కర్ణాటకలో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉండగా, అండమాన్, నికోబార్ దీవులలోని కొన్ని ప్రాంతాలలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులతో కూడిన ఉరుములతోకూడిన ఈదురు గాలులు సంభవించవచ్చు. అసోం, మేఘాలయ, ఉపహిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం సహా >>2


## మినీ వాహనాన్ని ఢీకొన్న లారీ

### శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలో దుర్ఘటన, ముగ్గురు మహిళలు మృతి

**కవిటి (శ్రీకాకుళం జిల్లా), జూన్ 28 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం జమేదారిపుట్టుగ జాతీయ రహదారి సమీపంలో ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ముగ్గురు మహిళలు మృతి చెందిన వైనం చోటు చేసుకుంది. లారీ డ్రైవర్ మద్యం సేవించి వాహనం అతి వేగంగా నడపడమే ప్రధాన కారణంగా తెలియ వస్తోంది. కంచిలి మండలం మకరాంపురం ఆదివారం సంత నుంచి పనసకాయలోడుతో బరంపురం వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆదివారం సంత నుంచి పనస కాయలు కొని బరంపురం తరలించే క్రమంలో ఇచ్ఛాపురం ఎస్ఎన్ పేటకు చెందిన మద్దిలి తరిణమ్మ (62), కవిటి మండలం గుజ్జుపుట్టుగ గ్రామానికి చెందిన మురపాల పార్వతి (50) అలానే రాపాకపుట్టుగ గ్రామానికి చెందిన నర్తు పద్మమ్మ (60) మినీ వాహనంపై బరంపురం వైపు వెళుచుండగా వెనుక వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ >>2

29-06pg2exHMNWJQE_29-06pg2exHMNWJQE.qxd 28/Jun/26 11:42 PM Page 1





ఆదివారం భారత్-సీషెల్స్ మధ్య అవగాహనా ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరుదేశాల విదేశాంగ మంత్రులు

# బాంబులు దూస్తున్న ఇరాన్

>> రాడార్ స్థావరాలపై అమెరికా జరిపిన దాడులకు సమాధానంగానే తాము ఈ సైనిక చర్య చేపట్టినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను కువైట్ వైమానిక రక్షణ వ్యవస్థలు మధ్యలోనే అడ్డుకోగా.. బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక కేంద్రాల పరిసరాల్లో భారీ అలజడి రేగింది. ఈ దాడుల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

ఈ దాడుల అనంతరం ఇరాన్ నావికాదళం అమెరికాకు తీవ్ర హెచ్చరికలు చేసింది. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు 'నరకాన్ని చూస్తాయని' వ్యాఖ్యానించింది. అమెరికాయే మొదట శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, హర్మూజ్ జలసంధిలో తమ నిబంధనలను పాటించని నౌకలపై మరిన్ని కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇరాన్ గనుక ఇలాగే ఒప్పందాలను ఉల్లంఘిస్తూ పోతే వాషింగ్టన్ సైనికపరంగా ఈ కథను ముగించాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాంటి పరిస్థితి వస్తే ప్రపంచ పటంలో 'ఇరాన్ అనే దేశమే ఇకపై ఉనికిలో ఉండదు' అంటూ ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న 'కికు' అనే అంతర్జాతీయ చమురు నౌకపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడికి ప్రతిచర్యగా అమెరికా సైన్యం దాడులు ప్రారంభించిది. అమెరికా వరుసగా రెండోరోజు కూడా ఇరాన్ స్థావరాలను ధ్వంసం చేయడంతో ఇచాన్ క్షిపణి దాడులకు దిగింది. ఈ పరిణమాలతో ఇరు దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం పొంచి ఉంది.

# స్మార్ట్ కిచెన్లు చూసి ఓర్వలేని జగన్

>> వేతనాలు చెల్లింపు ఉండదు. జూన్ నెల ఇంకా పూర్తి కాలేదు. మరి జగన్ ఎవరి బకాయిలు గురించి ఫేక్ ఆరోపణలు చేశారో చెప్పాలి. స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుతో విద్యార్థులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన, ప్రమాణాలకు అనుగుణమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. పేద పిల్లలకు మంచి భోజనం పెట్టడం, ఆరోగ్యం ఉండడం కూడా సహించలేకపోతే ఎలా అండీ జగన్ అంటూ వ్యాఖ్యానించారు స్మార్ట్ కిచెన్ల ప్రధాన ఉద్దేశ్యం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన, ప్రమాణాలకు అనుగుణమైన మధ్యాహ్న భోజనం అందించడమేనని మంత్రి వివరించారు. ఆధునిక వంటశాలల ద్వారా ఆహార నాణ్యత మెరుగుపడటం ఉంటుందని చెప్పారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా వారి విద్యాభ్యాసంపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో మరో రెండురోజులు వానలు

## మంగళగిరిలో 68.2మిమీ, రాజాంలో 52.5మిమీ వర్షపాతం నమోదు

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపిలో ఆదివారం వివిధ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసాయి. సాయంత్రం 4 గంటల సమయానికి వాతావరణ సమాచారాన్ని అనుసరించి గుంటూరు జిల్లా మంగళగిరిలో 68.2మిమీ, విజయనగరం జిల్లా రాజాంలో 52.5మిమీ, గుంటూరు జిల్లా కాకుమానులో 51.5మిమీ, తాడేపల్లిలో 45.2మిమీ, ఎన్టీఆర్ జిల్లా కవులూరులో 41.5మిమీ, బాపట్ల జిల్లా భట్టిప్రోలు 39.9మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది.ఉత్తరాంధ్ర తీరప్రాంతం నుండి ఛత్తీస్‌గఢ్ మీదుగా మహారాష్ట్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.అంతర్గత కర్ణాటక నుండి రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు మరోక ద్రోణి విస్తరించి ఉందని పేర్కొన్నారు.దీని ప్రభావంతో మరో రెండు రోజులు మేఘావృతమైన వాతావరణంతో పాటు చెదురుమదురుగా మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కోస్తాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలకు అవకాశంఉందని పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలకు అవకాశం ఉందన్నారు.ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలని హెచ్చరించారు.

# ఉమ్మడి కుటుంబమే ముద్దు

>> న్నారు. ఉద్యోగానికి, ఉపాధికి వెళుతున్న మహిళలు పిల్లల పెంపకంలో ఎలా సమన్వయం చేసుకుంటున్నారని అడిగారు. ఇంట్లో భర్త, మగవాళ్లు కూడా పిల్లల పెంపకంలో బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా సిఎం అన్నారు. పిల్లల్ని కని, పెంచడం, వారి అలనాపాలనా చూసుకోవడం తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదని అన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉంటే పిల్లల పెంపకంలో భాగస్వాములు అయ్యేవారని అన్నారు. పిల్లలను విలువలతో పెంచడంలో నాడు అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర కుటుంబ సభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించేవారని గుర్తుచేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని.. అలాంటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ రావాలని సిఎం చంద్రబాబు అన్నారు. సంతానాన్ని సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలని.. సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోందని సిఎం అన్నారు. అందుకే ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నామని సిఎం అన్నారు. ఈ విషయంలో ముందుగా తల్లిదండ్రులకు అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబుతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్స్ పోలియో ప్రారంభం

>> పోలియో సెంటర్‌లు ఉన్నాయన్నారు. పాయకరావుపేటలో హోంమంత్రి వంగలపూడి అనిత, నందిగామ, జగ్గయ్యపేటల్లో ప్రభుత్వ విప్‌లు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), ఏలూరు.,కాకినాడ, గుంటూరు, శ్రీకాకుళం, విజయవాడ, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పల్స్ పోలియో కార్యక్రమాలు జరిగాయి. మంత్రుల అచ్చెన్నాయుడు, పి.శ్రీబాల వీరాంజనేయులు,గుమ్మడి సంధ్యారాణి, వాసంశెట్టి సుభాష్. కొండపల్లి శ్రీనివాస్.కందుల దుర్గేష్,నాదెండ్ల మనోహర్ తదితరలు ఆయా జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో సిఎం చంద్రబాబు భేటీ



ఆదివారం భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు.సీఎం వ్యక్తిగత కార్యాలయంలో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్‌తో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు లాస్ట్‌మైల్ ఇంటర్నెట్ సేవలను విస్తరించే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అలాగే రాష్ట్రంలో మొబైల్ టవర్ కనెక్టివిటీని పెంచేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ, డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులను ప్రోత్సహించే అవకాశాలు, సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటు వంటి కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. మొబైల్ సేవల సంస్థలకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత మెరుగు పరిచే చర్యలపైకూడా అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి డిజిటల్ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

29-06-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
పౌర్ణమి తె.5.26, మూల తె.4.03
వర్జ్యం : రా.2.16-తె.4.03
దు.ము.12.37-మ.1.29,
2) మ.3.14-సా.4.06
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** శ్రమకు ఓర్చి మీవంతు సహాయం అందిస్తారు. ఉచిత సలహాలు ఇవ్వకండి. పొదుపు పథకాలు అంది వస్తాయి.

**వృషభం:** దూరమైన ఆప్తులు దగ్గరవుతారు సంతాన విద్యావరంగా అభివృద్ధి కనిపిస్తుంది. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు.

**మిథునం:** అన్యాక్రాంతమైన భూములు, ఇవ్వవలసిన ఋణాలు మొదలయిన విషయాలన్నీ మీకు అనుకూలంగా ఉంటాయి.

**కర్కాటకం:** సంతాన క్షేమం పురోభివృద్ధి సాధిస్తారు. కాలానుగుణంగా ప్రవర్తించడమే విజయానికి మార్గమని గుర్తించండి.

**సింహం:** ప్రముఖులతో చర్చలు సాగిస్తారు. ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** క్రెడిట్‌కార్డు, పాస్‌పోర్టు వంటివి ఇతరులకు అప్పగించవద్దు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**తుల:** పొలము, స్థిరాస్తుల తాలూకు ధనము చేతికి వస్తుంది. తప్పుడు లెక్కలు, అబద్ధములు మీ దృష్టికి వస్తాయి.

**వృశ్చికం:** సన్మానాలు, సత్కారాలతో హడావిడిగా కాలం గడుపుతారు. నరఘోష అధికమవుతుంది. బంధువుల కలయిక.

**ధనుస్సు:** కుటుంబంలో ఏర్పడే స్పర్థలు చిన్నపాటి వివాదాలు సర్దుకుంటాయి. దీర్ఘకాలిక సమస్యలను మాత్రం కాలానికి వదిలివేస్తారు.

**మకరం:** ఎంత సాధించినా ఇంకా సాధించాలనే తృప్తి లేని ధోరణి మానసిక ప్రశాంతతను దూరం చేస్తుంది.

**కుంభం:** ఆదర్శప్రాయంగా జీవితం గడపాలనుకొని అందుకు తగిన విధంగా ప్రణాళికలు రూపొందించుకుంటారు.

**మీనం:** ప్రభుత్వ సంబంధమైన చిక్కులను అతియుక్తిగా తప్పించుకోగలుగుతారు. వాహనాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఆదివారం న్యూఢిల్లీలో రాష్ట్రీయ గ్రామీణ వికాస్ సమ్మేళన్'ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తదితరులు

# మోడీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం

>> ఇన్ ఇండియా ఫాస్ట్ ప్యాట్రోల్ వెసెల్ పీఎస్ లెస్‌ప్వార్‌తో పాటు ఆరు అంబులెన్స్‌లు, 10 యుటిలిటీ వాహనాలు, ఐదు లేజర్ రేడియల్ బోట్లను సీషెల్స్‌కు ప్రధాని మోడీ అందజేశారు. ఈ సహాయం సీషెల్స్ సముద్ర నిఘా సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది. అనంతరం ఇరు దేశాల నేతలు కలిసి సీషెల్స్ నేషనల్ బొటానికల్ గార్డెన్‌లో అరుదైన కోకో డి మెర్ మొక్కను నాటారు. ప్రధాని మోడీకి అంతర్జాతీయ పురస్కారాలు రావడం ఇదే తొలిసారి కాదు. ఈ యేడాది మే నెలలో ఆహార భద్రతకు చేసిన సేవలకు గాను ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ అత్యున్నత పురస్కారం అగ్రికోలా మెడల్ అందుకున్నారు. గతంలో 2018లో సియోల్ శాంతి బహుమతి, ఐక్యరాజ్యసమితి ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డులు కూడా ఆయనను వరించాయి.

# 22 రాష్ట్రాల్లో విస్తరించిన 'నైరుతి'

>> ఈశాన్య రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి హెచ్చరిక జారీ చేసింది. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ, బీహార్, హర్యానాలలో వడగాలుల పరిస్థితులు కొనసాగే అవకాశం ఉంది.

**జులై 4 వరకు తెలంగాణలో భారీ వర్షాలు**

రాబోయే ఏడు రోజులలో తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన గాలులు, ఈదురు గాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఐఎండి అంచనాల ప్రకారం, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, అక్కడక్కడా మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో గాలి వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు చేరవచ్చు. ఈ వాతావరణ పరిస్థితుల కారణంగా తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. ఆదివారం సంగారెడ్డిలో గరిష్ఠ ఉష్ణోగ్రత 28 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో 30.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్‌లో రాబోయే రోజుల్లో వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులతో పాటు ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. జులై 1 వరకు అడపాదడపా జల్లులు పడే అవకాశముంది. నగరంలోని కొన్ని ప్రాంతాలు, చుట్టుపక్కల ప్రాంతాలలో మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో చెదురుమదురుగా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# రూ. 27.5 కోట్ల భారీ విరాళం

>>అనంత్ అంబానీకి దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం ఆలయ పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు.స్వామివారి చిత్రపటం బహుకరించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఆయన టిటిడికి భారీ విరాళం ప్రకటించారు. దాదాపు 27.5 కోట్ల రూపాయలతో 25 ఎలక్ట్రిక్ బస్సులు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ఈ బస్సుల నిర్వహణ, డ్రైవర్ల జీతాలు కూడా తామే భరిస్తామని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెల్లడించారు. అనంతరం ఆలయం వెలుపల టిటిడి అధికారులతో మాట్లాడిన అనంత్ అంబానీ తిరుమలలో జరుగుతున్న సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. బస్సుల నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కూడా నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే రిలయన్స్ సంస్థ గుజరాత్ వంతారాలో నిర్వహిస్తున్న టిటిడి గోశాల ఆధునికీకరణకు అంగీకారం తెలిపారు. టిటిడి అధికారులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

# ఆందోళన బాటలో ఆర్టీసీ ఉద్యోగులు

>> సమావేశంలో జేఏసీ కమిటి తీసుకున్న నిర్ణయాల మేరకు రెండవ దశ ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను లిఖితపూర్వకంగా రేపు సిఎం, సిఎస్, రవాణామంత్రి, ఆర్టీసి ఎండి, ఇతర అధికారులకు అందించనున్నారు. ఇందులో జూలై 7, 8న రెండు రోజులు "ఏపీఎస్ ఆర్టీసీ పరిరక్షణ దినం" గా పాటిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి ఉద్యోగులందరూ డిమాండ్లతో కూడిన ప్రింటెడ్ బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తారు.జూలై 9 నుండి 18 వరకు ప్రజాప్రతినిధుల మద్దతు కోరే కార్యక్రమం నిర్వహిస్తారు. జూలై 19 నుండి 26 వరకు వినతిపత్రాలపై ఆర్టీసిలో ఉద్యోగులందరితో సంతకాల సేకరణ చేస్తారు. జూలై 27న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ల ద్వారా సీఎంకు ఉద్యోగుల సంతకాల సేకరణతో కూడిన వినతిపత్రాలను అందిస్తారు. జూలై 30న జేఏసీ రాష్ట్ర స్థాయి సమావేశం విజయవాడలో నిర్వహించి, మూడవ దశ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తారు.

# మినీ వాహనాన్ని ఢీకొన్న లారీ

>> మద్యం సేవించి అప్రమత్తంగా వాహనాన్ని నడిపే క్రమంలో మినీ వాహనానికి లారీ బలంగా ఢీకొంది. మినీ వాహనం విద్యుత్ స్తంభానికి ఢీకొని పక్కనే ఉన్న పొలాల్లో పడిపోయింది. తరినమ్మ, మురపాల పార్వతి, ఎన్ పద్మమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు గాయాల పాలయ్యారు. మిగిలిన వారిలో ఒకరు పరిస్థితి ఇబ్బందికరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బరంపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కవిటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 1నుంచి జిల్లాల్లో సిఎం పర్యటనలు

>> ఈ వర్క్ షాప్‌నకు నీతి ఆయోగ్ సభ్యులతో పాటు, పిఎం ఎకనమిక్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు హాజరవుతారు. రెండవ తేదీ రాత్రి తిరుపతిలోనే సిఎం బస చేస్తారు. 3వ తేదీ ఉదయం కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ప్రారంభించనున్నారు.

అనంతరం మూడు రోజుల పర్యటనలో భాగంగా అక్కడి నుంచి సిఎం చంద్రబాబు కుప్పం బయలుదేరి వెళతారు. 3 తేదీ నుంచి 5 వతేదీ వరకు సిఎం కుప్పంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. 5వ తేదీన అమరావతికి తిరిగి చేరుకుంటారు.

# కూరగాయలు వ్యాన్ బోల్తా

## 10 మందికి తీవ్రగాయాలు

**వరదయ్యపాలెం, జూన్ 28 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం చిన్నపాండురు వికెఆర్ కాలనీ వద్ద కూరగాయలు వ్యాన్ బోల్తా పడి 10 మందికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. సత్యవేడు మండలంకు చెందిన వారు కూరగాయలు వ్యాన్‌లో సంతకు వెళుతుండగా ప్రమాద శాత్తు చిన్నపాండురు వి కె ఆర్ కాలనీ దగ్గర బోల్తా పడిపోయింది. అందులో వున్న 10 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు.

గాయపడిన వారిలో చెన్నై హాస్పిటల్‌లో 6 మంది, తిరుపతి రుయా హాస్పిటల్‌లో ముగ్గురు వ్యక్తులు చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. కాయగూరల వ్యాపారం చేసేందుకు సంతకు వెళ్లి ప్రమాదానికి గురైన వారిలో ఈశ్వరన్ (50), కంసాల (40), పాండియన్ (41), మురళి (49), వేండ (45), నాగభూషణమ్మ (60), గోపి (50), వసంతమ్మ (65),వనిత (46)లు వున్నారు. వారిలో ఆందోళన కరంగా వున్న వారిలో ఈశ్వరన్ (50), కంసాల( 40), పాండియన్ (41),మురళి (49), వేండ(45),వనిత (46)లు ఉన్నట్టు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం దిగ్భ్రాంతి చెందారు. ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌కి చరవాణి ద్వారా సమాచారం తెలిపారు.

# తోతాపురి మామిడి రైతులకు కేంద్రం అండగా నిలవాలి

## 7.03 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లకు రూ.281 కోట్ల ఆర్థిక సహకారం ఇవ్వాలి

## మామిడి రైతుల కోసం ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం అమలు చేయాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 28, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని అధిగమించేందుకు చొరవ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సిఎం లేఖ రాశారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ పరిణామాలతో మ్యాంగో పల్ప్ ఎగుమతులు నిలిచిపోవడం, పరిశ్రమలు కొనుగోళ్లు నిలిపివేయడంతో మార్కెట్‌లో తోతాపురి ధరలు పడిపోయాయని లేఖలో పేర్కొన్నారు. మామిడి రైతులను ఆదుకునేందుకు కేంద్రం రూ.281 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి ఆ లేఖలో కోరారు. దేశంలోనే మామిడి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని, రాష్ట్రవ్యాప్తంగా 3.99 లక్షల హెక్టార్లలో సాగవుతూ 52.65 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందని చంద్రబాబు వివరించారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల్లో దాదాపు 91,011 హెక్టార్లలో తోతాపురి రకం సాగవుతోందని తెలిపారు. దీని ద్వారా 8.65 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తూ లక్షలాది రైతు కుటుంబాలకు జీవనాధారంగా ఉందని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుత సీజన్‌లో పెట్టుబడి వ్యయం పెరగడం, మార్కెట్ ధరలు కుప్పకూలడంతో మామిడి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని లేఖలో పరిస్థితిని వివరించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని 7.03 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి కొనుగోళ్లకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం అమలు చేస్తున్నట్టు సీఎం లేఖలో వెల్లడించారు. దీంట్లో భాగంగా కిలోకు అదనంగా రూ.4 చొప్పున మామిడి రైతులకు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ మేరకు పీడీపీఎస్‌కింద కేంద్రం మద్దతివ్వాలని... ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు జరిగే ఈ కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీంను అమలు చేసేలా చూడాలని కేంద్రమంత్రికి రాసిన లేఖలో ముఖ్యమంత్రి కోరారు.

# రొట్టెల పండుగకు జన ప్రభంజనం

>> మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

**కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం**

కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ఉద్యోగం, వివాహం, సంతాన రొట్టెలకు డిమాండ్ పెరిగింది. జిల్లా యంత్రాంగం పటిష్టంగా చేపట్టిన ఏర్పాట్ల పట్ల సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీస్ కంట్రోల్ రూం 24 గంటలు అనౌన్స్మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు. భక్తులు పోగొట్టుకున్న పర్సులను అందిస్తున్నారు. దీంతో పోలీసు కంట్రోల్ రూం సేవలను అందరూ శభాష్ అని మెచ్చుకుంటున్నారు.

**పారిశుద్ధ్య సిబ్బంది సేవలు భేష్..**

దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదరాన్ని తొలగిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా శుభ్రపరుస్తున్నారు. దీంతో దర్గా పరిసరాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ నందన్, హెల్త్ ఆఫీసర్ చైతన్య ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

**వైద్య శిబిరాలను వినియోగించుకుంటున్న భక్తులు**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేక వైద్యులను, సిబ్బందిని బ్యాచ్‌ల వారీగా నియమించి 24 గంటలూ భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. మెరుగైన వైద్యంకోసం భక్తులను అంబులెన్స్‌లద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నారు. మూడురోజుల్లో సుమారు 3000 మంది పైగా భక్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత తెలిపారు.

**అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ..**

స్వర్ణాల చెరువులో ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. 24 గంటలూ అప్రమత్తంగా బోట్లు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచారు.

29-6Pg3exHMNWJQESLT_29-6Pg3exHMNWJQESLT.qxd 28/Jun/26 11:12 PM Page 1



# 'స్మార్ట్ కిచెన్స్'పై ఆరోపణలన్నీ నిరాధారం



- స్పష్టతను ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో అమలువుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్మార్ట్ కిచెన్స్ విధానంపై వస్తున్న ఆరోపణలను ఏపీ ప్రభుత్వం ఖండించింది. ఈ మేరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. పభుత్వం ప్రతిపాదిస్తున్న స్మార్ట్ కిచెన్లపై కొందరు రాజకీయ స్వార్థంతో చేస్తున్న ఆరోపణలు ముమ్మాటికీ అవాస్తవం, ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర మాత్రమేనని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేసింది. విద్యార్థుల ఆరోగ్యమే పరమావధిగా స్మార్ట్ కిచెన్స్ లక్ష్యం ఏర్పాటు అని ప్రకటనలో వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులకు మరింత సమర్థవంతంగా, అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించే ఏకైక సంకల్పంతోనే ప్రభుత్వం స్మార్ట్ కిచెన్స్ విధానాన్ని పరిశీలిస్తోంది. ఆధునిక సాంకేతికతను జోడించి విద్యార్థుల ఆరోగ్య భద్రతను మెరుగుపరచడం ప్రభుత్వ బాధ్యతని ప్రకటనలో ప్రభుత్వం వివరించింది.

**కార్మికుల తొలగింపు లేదు, ఉపాధికి పూర్తి భద్రత:** స్మార్ట్ కిచెన్ల పేరుతో వంట కార్మికులను తొలగిస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదు. ఎక్కడా, ఒక్క కుక్‌ను కూడా తొలగించడం లేదు. దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న దాదాపు 85 వేల మంది అక్కచెల్లెమ్మల సేవలను ప్రభుత్వం పూర్తిగా గౌరవిస్తుంది. వారి సంక్షేమానికి, ఉపాధి భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. కార్మికుల పొట్ట గొట్టే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు.

**జీతాల బకాయిలపై స్పష్టత:** మధ్యాహ్న భోజన కార్మికులకు ఇప్పటికే ఈ ఏడాది ఏప్రిల్ నెల వరకు జీతాలను/ గౌరవ వేతనాలను పూర్తిగా చెల్లించడం జరిగింది. సాంకేతిక కారణాల వల్ల నిలిచిన మిగిలిన స్వల్ప బకాయిలను కూడా త్వరితగతిన విడుదల చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు సమకూర్చింది. అతి త్వరలోనే ఈ నిధులు కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయి. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన దాదాపు రూ.350 కోట్ల పైచిలుకు బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం విజయవంతంగా విడుదల చేసింది. ఈ నిధులలో పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల జీతాలతో పాటు, విద్యార్థులకు అందించే గుడ్లు, చిక్కీలు, శానిటరీ నాప్‌కిన్ల వెండర్లకు సుదీర్ఘకాలంగా ఇవ్వాల్సిన బకాయిలు కూడా కలిసి ఉన్నాయి; దీనితో లబ్ధిదారులందరికీ పెద్ద ఉపశమనం లభించింది.

**రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం వద్దు:** విద్యార్థులకు మేలు చేసే సంస్కరణలను, కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే చర్యగా చిత్రీకరించడం శోచనీయం. రాజకీయ ఉనికి కోసం, ప్రజల్లో అభద్రతా భావాన్ని సృష్టించడానికి చేస్తున్న ఇలాంటి నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మవద్దు. విద్యార్థులకు సురక్షితమైన, పోషకాహారం అందించడంతో పాటు అటు మధ్యాహ్న భోజన కార్మికుల సంక్షేమాన్ని, వారి హక్కులను కాపాడటానికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా పునరుద్ఘాటిస్తున్నాము. కార్మికులు ఎలాంటి ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తెలిపింది.

# పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

## బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత



**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుతో కలిసి మధురానగర్‌లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేసి మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ పోలియో నిర్మూలనకు ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తమ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశయాలకు అనుగుణంగా, భావితరాల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. సుమారు రూ.6.5 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని అన్ని సచివాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మొబైల్ పోలియో బూత్‌ల ద్వారా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చిన్నారికి రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ అందించి, ఆంధ్రప్రదేశ్‌ను సంపూర్ణ పోలియో రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోలియో రహిత భారతదేశ నిర్మాణమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పోలియో నిర్మూలనపై విస్తృత ప్రచారం నిర్వహించి, తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలియో పూర్తిగా నిర్మూలన కావడం ప్రభుత్వాల సమిష్టి కృషి ఫలితమని, ఈ మహమ్మారి మళ్లీ ప్రబలకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే పల్స్ పోలియో కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వానికి అధికారం ఒక అలంకారం కాదని, ప్రజాసేవ అనే బాధ్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రజలకు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రి సద్వినియోగం చేసుకుని తమ చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో డిఎమ్ అండ్ హెచ్ఒ జె.ఇందుమతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రీతి అభిషా, జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి బి.శరత్ బాబు, జిల్లా హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.నవీన్ కుమార్, రోటరీ క్లబ్‌కు చెందిన వై.పార్థసారథి, కె.మధు, మధురానగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



## జలవిహారంలో సేదదీరిన పద్మావతిదేవి

**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మ వార్షిక తెప్పోత్సవాల్లో ఆదివారం సాయంత్రం పద్మసరోవరంలో సిరులతల్లి పద్మావతిదేవిగా తెప్పపై విహరించి భక్తులకు దివ్యదర్శనం ప్రసాదించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తికి పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకం జరిపారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేసి, తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, ఆలయ డిప్యూటీ ఇఒ పి. హరీంద్రనాథ్, ఎవిఎస్ఒ రాధాకృష్ణ, సూపరింటెండెంట్‌లు సురేష్, రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చలపతి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## తిరుమలలో 5,255 మంది పిల్లలకు పోలియో చుక్కలు



**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్త పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయం వద్ద పల్స్ పోలియో కార్యక్రమాన్ని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ప్రారంభించారు. పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. టిటిడి ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ఎస్.కుసుమ కుమారి ఆధ్వర్యంలో తిరుమలలో 25 ప్రాంతాలలో పల్స్‌పోలియో కేద్రాలు పనిచేశాయి. శ్రీవారి ఆలయంతో కలిపి 21ప్రాంతాలలో భక్తులకు, 4ప్రాంతాలలో స్థానికులకు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అశ్విని ఆసుపత్రి, జియన్‌సి, ఆర్‌టిసి బస్టాండ్, సిఆర్ఓ, పిఏసి 1, 2, ఎంబిసి 34, వైకుంఠం 1, 2, హెల్త్ ఆఫీసు, ఎటిసి, మేదరమిట్ట, వరాహస్వామి, రాంభగీఛ అతిథి గృహలవద్ద, శ్రీవారి ఆలయం లోపల, కల్యాణకట్ట, బాలాజీ నగర్, టిటిడి ఉద్యోగుల డిస్పెన్సరి ఎస్.వి. హైస్కూల్, పాపావినాశనం, అలిపిరి కాలినడక మార్గంలో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో కలిపి మొత్తం 5,255 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

## తిరుమల సమాచారం



### స్వర్ణకవచంలో శ్రీభూసమేత మలయప్ప

**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి ఆలయంలో ఆగమోక్తంగా మూడు రోజులు జరిగిన జ్యేష్ఠాభిషేకం ఆదివారం శాస్త్రోక్తంగా ముగిసింది. చివరిరోజు ఆదివారం ఉభయదేవేరులతో కలిసి మలయప్ప స్వామి బంగారు కవచంలో పునః దర్శనమిచ్చారు. మళ్లీ జ్యేష్ఠాభిషేకం వరకు సంవత్సరం పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచంతోనే ఉంటారు. ఉదయం మలయప్పస్వామి ఉభయదేవేరులతో కలిసి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహా శాంతి హోమం నిర్వహించారు. మలయప్ప స్వామికి, దేవేరులకు స్నపనతిరుమంజనం చేపట్టారు. అనంతరం స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవలో స్వామి, అమ్మవార్లు బంగారు కవచంలో దర్శనమిచ్చారు. ఆ తరువాత ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షి ంచారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు సదాశివరావు, జానకిదేవి, సుచిత్ర ఎల్లా, డిప్యూటీ ఇఒ

## అన్ని రంగాలలోనూ ఎపి అగ్రగామి

- అమరావతి నిర్మాణం వేగంగా పూర్తికావాలి: మంత్రి దుర్గేష్

**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** విజన్ ఉన్న నేత, సిఎం చంద్రబాబునాయుడు, డి.సిఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలోనూ అగ్రగామిగా దూసుకుపోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. అత్యంత నిష్ఠతో చాతుర్మాస దీక్షను స్వీకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీక్ష ఎటువంటి విఘ్నాలు లేకుండా, నిరాకంటంగా, దిగ్విజయంగా పూర్తికావాలని ఏడుకొండలస్వామినివేడుకున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, ప్రజల శ్రేయస్సు కోసం ఆయన పడుతున్న తపన, చేస్తున్న కృషి సంపూర్ణంగా సఫలీకృతం కావాలని, అందుకు ఆ భగవంతుని కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షి ంచారు. మన ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా, అత్యంత వేగం పుంజుకుని, ప్రజలందరి ఆకాంక్షలకు ప్రతిరూపమైన అద్భుత రాజధానిగా త్వరలోనే సాకారం కావాలని స్వామివారి పాదాల చెంత ప్రార్థించినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర సంక్షేమం, ప్రజా రాజధాని నిర్మాణంపై శ్రీవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని ఆశిస్తున్నానన్నారు. ఆదివారం ఉదయం నిడదవోలు జనసేన నాయకులతో కలిసి తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం ఉదయం ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు



# ఏడుకొండలస్వామీ... ఎక్కడున్నావయ్యా!

- వెంకన్న దర్శనానికి కిలోమీటర్లు క్యూలు



**తిరుమల, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** దాదాపు 1.50లక్షల మందికి పైగా భక్తులు తిరుమలకు తరలిరావడంతో ఆదివారం కూడా కొండంతా భక్తజనంతో నిండిపోయింది. శనివారం రాత్రికే సామాన్య భక్తులు శ్రీవారి దర్శనం కోసం 28 గంటలపైగా నిరీక్షించాల్సి వచ్చింది. ఆదివారం ఉదయానికి మరింతమంది భక్తులు దేశం నలుమూలల నుండి భారీగా తరలిరావడంతో ఐదు కిలోమీటర్లు దూరం క్యూలైన్లు వ్యాపించాయి. చంటిపిల్లలు, చిన్నారులతో పెద్దలతో, వృద్ధ భక్తులు గోవింద నామస్మరణతో క్యూలైన్లలోనే పడిగాపులు కాస్తున్నారు. ఆదివారం ఉదయానికి కూడా బాటగంగమ్మ ఆలయం వరకు భక్తుల లైన్లు వ్యాపించాయి. శనివారం అర్ధరాత్రి వరకు 85,582మంది భక్తులకు మహాలఘులో శ్రీవారి దర్శనం చేయించారు. 4.66లక్షల లడ్డూలు అమ్మకాలు జరిగాయి. కానుకల రూపంలో హుండీకి రూ.3.72 కోట్ల ఆదాయం చేకూరింది. ముందే ఊహించిన టిటిడి అధికారులు ఒక పథకం ప్రకారం వ్యూహాత్మకంగా ముందుగానే శ్రీవారి సేవకులను సిద్ధంచేసి వెలుపల క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, కాఫీ, పాలు అందించినా క్యూలైన్లలోనికి చేరుకోలేని భక్తులు ఖాళీస్థలాల్లో, కాటేజీల ప్రాంతాల్లో నిరీక్షించడం కనిపిస్తోంది. వీరికి కనీస సౌకర్యాలు అందక అవస్థలు పడుతున్నారు. ఇదే నేపధ్యంలో అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి క్షణకాల దర్శనం కోసం రోజుకు లక్షలాదిమంది భక్తులు దేశం నలుమూలల నుండి తరలివస్తున్నారు. వచ్చిన ప్రతి భక్తునికి సంతృప్తికర దర్శనమ్ కల్పించే మాట ఎలా ఉన్నా అనూహ్యంగా భారీగా భక్తులు తరలివస్తే ఆలయం వెలుపల కిలోమీటర్లు దూరం క్యూలైన్లు బారులు తీరి భక్తులు గంటల తరబడి నిరీక్షిస్తుండటం పరిపాటిగా మారింది. వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం సాధారణ రోజుల్లోనే లక్షమంది వరకు భక్తులు కొండపైకి వస్తే వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62 కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కో కంపార్టుమెంట్‌లో 400మంది లెక్కన 25వేల మంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఆ తరువాత వచ్చిన సామాన్యభక్తులు ఏటిసి, నారాయణగిరి ఉద్యానవనాల మీదుగా శిలాతోరణం, బాటగంగమ్మ ఆలయం, గోగర్భమ్ డ్యామ్ వరకు విస్తరించిన క్యూలైన్లలో నుండి ఆలయంలోనికి చేరుకోవాల్సి ఉంది. అదేగాక 60వేల మంది భక్తులు దాటితే ఇక క్యూలైన్లు చాంతాండంత దూరం వ్యాపిస్తాయి. సర్వదర్శనానికి రద్దీరోజుల్లో, వారాంతం రోజుల్లో ఏకంగా 30 గంటలు నిరీక్షించాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వేల కిలోమీటర్లు దూరం నుండి ఇష్టదైవమ్ దర్శనానికి వస్తున్న భక్తులకు వెలుపల క్యూలైన్లలోనే దేవుడు కనిపిస్తుంటాడు. ఈ విధానం లో మార్పు తీసుకువచ్చి సామాన్య భక్తులకు క్యూలైన్లు చేరువచేయడం ప్రస్తుతం టిటిడి అధికారులకు ఉన్న తక్షణ కర్తవ్యం. టిటిడి అధికారులు భక్తులు సంయమనం పాటించాలని, దర్శనం సమయం వచ్చేవరకు ఓపికతో ఉండాలని ప్రసార సాధనాల ద్వారా ప్రచారం చేయడం పరిపాటిగా మారింది. 18, 24గంటలు వరకు క్యూలైన్లలోకి రావద్దని విజ్ఞప్తి చేస్తుంటారు. అయితే ప్రత్యామ్నాయం మాత్రం ఆలోచన చేయడంలేదు.

### క్యూలైన్లు కుదింపు పై అధ్యయనం ఏదీ!?:

ఏడుకొండలవాడా నామస్మరణతో తిరుమలకు వస్తున్న సామాన్యభక్తులు ఆలయాన్ని చేరుకునేందుకు కిలోమీటర్లు దూరం విస్తరించిన క్యూలైన్లలో అవస్థలు తప్పడంలేదు. వైకుంఠమ్ కంపార్టుమెంట్లు నిండితే ఇక సామాన్యభక్తులు ఎక్కడ నుండి వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవాలనేది అర్థంకాని ప్రశ్నగా మారింది. ఇప్పటికీ తిరుమలేశుని దర్శనం కోసం టిటిడి అధికారులు రోజువారీగా ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలు, కాలినడక భక్తులకు దివ్యదర్శనమ్ దర్శనాలు, సామాన్యభక్తులకు సర్వదర్శన టైమ్‌స్లాట్ దర్శనాలు, సాధారణ సర్వదర్శనం దర్శనాలు అమలవుతున్నాయి. ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్లు లేని భక్తులు నేరుగా తిరుమలకు వస్తే గతంలో వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్ వద్ద క్యూలైన్లలో నుండి భక్తులు ఆలయంలోనికి చేరుకునే విధానం ఉండేది. ఇప్పుడు సామాన్య భక్తులు ఈ దరిదాపుల్లోకి కూడా రావడం లేదు. తిరుమలలో సులభంగా భక్తులు ఆలయంలోనికి చేరుకునేందుకు వీలుగా వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం అవసరమనేది భక్తుల నుండి వస్తున్న సూచనలు. 2014వ సంవత్సరంలోనే వైకుంఠమ్ 1కు సమీపంలో ఏటిసి వద్ద ప్రత్యేక ప్రవేశ దర్శనాల కాంప్లెక్స్‌ను, కాలినడక భక్తులకు దివ్యదర్శనం కాంప్లెక్స్‌కు అప్పటి టిటిడి ఇఒ డాక్టర్ సాంబశివరావు ముందుచూపుతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రెండు విధానాల్లో టిక్కెట్లు ఉన్న భక్తులు నేరుగా ఈ కాంప్లెక్స్‌ల వద్దకు చేరుకుని ఆలయంలోనికి వెళ్ళేవారు. అయితే ఇప్పుడు ఈ విధానం అమలు కాకపోగా కిలోమీటర్లు బారులుతీరిన క్యూలైన్లు సామాన్యభక్తుల ఓపికను పరీక్షించేలా టిటిడి అధికారులు వ్యవహరిస్తున్నారు. అధికారులు తమదైన రీతిలో విధానాల్లో మార్పులు తీసుకుంటూ సామాన్యభక్తులకు దర్శనంలో చుక్కలు చూపిస్తున్నారనేది విమర్శలు.

### వెంకన్న దర్శనానికి 24గంటలు

### నేడు విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

వరుసగా మూడురోజులు సెలవులు రావడం, వారాంతంతో మూడురోజులుగా తిరుమల భక్తజన సంద్రంగా మారింది. ఇష్టదైవమ్ దర్శనానికి భక్తులు భారీగా చేరుతున్నారు. ఆదివారం ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల బాటగంగమ్మ ఆలయం వరకు ఐదు కిలోమీటర్లు క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 24గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి పదిగంటల పైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. టైమ్‌స్లాట్ భక్తులకు పదిగంటల సమయం పడుతోంది. గదులు దొరకని భక్తులు ఆరుబయట, పార్కుల్లో, షెడ్లలో తలదాచుకుని విశ్రాంతి పొందుతున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 49వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 30వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. భక్తులు భారీగా తిరుమలకు చేరుకోవడంతో గదులు దొరక్క అవస్థలు తప్పడం లేదు. తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా ఉండటంతో అలిపిరి సెక్యూరిటీ తనిఖీ కేంద్రం వద్ద తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. భారీ రద్దీ వేళ ఒకేసారి వేలాది ప్రైవేట్ వాహనాలు అలిపిరి సెక్యూరిటీ చెక్ పోస్టు వైపు దూసుకురావడంతో, కపిలతీర్థం, లీలామహల్ బైపాస్ రోడ్లపై భారీ వాహనాల సందడి నెలకొంది.

# భక్తజనసంద్రంగా కాణిపాకం ఆలయం



**కాణిపాకం, జూన్ 28 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి ఆలయం భక్తుల రద్దీతో కాణిపాకం కిటకిటలాడింది. సాధారణంగా ఆలయంలో వారాంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శుక్ర, శని, ఆదివారాలు వరుస సెలవు రోజులు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. ఈమేరకు గత నాలుగు రోజులుగా ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అలాగే ఆలయ క్యూలైన్లు వద్ద భక్తులకు దేవస్థానం తరపున ఉచితంగా మజ్జిగ, త్రాగునీరు, సాంబారు అన్నం అందించారు. దీనితో పాటు వేసవి ఉపశమన చర్యల్లో భాగంగా కూలైన్లు వద్ద కూలర్లును ఏర్పాటు చేశారు.

# జులై ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు రూ.2711.79 కోట్లు విడుదల

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా జులై నెలలో 62,19,648 మంది పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసేందుకు రూ.2711.79 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలయింది. జులై 1వ తేదీ ఉదయం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఈ పెన్షన్లు పంపిణీ చేస్తామని, కొత్తగా మంజూరైన 7,792 మంది వితంతు లబ్ధిదారులకు జులై 1న పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం రూ.3.12 కోట్లను విడుదల చేసినట్టు మంత్రి తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు పెన్షన్ల కోసం ఈ నెల విడుదల చేసిన నిధులతో కలుపుకుని రూ.68,598.44 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని, నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నిధులను ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారులకు అందిస్తోందని మంత్రి కొండపల్లి తెలిపారు.

# దుర్గమ్మకి బంగారు ఆభరణాల కానుక



**ఇంద్రకీలాద్రి, జూన్ 28 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీ దుర్గమ్మకి విజయవాడకు చెందిన కొండవీటి ఈశ్వరరావు, మాధవి దంపతులు రు.5లక్షల విలువైన బొట్టు, భూలాకి, నత్తులను చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు ఆదివారం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషశస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**వేదోక్తంగా సూర్యఉపాసన:** దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా ఆదివారం సూర్య ఉపాసన జరిగింది. పండితులు వేదమంత్ర పఠనాలను గావిస్తూ శ్రీ స్వామివారికి పూజాదికాలు నిర్వహించారు. ఆదిత్య హృదయం, ద్వాదశాదిత్య మంత్రరాజం, అరుణపారాయణ, సూర్యాష్టకం, సూర్యస్తుతి పఠనలు గావిస్తూ సూర్యనమస్కారాలు సమర్పించారు. పూజాదికాలనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.



**నేడు గిరిప్రదక్షిణ:** శ్రీ దుర్గమ్మ వేంచేసియున్న ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షణ ఈనెల 29న సోమవారం ఉదయం 5.55 గంటలకు ప్రారంభవుతుందని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. పౌర్ణమి పర్వదినాన ఘాట్‌రోడ్డు వద్ద వున్న శ్రీ కామధేను అమ్మవారి ఆలయం వద్దనుండి గిరి ప్రదక్షిణ ప్రారంభమై కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితార, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా శ్రీ మల్లిఖార్జున మహా మండపమునకు చేరుకుంటుందన్నారు.

**భక్తుల విరాళాలు:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు రవీంద్రభారతి విద్యాసంస్థ చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ రు.1,11,111ల విరాళాన్ని ఆదివారం అందించారు. అలాగే దుర్గమ్మ ఆలయాభివృద్ధి కోసం ఆదివారం తెనాలికి చెందిన అట్లూరి బాపూజి రు.2,01,116ల విరాళం ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషశస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మని రాజ్యసభ ఎంపి లింగమనేని రమేష్ దర్శించుకున్నారు.

**దుర్గమ్మ ఆలయంలో పిల్లలకు పోలియోచుక్కలు:** దుర్గమ్మ ఆలయంలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమం జరిగింది. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ స్వయంగా పలువురు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.



29-6pg4_29-6pg4.qxd 28/Jun/26 10:59 PM Page 1



వార్త

నువ్వు చెప్పిన ప్రతి దానికి తలాడించేవాడు తెలివి తక్కువ వాడైనా అవ్వాలి లేదా నీ భరతం పట్టేవాడైనా అయి ఉండాలి.

న- జేమ్స్ టైల్

# పంచాయతీలను నిర్వీర్యం చేయొద్దు!

జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధించే దిశలో అడుగులు వేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పాలకపెద్దలు ఏనాటినుంచో చెప్తున్నా ఆచరణకు వచ్చేసరికి అవి కాగితాలకే మిగిలిపోతున్నాయి. స్వాతంత్ర్యంవచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగానే ఉంది. వాస్తవంగా గ్రామస్వరాజ్యం గురించి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎందరోనాయకులు ఇవే మాటలు చెప్తూనే ఉన్నారు. వాటి పటిష్టతే తమ ధ్యేయమని పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్నారు. వాటికి కేటాయించిన నిధులు, విధులు అప్పగిస్తామని ఎప్పటి కప్పుడు హామీ ఇస్తూనే ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవంగా చూస్తే గ్రామ సర్పంచులకు ఒక వ్యూహంప్రకారం ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చారు. అధికారంలేని ఉత్సవ విగ్రహాలుగా మార్చేందుకు ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమవంతు కృషి చేస్తున్నారని చెప్పొచ్చు. చివరకు స్వతంత్రంగా చీపురు కట్టకొనలేని దురదృష్ట పరిస్థితి తెచ్చి పెట్టారు. ఒకనాడు సర్పంచులకు ఉన్న ప్రాధాన్యత నేడు కానరావడం లేదనేది కాదనలేని వాస్తవం. ఇందుకు వారూ వీరు అనే దానికంటే ఎవరు అధికారంలో ఉన్నా పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారనే చెప్పక తప్పదు. గ్రామస్థాయిలో ఎన్నో కమిటీలను పెట్టి సర్పంచులను పక్కకు పెట్టారు. వారి ప్రమేయం లేకుండానే, వారికి తెలియకుండా ఎన్నో కార్యక్రమాలు గ్రామాల్లో జరిగే పరిస్థితి తీసుకువచ్చారు. ఒక రకంగా చెప్పాలంటే సర్పంచులకు సమాంతరంగా పదవులు సృష్టించారు. ఇలాంటి చర్యలతో ఉన్న ప్రాధాన్యత కూడా తగ్గిపోయింది. నేతల వాగ్దానాలతో ఏదో సాధించాలని సమాజానికి ఏదో చేయాలని నూతనోత్సహంతో ఎందరో యువకులు గత ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నో వ్యయప్రయాసలకులోనై సర్పంచులయ్యారు. అప్పట్లో గ్రామాభివృద్ధికి తాముచేసిన వాగ్దానాలు తీర్చేందుకు నడుం కట్టారు. ఈచట్టాల వలలో తాము ఏమీ చేయలేమనే విషయం అర్థంకావడానికి వారికి చాలాకాలం పట్టింది. అయితే గ్రామప్రజలకు తాము చేసే వాగ్దానాలు పూర్తి చేసేందుకు తలతాకట్టు పెట్టి అప్పోసొప్పో చేసి కొన్ని గ్రామాల్లో పనులు పూర్తిచేశారు. అయితే బిల్లులు ఎంతకూ రాకపోవడం, ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి, ఇంకొకపక్క అప్పులు, వడ్డీలు పెరిగి, మరొకపక్క గ్రామస్తుల నుండి తలవంచుకోలేక డజన్ మందికిపైగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. ఈ పరిస్థితుల్లో 2024 జనవరి 31తో వారి పదవీకాలం పూర్తయి మాజీ సర్పంచులైపోయారు. ఆలస్యంగానైనా ఎన్నికలు జరగడంతో కొత్తసర్పంచులు పదవులను అధిష్టించారు. మాజీ సర్పంచుల పరిస్థితి గురించి పట్టించుకునే వారే లేకుండాపోయారు. ముఖ్యంగా ప్రజాభివృద్ధికి వ్యయం చేసిన డబ్బు రాకపోవడం, వారుపడుతున్న వేదన అంతా ఇంతా కాదు. ఎప్పటికి బిల్లులు వస్తాయో చెప్పేవారు లేరు. అంతా అగమ్యగోచరంగా తయారయింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉస్నాబాద్ మండలం మహమ్మాదాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన సర్పంచుగా ఉన్న సమయంలో గ్రామాభివృద్ధి కోసం చివరకు మామిడితోట విక్రయించి వచ్చిన డబ్బు, మరికొన్ని అప్పులుచేసి అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ డబ్బులు ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెప్తున్నారు. ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ సర్పంచులు కరీంనగర్, ఉస్మాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఇప్పటికీ మరెందరో మాజీ సర్పంచులు తాము చేపట్టిన ప్రజాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి బిల్లుల కోసం కాలు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగడం పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకనాడు పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచులు అంటే ఎంతో గౌరవ మర్యాదలుండేవి. భారత దేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర ఉంది. చంద్రగుప్తుడి కంటేముందు నుంచి గ్రామాలు, గ్రామ వ్యవస్థ అమలులో ఉన్నట్లు ఆధారాలున్నాయి. అప్పుడు కూడా గ్రామసభలుండేవి. గ్రామసభల నిర్ణయమే కీలకం. వాటి నిర్ణయాలకు ఆనాటి రాజరికవ్యవస్థ ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేది. అలా ప్రాచీనకాలం నుండి గ్రామవ్యవస్థ ఏదోఒక రూపంలో మనదేశంలో కొనసాగుతూనే ఉన్నది. 1882లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్ రిప్పన్ స్థానిక సంస్థలకు ప్రతిపత్తి కల్పించారు. గాంధీ మహాత్ముడు ప్రవచించిన గ్రామస్వరాజ్యం లక్ష్యంలో స్థానిక సంస్థ పటిష్టత అన్నది ఒక ముఖ్యాంశం. భారత రాజ్యాంగంలో కూడా స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు ఇవ్వడానికి, ప్రభుత్వం చర్యలుతీసుకోవాలని స్పష్టంగా సూచించారు. 1952 నుంచి ఎన్నోకమిటీలు, మరెన్నో అధ్యయనాలు, మార్పులు, చేర్పులు ఈ పంచాయతీరాజ్ వ్యవస్థలో చేశారు. కానీ సర్పంచులకు రాజ్యాంగం కల్పించినఅధికారాలు ఇవ్వడానికి మాత్రం పాలక పెద్దలకు మనసు ఒప్పడం లేదు. రానురాను పంచాయతీరాజ్ వ్యవస్థను నామమాత్రంగా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎన్నిమార్పులు చేర్పులుచేసుకుంటున్నా, ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎందరు నేతలు మారినా అధికార వికేంద్రీకరణ మాత్రం ఆది నుంచి అధికారంలో ఉన్నపెద్దలు మోకాలొడ్డుతూనే ఉన్నారు. ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది లాంటిది. అందులో సర్పంచులు కీలకం. రాష్ట్రాలు మరిన్ని అధికారాలు కావాలని కేంద్ర ముందు గావుకేకలు పెడుతున్న నేతలు స్థానిక సంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వకపోవడం అత్యంత దురదృష్టకరం.

జీవితంలో సంతృప్తి పడడం నేర్చుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. అది చేతకాని వ్యక్తి దు:ఖానికి గురవుతూనే ఉంటాడు.



జార్జ్ ఇలియట్

జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు. ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



## బంగారు గని యువతకు ఉపాధి

కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారు గని ప్రారంభం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. నిర్ధారిత బంగారు నిల్వలు ఉన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి కేంద్రంగా ఎంపిక చేయడం దూర దృష్టితో తీసుకున్న నిర్ణయంగా చెప్పవచ్చు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిచ్చే అవకాశాన్ని కల్పిస్తుంది. అయితే ఈ ప్రాజెక్టు విజయాన్ని కేవలం బంగారం ఉత్పత్తితోకాకుండా, స్థానిక యువతకుకల్పించే ఉపాధి అవకాశాలతో కూడా అంచనా వేయాలి. జొన్నగిరి, పరిసర ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని యువతకు పారదర్శకంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే విశ్వాసం కల్పించడం అవసరం. ప్రాసెసింగ్ యూనిట్లలో ఉద్యోగాలు పొందాలంటే మైనింగ్ టెక్నాలజీ, ఖనిజ శుద్ధి, యాంత్రిక నిర్వహణ, విద్యుత్‌వ్యవస్థలు, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. దీనికోసం ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## రికార్డులు బ్రేక్

టెస్ట్ క్రికెట్‌లో ఒకప్పుడు అత్యధిక పరుగులు సాధించిన రికార్డు గవాస్కర్ పేరుమీద ఉండేది. ఆరికార్డును సచిన్ టెండూల్కర్ బ్రేక్ చేశాడు. సచిన్ రికార్డును విరాట్ కోహ్లి బ్రేక్ చేశాడు. 16ఏళ్ల వయసులో క్రికెట్ ఆడటం మొదలు పెట్టిన వారు టెండూల్కర్. 15ఏళ్లకే మైదానంలో అడుగు పెట్టి క్రికెట్ ఆడినవారు వైభవ్ సూర్యవంశి. టెన్నిస్, బాట్‌మెంటన్, బాక్సింగ్ ఇలా ఏఆటలోనైనా ఒకరి రికార్డును మరొకరెవరో బ్రేక్ చేస్తూనే ఉన్నారు. రికార్డులు అనేవి ఎప్పుడూ ఒకరి పేరు మీదేఉండవు. క్రీడల్లోనైనా, రాజకీయాల్లో నైనా, విద్య, వైద్యరంగాల్లోనైనా.

- శాస్త్రి, హైదరాబాద్

## ఎవరైతేమాకేంటి?

చిన్న జంతువైన కుందేలు అడవికి రాజైన సింహాన్ని తన తెలివితో బోల్తా కొట్టిస్తుంది. ఐకమత్యంతో పావురాలు వేటగాడి బారి నుంచి తప్పించుకుపోతాయి. బలమైన సర్పంపై చీమల దండు దాడి చేసిచంపి పడేస్తాయి. ఒక మనిషిని ఈగ ముప్పుతిప్పలుపెట్టి పగతీర్చుకున్నట్లు ఒక సినిమాలో చూపించారు. సమయస్ఫూర్తి, ఐకమత్యం, తెలివితేటలు ఉపయోగిస్తే మనిషేకాదు అతి చిన్న ప్రాణులు, పక్షులు కూడా తాము అనుకున్నవి సాధించగలవు.

- మిథునం, హైదరాబాద్

## చెప్పడానికే నీతులు

ఒక వ్యక్తి గాంధీ వద్దకు వచ్చి మావాడు బెల్లం ఎక్కువగా తింటున్నాడు నేను ఎంత చెప్పినా వినటం లేదు, మీరు చెబితేనన్నా వింటాడేమోనని మీ వద్దకు తీసుకొచ్చాను అన్నాడు. అప్పుడు గాంధీ ఆ వ్యక్తిని వారం రోజుల తరువాత రమ్మని పంపించాడ. వారం తరువాత వచ్చిన వ్యక్తి వెంట ఉన్న అతనితో బెల్లం ఎక్కువగా తినటం మంచిది కాదు ఆరోగ్యం పాడవుతుంది అందుకే నువ్వు బెల్లం తినటం ఈ రోజు నుంచే మానేసేయ్‌అన్నారు. ఈమాట అప్పుడే చెప్పేస్తే పోయేదికదా అంటే బెల్లం తినే అలవాటు నకూఉంది ఆ అలవాటు మానుకోవడానికి నాకు వారం రోజులు పట్టింది అని అన్నారు. ఈ రోజుల్లో ఇలాంటివారు నూటికొకరైనా ఉంటారా? నీతులు చెప్పేవారు నీతి సూక్తులు ఇతరులకే కాదు తమకు కూడా వర్తిస్తాయని గర్తించాలి.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

## కాంగ్రెస్‌పై కక్ష

జాతీయ విద్యామండలి వారు తొమ్మిదవ తరగతిలో 1975 లో ఇందిరాగాంధీ పెట్టిన ఎమర్జెన్సీ పై ఒక పాఠం పెట్టారు. ఒదిరాగాంధీ దుర్మార్గం అయిందని, కాంగ్రెస్ పాలన ఇలా ఉంటుందని విద్యార్థులకు చెప్పేందుకే బీజేపీ పాలకులు ఈ అంశము చేర్చారు. చాలా సంతోషం. కాంగ్రెస్ మీద కక్షతో ఇది పెట్టారు అని దేశ ప్రజల భావన. ప్రభుత్వాలు విద్యార్థులకు శాస్త్రీయమైన అంశాలను బోధించాలి. కానీ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత మతపరమైన, అశాస్త్రీయమైనఅంశాలనుపాఠ్యాంశాలుగాపెడుతుంది. ప్రోత్సహిస్తుంది. ప్రతిపౌరుడుఇలాంటివాటికివ్యతిరేకంగా పోరాడాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## శాంతి పవనాలు వీచేనా?

ఎట్టకేలకు హర్మూజ్ తెరుచుకుంది. ఉద్రిక్తతలు తగ్గాయి. గత కొదినద నెలలుగా పశ్చిమాసియా దేశాల యుద్ధం కారణంగా చాలా మంది కంటికి కునుకు లేకుండా గడిపారు. అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై అమానుషంగా విరుచుకుపడడంతో ప్రపంచ దేశాలు ఆందోళనలో పడ్డాయి. అధ్యక్షుడు ట్రంప్ ఒంటెద్దు పోకడలకు అగ్రదేశంలోనే నిరసనలు తారాస్థాయికి చేరాయి. మనదేశం దిగుమతి చేసుకుంటున్న గ్యాస్, పెట్రోలియం, ఎరువులు, ఇంధన సరఫరాలతో నౌకల రాకపోకలు పెరుగుతుండడం శుభసూచకం. ఎన్నిసార్లు ఎదురుదెబ్బలు తగిలినా మారని దేశాలు చాలా వరకు ఉన్నాయి.

-ఆర్. వెంకటేష్ చరన్, బెంగళూరు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# జనాభాలో ఎక్కువ..ప్రగతి ప్రమాణాల్లో తక్కువ

*'పౌరస్పృహ' సివిక్ సెన్స్ ఒక ఉద్యమంగా మారినప్పుడే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది. దేశం అభివృద్ధి చెందాలంటే పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. పాలితులు తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే పరువు పోయేది మనదే. నష్టం జరిగేది సమాజానికే. అందుకే కనీస 'పౌరస్పృహే ప్రగతికి తొలి మెట్టు' హక్కులు, బాధ్యతలు రెండు కళ్ళ లాంటివి. వీటి నుంచి పాలకులకు, పాలితులకు మినహాయింపు లేదు. నేటి నుంచే మనం పౌరస్పృహతో మెలుగు దాం. ప్రశ్నించే పౌరులుగా, బాధ్యతగల భారతీయులుగా ఎదుగుదాం. అప్పుడు మాత్రమే జనాభాలోనే కాదు, ప్రగతి ప్రమాణాల్లోనూ ప్రపంచానికి ఆదర్శంగా నిలుద్దాం.*



మేకిరి దామోదర్

భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. యువశక్తి, సహజ వనరులు, మేథో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నాయి. అయినప్పటికీ విద్య, ఆరోగ్యం, పారిశుద్ధం, రహదారి క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణ, ప్రశ్నించే స్వేచ్ఛ, అవినీతి నిర్మూలన, బాధ్యతాయుత పాలన, పౌర బాధ్యత వంటి అనేక ప్రగతి ప్రమాణాల్లో మనం ఆశించిన స్థాయికి చేరుకోలేకపోతున్నాం. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, పాలితుల నిర్లక్ష్యమూ అంతే. అందుకే ఈ పరిస్థితిని 'తిలా పాపం తలా పిడికెడు' అని చెప్పవచ్చు. ప్రజాస్వామ్యంలో పాలకులు, పాలితులు ఒకే రథానికి రెండు చక్రాలు. ఒకరు బాధ్యత తప్పినా, మరొకరు తమ విధిని విస్మరించినా సమాజం వెనుకబడు తుంది. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు, పౌర స్వేచ్ఛతోపాటు, ప్రతి పౌరుడి బాధ్యతాయుతమైన ప్రవర్తన కూడా అంతేముఖ్యం. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ పాలకుల, పాలితుల అత్యంత ప్రధాన బాధ్యత. ఇదే సమిష్టి ప్రగతికి మార్గదర్శి. ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపా యాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటి లో చాలా హామీలు మరుగున పడిపోతాయి. ప్రజల సమస్య ల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవ డమే కొందరు పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల మొదటి కర్తవ్యం. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయరాదు. అంతేకాదు జాగ్రత్తగా వినియోగించాలి. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపైక్రమం తప్పకుండా సమాధానం చెప్పాలి. ప్రజల సమస్యలను వినాలి. అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడాలి. పాలనలో జవాబుదారీ తనం లేకపోతే ప్రజల్లో విశ్వాసం తగ్గిపోతుంది. అభివృద్ధి మందగిస్తుంది. కాబట్టి మంచి పాలనకు రాజకీయ నాయకులు ప్రజల పట్ల నిబద్ధతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యాన్ని ఓటుతో పాటు, ఎన్నికైన ప్రభుత్వాల (నాయకుల) జవాబుదారీ తనమే బలాన్ని చేకూర్చుతోంది. పాలకులను విమర్శించడం సులభం. కానీ మన బాధ్యతలను మనం ఎంతవరకు నిర్వర్తిస్తున్నామో కూడా ప్రశ్నించుకోవాలి. రోడ్లపై చెత్త వేయడం, ఎక్కడపడితే అక్కడ మూత్ర విసర్జన చేయడం, ట్రాఫిక్



నిబంధనలను ఉల్లంఘించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, క్యూలను పాటించకపోవడం, పన్నులు ఎగవేయడం వంటి చర్యలు మన సమాజంలో తరచూ కనిపిస్తున్నాయి. శుభ్రమైన దేశం కావాలని కోరుకునే మనమే చెత్తను రోడ్లపై పడేస్తే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది?. ప్రమాదాలు తగ్గాలని ఆశించే మనమే ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే భద్రత ఎలా పెరుగుతుంది?. ప్రభుత్వ ఆస్తులుప్రజల సొత్తే అని తెలుసుకున్నా వాటిని నిర్లక్ష్యంగా చూస్తే నష్టం చివరకు ప్రజలకే కదా!. పౌరస్పృహ అనేది పెద్ద పెద్ద ప్రసంగాల్లో ఉండేది కాదు. అది మన రోజువారీ ప్రవర్తనలో కనిపించాలి. ఇంటి ముందు శుభ్రత పాటించడం, చెత్తను నిర్దిష్ట ప్రదేశంలో వేయడం, ట్రాఫిక్ నియమాలను గౌరవించడం, నీటిని పొదుపుగా వాడడం, చెట్లను కాపాడడం, ప్రజా ఆస్తులను సంరక్షించడం ఇవన్నీ మంచి పౌరుడి లక్షణాలు. స్వేచ్ఛ అంటే మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం కాదు? మన హక్కులను కాపాడుకుంటూనే, ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా ప్రవర్తించడమే. బాధ్యతతో కూడిన స్వేచ్ఛే నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతి. ప్రజాస్వామ్యంలో ప్రజలు కేవలం ఓటర్లు మాత్రమే కాదు దేశ నిర్మాణంలో భాగస్వాములు. ఎన్నికల రోజున ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరిశీలించడం, తప్పులను ఎత్తిచూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడి బాధ్యత. అదే సమయంలో ప్రశ్నించే హక్కుతో పాటు బాధ్యతాయుతమైన ప్రవర్తన కూడా అవసరం. 'ప్రభుత్వం చేయాలి' అనే భావనతో మాత్రమే సరిపోదు. 'నేను ఏమి చేయగలను?' అనే ఆలోచన కూడా ఉండాలి. సమాజంలోని ప్రతి వ్యక్తి తన బాధ్యతను నిర్వర్తించినప్పుడే అభివృద్ధి వేగవంతమవుతుంది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలను పరిశీలిస్తే అక్కడి ప్రజల్లో ఉన్న క్రమశిక్షణ, పౌరస్పృహ, చట్టాల పట్ల గౌరవం ప్రధాన కారణాలుగా కనిపిస్తాయి. అక్కడ శిక్షల భయం కంటే బాధ్యతాభావమే ఎక్కువగా పనిచేస్తుంది. మన దేశం కూడా అదే దిశగా అడుగులు వేయాలి. పిల్లలలో చిన్నప్పటి నుంచే పౌర బాధ్యతలను పెంపొందించాలి. కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి మంచి పౌరులను తయారు చేయాలి. మీడియా, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు కూడా ఈ విషయంలో చైతన్యం కల్పించాలి. 'పౌరస్పృహ' సివిక్ సెన్స్ ఒక ఉద్యమంగా మారినప్పుడే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది. దేశం అభివృద్ధి చెందాలంటే పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. పాలితులు తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే పరువు పోయేది మనదే. నష్టం జరిగేది సమాజానికే. అందుకే కనీస 'పౌరస్పృహే ప్రగతికి తొలి మెట్టు' హక్కులు, బాధ్యతలు రెండు కళ్ళ లాంటివి. వీటి నుంచి పాలకులకు, పాలితులకు మినహాయింపు లేదు. నేటి నుంచే మనం పౌరస్పృహతో మెలుగు దాం. ప్రశ్నించే పౌరులుగా, బాధ్యతగల భారతీయులుగా

# కృత్రిమ వనాలే పర్యావరణ సంరక్షణకు మార్గం

కింజరాపు అమరావతి

మన దేశం ప్రస్తుతం ఒక తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు ఎండలు మండిపోతుంటే మరోవైపు భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతున్నాయి. దేశంలో దాదాపు 96 మిలియన్ హెక్టార్ల భూమి అంటే మూడో వంతు భూభాగం వివిధ కారణాల వల్ల నిస్సారంగా మారి చవిటి నేలలుగా మారుతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో తీవ్రమైన నీటి ఎద్దడి, ఊపిరాడని కాలుష్యం ముంచుకొస్తాయి. జాతీయ అటవీ విధానం ప్రకారం దేశ మొత్తం భూభాగంలో 33శాతం అడవులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం అది కేవలం 21.73 శాతానికే పరిమితమైంది. మనం నిర్దేశిత లక్ష్యం కంటే చాలా వెనుకబడి ఉన్నాం. తగినంత విస్తీర్ణంలో అడవులు లేకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణం. దీనికి తక్షణ విరుగుడుగా ఆధునిక సాంకేతికతను మానవ ప్రయత్నాన్ని జోడించి, యుద్ధప్రాతిపదికన 'కృత్రిమ వనాలను' సృష్టించడం ఒక్కటే మన ముందున్న ఆచరణాత్మక మార్గం. మొక్కల పెంపకానికి, వనాల సృష్టికి మధ్య ఉన్న వ్యూహాత్మక వ్యత్యాసాన్ని గమనించాలి. ఇళ్ల ముందు, రోడ్ల పక్కన మొక్కలు నాటడం అనేది ఒక వ్యక్తిగత అలవాటు మాత్రమే. కానీ కృత్రిమ వనం అంటే ఒక నిర్దిష్ట ప్రణాళికతో సహజ పద్ధతిలో ఒక స్వయంసమృద్ధ అడవిని నిర్మించడం. ఇందులో కేవలం చెట్లు మాత్రమే ఉండవు. స్థానిక నేల స్వభావానికి సరిపోయే విభిన్న రకాల దేశీయ వృక్షాలను ఎంపిక చేస్తారు. అవి ఒకదానికొకటి తోడ్పడుతూ పెరిగేలా దట్టంగా నాటుతారు. కొద్ది కాలంలోనే ఇది పక్షులు, కీటకాలు, చిన్న జీవులకు నిలయంగా మారి, ఒక సహజ అడవిలా రూపాంతరం చెందుతుంది. చైనా హరిత ప్రాజెక్ట్ ద్వారా 35 మిలియన్ హెక్టార్ల ఎడారి భూమిని పచ్చని వనాలుగా మార్చింది. జపాన్, ఆఫ్రికా వంటి దేశాలు కూడా ఇదే వ్యూహంతో అద్భుతమైన విజయాలు సాధించాయి. మరి ఇంతటి సాంకేతికత అపారమైన మానవ వనరులు ఉన్న మన దేశం ఈ తరహా భారీ కృత్రిమ వనాల నిర్మాణంలో ఎందుకు ఆశించిన ఫలితాలను సాధించలేకపోతోందో అంతర్మథనం చేసుకోవాలి. మన దేశంలో పర్యావరణ స్పృహ లేకపోవడం సమస్య కాదు. చేస్తున్న ప్రయత్నాల్లో దీర్ఘకాలిక ప్రణాళిక లోపించడమే అసలు సమస్య. ఏటా వర్షాకాలంలో కోట్ల సంఖ్యలో మొక్కలు నాటుతున్నా అందులో ఎన్ని చెట్లుగా మారుతున్నాయనే దానికి సరైన నిఘా లేదు. కేవలం కాగితాల మీద సంఖ్యలు చూపించే రొటీన్ కార్యక్రమాల వల్లే మనం అంతర్జాతీయ స్థాయిలో పటిష్టమైన మార్పును తీసుకురాలేకపోతున్నాం. ప్రస్తుతం ఉన్న అటవీ శాఖకు స్మగ్లింగ్ అడ్డుకోవడం, వన్యప్రాణుల రక్షణ వంటి ఎన్నోఇతర బాధ్యతలు ఉన్నాయి. అందువల్ల, దేశవ్యాప్తంగా కృత్రిమ వనాలను అమలు చేయడానికి 'ప్రత్యేక జాతీయ యంత్రాంగం' ఒకదాన్ని ఏర్పాటు చేయాలి. దీనికి కేంద్ర ప్రభుత్వం భారీ బడ్జెట్ కేటాయించడంతో పాటు, ప్రతి రాష్ట్రం తప్పకుండా ఇందులో భాగస్వామ్యం కావాలి. నిర్దేశిత కాలంలో లక్ష్యాలను అందుకోకపోతే సంబంధిత అధికారులు జవాబుదారీ వహించేలా చట్టబద్ధమైన నిబంధనలు ఉండాలి. ఈ వ్యవస్థకు 'కృత్రిమ వనాల అభివృద్ధి' తప్ప మరో రెండవ లక్ష్యం ఉండకూడదు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పర్యావరణ సంక్షోభం మన ఆర్థిక వ్యవస్థను, సామాన్యుడి జీవనాన్ని ఒకేసారి దెబ్బతీ స్తోంది. వాతావరణ మార్పుల వల్ల ఏటా రైతులు సగటున 20 నుండి 25శాతం వరకు పంట దిగుబడిని నష్టపోతు న్నారు. మరోవైపు కాలుష్యం వల్ల వచ్చే రోగాల కారణంగా సామాన్యుడి సంపాదనలో సగానికి పైగా వైద్య ఖర్చులకే హారతవుతోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం సైతం ప్రతి ఏటా బడ్జెట్‌లో దాదాపు 90 వేల కోట్ల రూపాయల కంటే ఎక్కువ మొత్తాన్ని కేవలం ప్రజారోగ్యం, వైద్యపథకాల కోసమే కేటాయించాల్సి వస్తోంది. ఈనష్టాలన్నింటినీ అధిగమించడానికి కృత్రిమ వనాల ఏర్పాటు ఒక అద్భుతమైన మార్గంగా నిలుస్తుంది. ఈ వనాల సృష్టి కేవలం పర్యావరణాన్ని కాపాడటమే కాదు, దేశ ఆర్థిక రంగానికి సరికొత్త ఊపును ఇస్తుంది. వేల ఎకరాల్లో అడవులను నిర్మించే క్రమంలో భూమిని సిద్ధం చేయడం, మొక్కల పెంపకం, నిర్వహణ వంటి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది కొత్త ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. భవిష్యత్తులో ఈ వనాల ద్వారా లభించే కలప రహిత అటవీ ఉత్పత్తులు, ఔషధ మొక్కలు, తేనె వంటి వాటి ద్వారా స్థానిక పరిశ్రమలు వృద్ధి చెందుతాయి. అంతేకాకుండా, గ్లోబల్ స్థాయిలో కార్బన్ క్రెడిట్స్ మార్కెట్ ద్వారా దేశానికి భారీగా విదేశీ పెట్టుబడులు వస్తాయి. ఈ క్రమంలో ప్రజల పాత్ర అంటే కేవలం పెరట్లో మొక్క నాటడం కాదు. పౌర సమాజంగా, స్వచ్ఛంద సంస్థలుగా ఏర్పడి ఈ వనాలను అసాంఘికశక్తులు, పశువుల బారి నుండి కాపాడే పర్యవేక్షకులుగా బాధ్యత తీసుకోవాలి. మన దేశానికి ఇప్పుడు

# భాషపై పట్టు అభ్యసనకు ఆయువుపట్టు



మల్లాడి శ్రీనగేష్

విద్యార్థులు తమ వయసు, తరగతి స్థాయి సామర్థ్యాలు సాధించడానికి ప్రతి సబ్జెక్టు చదవడానికి అవగాహన రావడానికి భాష దానిని క్షుణ్ణంగా చదవడం అనివార్యం. అనగా ప్రతి సబ్జెక్టులోనూ భాషను మనం ప్రధానంగా చూడాలి. అనగా చదువు మాతృభాషలో వున్నా ఆంగ్ల భాషలో వున్నా ఆ భాషపట్ల పిల్లలకు పట్టుఉండాలి. ఈపట్టుకు తొలిమెట్టు యనే ప్రాథమికస్థాయి నుండి మౌలిక భాషలో కనీససామర్థ్యాలను సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి. అందుకు కావలసిన వసతులను, వనరులను, వినూత్న విద్యార్థులకు స్నేహపూరిత వాతావరణంలో అభ్యసనను అందించడానికి పాఠశాల యాజమాన్యాలు కృషి చేయాలి. కోవిడ్కన్నా ముందు తర్వాత కూడా పాఠశాల విద్యార్థులు తరగతి స్థాయి విద్యాసామర్థ్యాలు సాధించలేకపోతున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే విద్యార్థులభవిష్యత్తు క్లిష్ట తరమౌతుందని అనేకఅధ్యయనాలు వెల్లడిస్తునే వున్నాయి. అందుకే పాఠశాల యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఈదిశగా ప్రయత్నాలు ముమ్మరం చేయకపోతే బాలల బంగారు భవిష్యత్తు చిక్కుల్లో పడుతుందనేది వాస్తవం. విద్యాహక్కు చట్టం 2009 ద్వారా ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి పాఠశాలల నమోదు పెరిగింది తద్వారా నాణ్యమైన విద్యాప్రణాళికల్లో భాగంగా మౌలికసదుపాయాలు, ఉపాధ్యాయుల నియామకం చట్టబద్ధంగా కల్పించాల్సిన అవసరాలను గుర్తించాం. అక్షరాస్యత అంటే తెలియని కుటుంబాలలో బడివైపు చూడని, ఆర్థిక సాంఘిక పరిస్థితుల వలన బడిమానేసిన పిల్లలను అక్కున చేర్చుకొనేలా విద్యాహక్కు చట్టాన్ని 2010 నుండి అమలు చేస్తున్నాం. నాణ్యమైన తరగతులను నిర్మించడానికి నూతన విద్యావిధానం 2020ను కూడా రూపొందించుకున్నాం. కానీ ప్రతి విద్యార్థిలోనూ అభ్యసనాలేమి కనిపిస్తూనేఉంది. తరగతి వారీ సామర్థ్యాలు సాధించలేక సతమౌతూనేవున్నారు. 5వ తరగతిలో ప్రవేశించినప్పటికీ 2వ తరగతి పాఠ్యాంశాలను కూడా చదవలేని లేదా కనీస గణిత సామర్థ్యాలను సాధించలేని విద్యార్థుల పరిస్థితిని మనంకళ్లారాచూస్తూనే. మూడవతరగతిలో 10మందిలో 6 మంది విద్యార్థులు చిన్న కథలను కూడా చదవలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇదే పరిస్థితి అన్నితరగతుల్లోనూ పునరావృతం అవుతుంటే, ఆకోవకు చెందిన విద్యార్థులు చదువు కాలమంతా ఒక విషవలయంలో చిక్కుకుపోవడం అనివార్యమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈపరిస్థితులకు ప్రధాన కారణం ప్రాథమిక స్థాయిలో పునాది కొరవడడమా లేక సిలబస్పైపే పాఠశాలలు పరుగులెత్తడమాయనేది విశ్లేషించుకోవాలి. ఈమధ్యనేఎన్.సి.ఆర్.టి నిర్వహించిన సర్వే ప్రకారం సుమారు 75శాతం మంది 9 వ తరగతి విద్యార్థులు చిన్నచిన్న కాన్సెప్టను కూడా అర్థం చేసుకోని దుస్థితిలో ఉన్నారు. సుమారు 47 శాతం 3వ తరగతి విద్యార్థులు చిన్నకథను కూడా చదివి అర్థం చేసుకోలేని స్థితిలో వున్నారు. 36 శాతం మంది విద్యార్థులు కూడికలు కూడా చేయలేకపోతున్నారు. 6 వ తరగతిలో సుమారు 34శాతం మంది స్థానికసంస్థలు, మార్కెట్,



ఇతర సంస్థల పనిగురించి కుడా తెలియపరచలేకపోయారు. 9వ తరగతి విద్యార్థులు సుమారు 55 శాతంమంది సోషల్ స్టడీస్‌లో రాజ్యాంగం గురించి, వాటి సూత్రాలు జాతీయ ఉద్యమాల గురించి వెల్లడించలేని పరిస్థితిలో వున్నారు. ఇక తెలుగు రాష్ట్రాలు పరిశీలిస్తే తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో 9వ తరగతిలో 17వ స్థానంలో, 6వ తరగతిలో 26వ స్థానంలోఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఎవరికైనా అవగతమయ్యేది, విద్యార్థికి చదవడం, విషయాన్ని అర్థం చేసుకోవడంలో ముందుంటే తద్వారా అభ్యసనా సామర్థ్యాలు సాధించంచడం చాలా సులభమని, దీనితో బాటు గణితంలో కనీసం చతుర్విధ ప్రక్రియలు సాధించడంలో ప్రవేశం ఉంటే విద్యార్థి ప్రగతి సులభతరమౌతుందనేది వాస్తవం. ప్రతివిద్యార్థికి పూర్వ ప్రాథమిక స్థాయి నుండి పునాది ఏర్పరచాలి. పునాది కొరవడితే బాలల భవిష్యత్తు సమస్యల వలయంలో చిక్కుకుంటుంది. పిల్లలు భాషపై పట్టు సాధించినప్పుడే మిగతా సబ్జెక్టులపై తగిన ఫలితాలు చాలా సులభంగా సాధించగలుగుతారు. ప్రాథమిక విద్యలో అభ్యసనమంటే భాషపై తగిన పట్టు కలిగి ఉండడమేయని జాతీయ విద్యాచట్రం 2005 వక్కాణించింది. ఈ పునాదులపైననే పిల్లల మానసిక అభివృద్ధి ఆధారపడి ఉంటుంది .విద్యార్థులు చదవడం అంటే ధారాళంగా చదవడం, చదివిన దానిని అర్థం చేసుకొని తన సొంత మాటల్లో చెప్పడం ప్రతిస్పందించడం తప్పనిసరి. ఈవిధంగా విద్యార్థికి భాషలో ఎక్కువ సామర్థ్యాలు సాధించడానికి భాషాభ్యాసానికి అవసరమైన అదనపు సామాగ్రి, బాలలసాహిత్యం, వార్తపత్రికలు, మాగజైన్లు చదివేలా విద్యార్థులను తప్పక ప్రోత్సహించాలి. ఈప్రక్రియ చదువులో ముందంజ వేయడానికి, వ్యక్తిగత అభివృద్ధికి విజ్ఞాన ప్రపంచంలో ఎన్నో కొంగ్రొత్త విషయాలను ఆకళింప చేసుకొని మెరుగైన భవిష్యత్తును గడించడానికి అవసరమైన విషయ విశ్లేషణ, సమస్యాత్మక విషయాలను పరిష్కరించే పరిజ్ఞానం, తనకుతాను ఎదగడానికి పత్రికలు గ్రంథాలయాలో అందుబాటులో వున్న పుస్తకాల పఠనం ఎంతో ఉపకరిస్తుంది. విద్యార్థి తన పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా ,గ్రంథాలయ పుస్తకాల పఠనం, పుస్తకసమీక్ష ఇవన్నీ నిత్యజీవితంలో అంచెంచెలుగాఎదగడానికి వెసులుబాటు కల్పించాలి. అయితే పిల్లలు పుస్తక పఠనచేయడానికి, తరచూ తాను చదివిన లేదా నేర్చుకున్న విషయాలను చర్చించడానికి, తెలియపరచడానికి ఉపాధ్యాయులు, తలిదండ్రులు, తగిన అవకాశాలను పిల్లలకు ఏర్పరచాలి. స్క్రీన్ చదువులు మొబైళ్లపై ఆధారపడుతున్నారు. పుస్తకాలను తాకి, పేజీలు తిప్పి విషయాన్ని అవగాహన చేసుకుంటూ చదివే ప్రక్రియకనుమరుగైపోయింది. దీనివలన కంటికి అలసట, ఒత్తిడి, అవసరమైన పాఠ్యంశాలపైనే దృష్టిసారించడం వంటి మార్పుల వేటలో పిల్లలు పాఠ్యంశాల పరిధి దాటి ప్రపంచాన్ని చూడలేకపోతున్నారు, చదవలేకపోతున్నారు, అంటే పిల్లల చదువును పాఠ్యప్రణాళిక స్థాయివరకే పరిమితం చేయడం జరుగుతున్నది. అదనంగా గ్రంథాలయ పుస్తకాలు చదవడం పాఠ్యప్రణాళికకు మించి పరిజ్ఞానం కోసం జీవననైపుణ్యాల మెరుగుదలను పెంపొందించే పుస్తక సామాగ్రి అందుబాటులో ఉండకపోవడం ఉన్నప్పటికీ వినియోగంలో సమయాభావం, ఇవన్నీ వెరసి పిల్లల అభ్యసనకు అవరోధాలు ఏర్పడ్డాయి. కారణాలేమైనప్పటికీ విద్యార్థులు తమ వయసు, తరగతిస్థాయి సామర్థ్యాలుసాధించడంలో బాగా వెనుకబడి వున్నారు. డిజిటల్ యుగంలో మొబైల్, టెలివిజన్‌వైపు తక్కువ సమయాన్ని కేటాయించేలా తలిదండ్రులు తమపిల్లలను చైతన్యపరచాలి. తద్వారా పిల్లల్లో పఠనాశక్తిని పెంపొందిందించడం ద్వారా అభ్యసనా సామర్థ్యాలతో ప్రగతి సాధించడం సుసాధ్యమౌతుంది.

# నకిలీ ధ్రువపత్రాలతో ఏఈఎల్సీ స్థలాలు విక్రయాల కలకలం..

### ధ్రువపత్రాలు నకిలీ అవినీతి మకిలి....!

గుంటూరు, జూన్ 28, ప్రభాతవార్త : గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్, ఓల్డ్ క్లబ్ రోడ్డులో ఉన్న మంగళ మందిరం ఏఈఎల్సీ స్థలాలకు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయిస్తున్న ఓ మహిళ వ్యవహారం కలకలం రేపుతోంది. ఈ అక్రమ ఆస్తుల విక్రయాలు పూర్వ ఏఈఎల్సీ సంస్థకు చెందిన అధికారులు ఈ మహిళకు పూర్తిగా సహకరిస్తున్నారని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.



2024 నుండి ఇప్పటి వరకు ఈ మహిళ అక్రమాలపై గుంటూరు కొత్తపేట పోలీస్ స్టేషన్ లోనూ, ఏఈఎల్సీ కార్యాలయంలోనూ అనేకమార్లు ఫిర్యాదులు చేసినట్లు అచ్చటి ప్రజలు తెలుపుతున్నారు. ప్రస్తుతం ఈ మహిళ ఏఈఎల్సీ ఉద్యోగి కాదు, సంఘస్తురాలు కాదు. ఈమె భర్త ఏఈఎల్సీ కార్యాలయంలో శాశ్వత మరియు తాత్కాలిక ఉద్యోగి కూడా కాదని వివరిస్తున్నారు. కాకపోతే 2001వ సంవత్సరంలో డాక్టర్ కాంతయ్య లీజ్ సమయంలో ఆమె భర్త కూలిపని చేశాడని తెలియజేస్తున్నారు. మంగళ మందిరములోని ఏఈఎల్సీ సంస్థకు సంబంధించి లక్షల రూపాయల ఖరీదుచేసే స్థలాలకు ఆ మహిళ దొంగ డాక్యుమెంట్లు సృష్టించి, విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటుందని వెల్లడిస్తున్నారు. ఈ మధ్యకాలంలో టౌన్ సర్వే నంబర్ 57 మరియు 59 లో సుమారు 200 గజాల స్థలంలో ఎలాంటి స్థల దృపత్రాలు లేకపోయినా గాని, ఆ స్థలాన్ని కబ్జాచేసి చర్చి నిర్మాణాన్ని చేపట్టి, పూర్తిచేసినట్లు స్థానికులు తెలియజేస్తున్నారు. ఏఈఎల్సీ సంస్థ ఆస్తులను విక్రయించడానికి అసలు ఈమె ఎవరు? ఈ ఆస్తులను విక్రయించడానికి ఈమెకు ఎవరు అనుమతులు ఇచ్చారు? అని ప్రశ్నిస్తున్నారు. డాక్యుమెంట్లు అన్ని నకిలీవేనని, ఫోర్జరీ చేసి ఏఈఎల్సీకి చెందిన స్థలాలు విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటుందని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం గుంటూరు ఏఈఎల్సీ సంస్థ ఆస్తులకు సంబంధించి ఇంత జరుగుతున్న ఆ సంస్థ అధికారులుగాని, సంఘస్తులు గాని ఎందుకు మిన్నకుంటున్నారో అర్థంకావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏఈఎల్సీ అధికారులు స్పందించి నకిలీ ధృపత్రాలతో సంస్థకు సంబంధించిన స్థలాలు విక్రయిస్తున్న ఆ మహిళపై చట్టపరమైన చర్యలు తీసుకొని, సంస్థకు చెందిన ఆస్తులను కాపాడాలని కోరుతున్నారు.

## ముగిసిన శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



గుంటూరు విద్య జూన్ 28 ప్రభాతవార్త: గుంటూరు కొత్తపేటలోని శ్రీ జగన్నాథ స్వామి వారి దేవస్థానం నందు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవములలో చివరి రోజు ఆదివారం సాయంత్రం శ్రీ స్వామివారికి మల్లెపూలతో అలంకారం ఉదయం 9.00 గం.లకు లక్ష తులసీదళార్చన, మధ్యాహ్నం 12.00 గం.లకు అన్నదానం కార్యక్రమం రాత్రి 7.00 గం.లకు ద్వాదశ ప్రదక్షిణాలు పవళింపు సేవ నిర్వహించ బడినవి. ఈ కార్యక్రమములను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వాహణధికారి టి. సుభద్ర పర్యవేక్షణలో దేవస్థానం చైర్మన్ మల్లెంపూడి శ్రీనివాసరావు మరియు ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్నవనీ అధికారులు తెలిపారు .

## సాయి కృష్ణ తల్లికి తగిన న్యాయం జరగాలి

గుంటూరు విద్య జూన్ 28 ప్రభాతవార్త : పోలీసుల కస్టడీలో ఉన్న సాయి కృష్ణ లాకప్ డెత్ ద్వారా మరణించినట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఒక సీఐ ఇతర పోలీసులు చేసిన తప్పుకు యావత్తు పోలీసు వ్యవస్థపై ఆరోపణలు గుప్పించటం సబబు కాదని , సాయి కృష్ణ తల్లికి తగిన న్యాయం జరగాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో యేసు బాబు మాదిగ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్లో పోలీస్ డిపార్ట్మెంట్ పనితీరు చక్కగా పనిచేస్తున్న తరుణంలో ఇటువంటి దారుణమైన ఘటన జరగటం



చాలా బాధాకరమన్నారు. అయితే సాయి కృష్ణ యొక్క విషయంలో అతన్ని అతను పై ఉన్న కేసులు విషయంలో శిక్ష విధించే దానికి చట్టంలో పలు విధానాలు ఉన్నాయని వాటిని అనుసరించాలని అన్నారు. అలాగే పోలీస్ డిపార్ట్మెంట్ వారు కూడా చాలా సందర్భాల్లో చాలా మెరుగుగా పని చేస్తున్నారని ఎంతో తెలివైన, గుండె ధైర్యం కలిగిన పోలీసులు మనకు ఉన్నారని అన్నారు. గత కొంతకాలంగా గంజాయి వాడేవారు విపరీతబుద్ధితో ప్రవర్తిస్తున్నారని రాత్రులు ఉద్యోగాలు, పనులు ముగించుకొని తిరిగి వెళ్ళేటప్పుడు ఈ గంజాయి బ్యాచి వారు తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారని వారు ఎటువంటి ఆయుధాలు కలిగి ఉన్నారో ఎలా దాడి చేస్తారో కూడా చెప్పలేని పరిస్థితి అని అన్నారు. కానీ పోలీసు వారు వీటన్నిటికీ తెగించి పహరా కాస్తు వారి యొక్క విధులను రాత్రిపూట సైతం నిర్వహిస్తున్నారు కాబట్టి సగటు సామాన్యుడు ప్రశాంతంగా ఉండగలుగుతున్నాడని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే డిపార్ట్మెంట్లో ఉన్న కొందరి వల్ల తప్పిదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. వీటి విషయంలో ప్రభుత్వము అలాగే న్యాయవ్యవస్థ తగిన విధంగా దర్యాప్తు జరిపి ఈ పరిస్థితికి కారణమైన వారిని చట్టపరంగా శిక్షించాలని ఆయన అన్నారు. అలాగే గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2017 ఫిబ్రవరిలో తలపెట్టిన పోలీసు బాడీ కెమెరా పరికరాన్ని మళ్లీ పూర్తిస్థాయిలో ఉపయోగించాలని అన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎంతో కృషి చేస్తున్నప్పటికీ లాకప్ డెత్ లాంటి విషయాలు చాలా మైనస్ గా పోలీస్ వ్యవస్థకు మారుతున్నాయని అభిప్రాయపడ్డారు. సాయి కృష్ణ విషయంలో కన్నతల్లి కోరుకునే విధంగా న్యాయం జరగాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇరువురు మృతి,ముగ్గురికి గాయాలు

రేపల్లె, జూన్ 28, ప్రభాతవార్త:బాపట్ల జిల్లా రేపల్లె మండలం పెనుమూడి రోడ్ లో బాణాసంచా దుకాణం ఎదురుగా ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న విషాదకర సంఘటనలో కృష్ణా జిల్లాకు చెందిన ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు.కృష్ణా జిల్లా కోడూరు మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ శివారు ఈరాల గ్రామానికి చెందిన గంజాల బాపనయ్య(37) తన భార్య నాంచారమ్మ,కుమారుడు సంతోష్కుమార్తో కలిసి ఎపి39కెవై7236 నెంబరు గల మోటారు బైక్పై రేపల్లెలోని బంధువులు ఇంటికి బయల్దేరాడు. రేపల్లె



పట్టణం నుండి కృష్ణాజిల్లాలోని స్వగ్రామమైన చల్లపల్లికి వెళ్తూ రాంగ్ రూట్ లో వేగంగా ఎపి40ఇటి 2998 నెంబరు గల మోటార్ బైక్ను నడిపిన రాకేష్ ఎదురుగా వస్తున్న బాపనయ్య బైక్ను ఢీకొట్టాడు.దీంతో ఢీకొట్టిన వాహనచోదకుడు కాకి రాకేష్(27),సవ్యమైన మార్గంలో వెళ్తున్న గంజాల బాపనయ్య అక్కడికక్కడే మృతి చెందారు.తలకు బలమైన గాయాలై తీవ్రంగా రక్తస్రావమైంది.తలకు హెల్మెట్ ధరించకపోవడం, అతివేగమైన డ్రైవింగ్ వలన ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.ఈ రెండు మోటార్ బైక్లపై ప్రయాణిస్తున్న గంజాల నాంచారమ్మ,గంజాల సంతోష్కుమార్,ప్రకాష్లు గాయపడ్డారు.నాంచారమ్మ,సంతోష్కుమార్లను వైద్య చికిత్స నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు,ప్రకాష్ను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.సంఘటనా ప్రదేశాన్ని రేపల్లె టౌన్ సిఐ బి.అశోక్కుమార్ పరిశీలించారు.మృతుడు గంజాల బాపనయ్య సతీమణి గంజాల నాంచారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వెల్లడించారు.

# గుంటూరు వార్త

## చిన్నారుల అందమైన జీవనానికి రెండు పోలియో చుక్కలు

### రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ

గుంటూరు విద్య , జూన్ 28 ప్రభాతవార్త : జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి పోలియో రహిత సమాజానికి అందరు కృషి చేయాలని రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ స్థానిక శారదా కాలనీ 25వ లైన్ వద్ద స్కూల్లో ఏర్పాటు చేసిన సెంటర్ వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో



కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 913 కేంద్రాల్లో 4,012 మంది వ్యాక్సినేటర్ల ద్వారా 1,44,678 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. తల్లి తండ్రులు 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు ఇప్పించాలని , చిన్నారుల అందమైన జీవనానికి రెండు చుక్కలు ఎంతో ముఖ్యమన్నారు. ఈ నెల 29 మరియు 30 తేదీలలో అంగన్వాడీ కార్యకర్తలు , ఏ ఎన్ ఎం లు, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఈ రోజు పోలియో చుక్కలు వేయించుకొనని చిన్నారులను గుర్తుంచి వారికి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. తల్లి తండ్రులు తమ పిల్లలను దగ్గరలోని పోలింగ్ వ్యాక్సినేషన్ కేంద్రాలకు తీసుకువెళ్ళి పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోళ్ళ ప్రభాకర్,దుగ్గినేని నరసింహారావు,బాజి, మహా లక్ష్మయ్య, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

### నేడు వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో

## ఏరువాక పౌర్ణమి వేడుకలు

గుంటూరు విద్య జూన్ 28 ప్రభాతవార్త : జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి నాడు జరుపుకునే"ఏరువాక పౌర్ణమి" కేవలం ఒక వేడుక మాత్రమే కాదు; అది ప్రకృతికి, మానవాళికి మధ్య ఉన్న విడదీయలేని అనుబంధానికి ప్రతీక అని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి వి సత్యనారాయణ అన్నారు. విశ్వ విద్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి సూచికగా రైతులు సంప్రదాయబద్ధంగా జరుపుకునే"ఏరువాక పౌర్ణమి" వేడుకలను ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.00 గంటలకు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రాంగణంలో, వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా అలంకరించిన ఎడ్లతో సంప్రదాయ నాగలి పూజ, దుక్కి కార్యక్రమం నిర్వహించి ఖరీఫ్ సాగుకు శుభారంభం చేయడం ఈ వేడుకల్లో ప్రధాన ఘట్టం అని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార,




మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. విశిష్ట అతిథులుగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖల సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, చలనచిత్రరంగ శాఖల మంత్రి, గుంటూరు జిల్లా ఇన్ఛార్జి మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖల మంత్రి నాదెండ్ల మనోహర్ తదితర ప్రముఖులు పాల్గొననున్నారనీ వెల్లడించారు. వీరితో పాటు పలువురు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ఈ వేడుకలకు హాజరుకానున్నారనీ తెలిపారు. ప్రత్యేక అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ , రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ మనజీర్ జీలానీ సమూన్ , గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ లు పాల్గొననున్నారనీ పేర్కొన్నారు విశ్వవిద్యాలయ సిబ్బంది , గుంటూరు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ సిబ్బంది సంయుక్తంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నామనీ తెలిపారు.ఏరువాక పున్నమి మనకు నేర్పే పాఠం ప్రకృతిని గౌరవించడం మరియు సంరక్షించడం. ఆధునిక కాలంలో నేల, నీరు, ఇతర వనరుల సంరక్షణ పద్ధతులను, మన పురాతన వ్యవసాయ విజ్ఞానాన్ని జోడించినప్పుడే మనం సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించుకోగలం. మనకు అన్నం పెట్టే నేలతల్లిని, నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ. రైతుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచడంతో పాటు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను వారికి చేరువ చేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం" అని ఉపకులపతి డాక్టర్ పి.వి. సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం"ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం క్రింద ర్యాలీ నిర్వహిస్తున్నట్టు , ఈ కార్యక్రమాలకు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, జిల్లాలోని వ్యవసాయ అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకలకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.విలేకరుల సమావేశంలో విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డా. జి. రామచంద్ర రావు , కమ్యూనిటీ సైన్స్ డీన్ డా. జి. జోగి నాయుడు , కంప్ట్రోలర్ డా. బి. ముకుంద రావు , డా. ఎన్ వి వి ఎస్ దుర్గా ప్రసాద్, సహ పరిశోధన సంచాలకులు, లాం ప్రాంతీయ పరిశోధన స్థానం ఇతర అధికారులు పాల్గొన్నారు.

### జీవనశైలి మార్పులతో వృద్ధాప్యాన్ని జయించండి : డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు కల్చరల్,జూన్ 28,ప్రభాతవార్త : అభివృద్ధి చెందిన ఆధునిక వైద్యవిధానం ఫలితాలను అందిపుచ్చుకొని జీవనశైలిని చక్కగా తీర్చిదిద్దుకున్న అట్లయితే వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా ఆనందంగా ఉండవచ్చని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య సభలో ప్రముఖ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి



నరేంద్రరెడ్డి అన్నారు.స్థానిక తాలూకా కార్యాలయ ఆవరణలోని పెన్షనర్స్ అసోసియేషన్ మీటింగ్ హాల్లో వృద్ధాప్యాన్ని ఎంజాయ్ చేయడం ఎలా మరియు ఆర్థోపెడిక్ సమస్యలు అన్న అంశాలపై జరిగిన ఆరోగ్యసభకు ప్రొఫెసర్ టి.రత్నారావు అధ్యక్షత వహించారు.డాక్టర్ బూసిరెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ వృద్ధాప్యంలో శారీరకంగా,మానసికంగా కొన్ని ఇబ్బందులు కలిగినప్పటికీ వృద్ధాప్యం గురించి అవగాహన ఉన్నట్లయితే ఆయా బాధలను,వ్యధలను అధిగమించవచ్చన్నారు.పాజిటివ్ ఆటిట్యూడ్ ఉన్నట్లయితే వృద్ధాప్యం చాలా మధురంగా కనిపిస్తుందన్నారు, టి.వి.సాయిరామ్ కోఆర్డినేటర్గా వ్యవహరించగా,రాడికల్ హ్యూమనిస్టు నాయకులు చంద్రశేఖరరావు,విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ళ ప్రసాదరావులు పాల్గొని ప్రసంగించారు.

### సాంకేతికతకు మానవీయ విలువలు తోడైనప్పుడే

# నిజమైన ప్రగతి

### మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

గుంటూరు విద్య జూన్ 28 ప్రభాతవార్త: "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సైన్స్, ఖివైబ్ కోడింగ్ఖి, ఖిఏజెంటిక్ ఏఐఖి వంటి సరికొత్త సాంకేతికతలు ప్రపంచాన్ని శాసిస్తున్న ప్రస్తుత తరుణంలో, టెక్నాలజీ ఎంత పెరిగినా మానవీయ విలువలు లేకపోతే లాభం లేదు. సాంకేతికతకు సంస్కారం తోడైనప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది" అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, విద్య అనేది కేవలం జీవనోపాధి కోసం మాత్రమే కాదని, అది సంస్కారాన్ని పెంచి, సమాజం పట్ల బాధ్యత గల




పరిపూర్ణమైన మానవుడిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రపంచం రష్యాఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్ఇరాన్ సంఘర్షణల వంటి భౌగోళికరాజకీయ ఉద్రిక్తతలతో కొట్టుమిట్టాడుతూ, ఆర్థిక మందగమనాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, భారతదేశం మాత్రం అద్భుతమైన స్థిరత్వాన్ని ప్రదర్శిస్తోందన్నారు. 202526 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 7.6 గా నమోదై, ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా దూసుకుపోతోందని ప్రపంచ బ్యాంక్ గణాంకాలను గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలు ఖిచైనా ప్లస్ వన్ఖి వ్యూహాన్ని అనుసరిస్తూ భారత్ను అత్యంత నమ్మకమైన ప్రత్యామ్నాయంగా చూస్తున్నాయన్నారు. ఒకప్పుడు ఖిఐటీ బ్యాక్ ఆఫీస్ఖిగా ఉన్న భారత్, నేడు గ్లోబల్ టెక్ దిగ్గజం ఖియాపిల్ఖి తన ప్రపంచ ఐఫోన్ ఉత్పత్తిలో 25 ఇక్కడే తయారు చేసే స్థాయికి చేరిందని, అలాగే ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో 46 వాటాతో దేశం మొదటి స్థానంలో నిలిచిందని గర్వంగా ప్రకటించారు. భారతదేశంలో 65 శాతం మంది 35 ఏళ్ల లోపు యువకులే ఉన్నారని, రాబోయే రెండు దశాబ్దాల పాటు ప్రపంచానికి అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించగల ఏకైక దేశం మనదేనన్నారు. యువతరం కేవలం ఉద్యోగాలు వెతుక్కునే వారుగా కాకుండా, పదిమందికి ఉపాధినిచ్చే ఖిఉద్యోగ సృష్టికర్తలుగాఖి మారాలని, స్టార్టప్ ఆవిష్కరణలకు పదును పెట్టాలని సూచించారు. వాతావరణ మార్పులు, ఎల్ నినో వంటి సవాళ్లకు మరియు 2070 నాటికి ఖినెట్ జీరోఖి ఉద్గారాల లక్ష్య సాధనకు హైడ్రోజన్ ఇంధనం వంటి సుస్థిర ఇంధన వనరుల అభివృద్ధిపై యువత పరిశోధనలు చేయాలన్నారు. విద్యార్థులు జీవితంలో ఏ స్థాయికి ఎదిగినా, ఏ దేశానికి వెళ్లినా కన్నతల్లిని, జన్మభూమిని, మాతృదేశాన్ని, మాతృభాషను మరియు గురువులను మరిచిపోకూడదని హితవు పలికారు. అలాగే, నేటి యువత ఫాస్ట్ ఫుడ్ను పరిహరించి, భారతీయ సాంప్రదాయ వంటకాలను అలవర్చుకోవాలని, సూర్యోదయానికి ముందే నిద్రలేస్తూ రోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. యువతరం భారతీయ కుటుంబ వ్యవస్థ పై నమ్మకం ఉంచి విలువలతో కూడిన జీవితాన్ని నిర్మించుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో ఎన్విడియా డీప్ లెర్నింగ్ ల్యాబ్, గూగుల్ కోడ్ ల్యాబ్, సీమెన్స్ సెంటర్ ఆఫ్ ఎ ల్సెన్స్ వంటి అంతర్జాతీయ స్థాయి పరిశోధనా వేదికలను, జర్మనీ, అమెరికా విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలను కుదుర్చుకోవడం పట్ల యాజమాన్యాన్ని అభినందించారు. నాడు ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి కేంద్రంగా నిలిచిన అమరావతి రాజధాని ప్రాంతంలో, 2007లో ఇంజనీరింగ్ కాలేజీగా ప్రారంభమై, నేడు ఖివాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ గా రూపాంతరం చెందడం ఈ సంస్థ నిరంతర కృషికి నిదర్శనమన్నారు. యూనివర్సిటీ ఛైర్మన్ శ్రీ వాసిరెడ్డి విద్యాసాగర్ గారి విద్యా నిబద్ధత, ప్రో ఛాన్స్ లర్ వాసిరెడ్డి మహాదేవ్ అంతర్జాతీయ సాంకేతిక దార్శనికత అభినందనీయమన్నారు.

### రాంపిళ్ల రాజేశ్వరీకి ఘన సన్మానం

గుంటూరు కల్చరల్,జూన్ 28,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీజైభవాని నాట్యమండలి వారి బి.వి.రావ్ కళాసేవా పురస్కార సభ జరిగింది.సభాధ్యక్షులుగా నటులు,దర్శకులు యం.వి.ఎల్. నరసింహారావు, ముఖ్యఅతిధిగా వైస్ చైర్మన్ ఇండియా రెడ్క్రాస్ సొసైటీ పి.రామచంద్రరాజు,అతిథులుగా ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,జైభవాని నాట్యమండలి అధ్యక్షులు అయితి వాసుదేవశర్మ,ఆర్కిటెక్ట్ బి.శ్రీనివాస్ పాల్గొని బి.వి.రావుతో ఉన్న పూర్వ జ్ఞాపకాలను స్మరించుకుంటూ ప్రసంగించి పురస్కార ప్రధాత వి.ఎస్.వి.ఎస్.రోహిత్ ప్రముఖ రంగస్థల నటి రాంపిళ్ళ రాజేశ్వరీని బి.వి.రావు పురస్కారంతో ఘనంగా సత్కరించారు.ముఖ్యఅతిధి మాట్లాడుతూ బి.వి.రావు సేవలు చిరస్మరణీయమన్నారు.తొలుత అతిధులు,సంస్థ వారు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బి.వి.ఎస్.ప్రసాద్,నటులు,నంది అవార్డు గ్రహీత కావూరి సత్యనారాయణ పర్యవేక్షణలో అతిథులన,కళాకారులను ఘనంగా సత్కరించారు

## గంజాయి విక్రేత అరెస్ట్



గుంటూరు క్రైమ్,జూన్28,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా పోలీసుల ప్రతిపాదన మేరకు, గంజాయి అక్రమ రవాణా,విక్రయాలకు పాల్పడుతూ ప్రజారోగ్యం,శాంతిభద్రతలకు తీవ్రమైన ముప్పుగా మారిన గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఇనవోలు గ్రామానికి చెందిన పసుపులేటి నరేష్ అను అతనిపై పలు కేసులు కారణంగా నిర్బంధ ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసింది.తేదీ:24.06.2026 ద్వారా ఉత్తర్వులు జారీ కాగా, నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నిర్బంధించేందుకు ఆదేశాలు జారీ చేయబడ్డాయి.నిందితుడు గంజాయి అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలలో అలవాటుగా పాల్గొంటూ,తుళ్లూరు మండలు,పరిసర ప్రాంతాల్లో తన సహచరులతో కలిసి మాదకద్రవ్యాల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయించడం ద్వారా ప్రజారోగ్యానికి, సమాజ భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తున్నాడని గుర్తించారు. గోలుగొండ పోలీస్ స్టేషన్, విశాఖపట్నం రూరల్ జిల్లా - 6 కిలోల 500 గ్రాముల గంజాయి,తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 500 గ్రాముల, 151.3 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసుల్లో నిందితుడు పదేపదే మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తేలడంతో, భవిష్యత్తులో ఇటువంటి నేరాలను అరికట్టేందుకు పి.ఐ.టియన్.డి.పి.యస్ చట్టం కింద నిర్బంధించడం అవసరమని ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా,విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని,యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయాలు లేదా రవాణా గురించి సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

గుంటూరు క్రైమ్,జూన్28,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేర నియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లు,నేరచరిత్ర కలిగిన వ్యక్తులు,చెడు నడత కలిగిన వారికి పోలీసు అధికారులు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్ప్రవర్తనతో జీవించాలని,నేర ప్రవృత్తికి పూర్తిగా స్వస్తి



పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇటీవల ఒక రౌడీ షీటర్పై పీడీ యాక్ట్ అమలు చేసి రాజమండ్రి జైలుకు పంపించగా,బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన మరో రౌడీ షీటర్కు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎంఆర్వో) 15 రోజుల జైలు శిక్ష విధించారు.రౌడీ షీటర్లు,నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులపై జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతోందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

## రోటరీ ఆధ్వర్యంలో తోపుడు బండ్లు అందజేత

మాచర్ల, జూన్ 28 ప్రభాతవార్త: రోటరీక్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యంలో చిరువ్యాపారులకు జీవనోపాధి కోసం తోపుడు బండ్లను ఉచితంగా అందజేశారు. రోటరీక్లబ్ ఆఫ్ లేక్ డిస్టిక్ మొయినాబాద్, పీ మంగత్రం జ్యుయలరీస్ సహకారంతో సుమారు రూ.లక్ష విలువ చేసే ఎనిమిది తోపుడుబండ్లను అందజేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మల సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు తెలిపారు.



కార్యక్రమంలో కేసీపీ సీనియర్ జనరల్ మేనేజరు, రోటేరియన్ వి.వెంకటరమణ, సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్ కొండవీటి రామకోటయ్య, శివ మెడికల్స్ రామ్మూర్తి, మేడం నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు, కోనేరు శంకరరావు, స్వరూప, దశరథ చౌహాన్, నరసింహారావు, శ్రీనివాసరావు, ఆంజనేయులు, మస్తాన్‌వలి, కేసీపీ హెచ్‌ఆర్ ఉదయ్‌కుమార్, ప్రోగ్రాం కన్వీనరు పఠాన్ నాగూర్‌వలి పాల్గొన్నారు.

## కృష్ణవేణి కాలేజీలో 30న జాబ్‌మేళా



మాచర్ల, జూన్ 28 ప్రభాతవార్త: ఈ నెల 30న కృష్ణవేణి కాలేజీలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వై.వెంకట రామయ్య అన్నారు. పల్నాడు జిల్లా నైపుణ్యాధికారి ఈ.తమ్మాజీరావు ఆధ్వర్యంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సారథ్యంలో ఈ జాబ్‌మేళా జరుగుతుందన్నారు. నియోజకవర్గ, పరిసర ప్రాంత యువతీ యువకులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. జాబ్‌మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 7842747682, 9492158153 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## విజయవంతంగా పల్స్‌పోలియో

కారంపూడి, జూన్ 28 ప్రభాతవార్త: మండలంలోని కారంపూడి, గాదెవారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగింది. కూటమి నేతలు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో నిర్మూలనకు పోలియో చుక్కలు అవసరమన్నారు. పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ల వయసు వరకు పోలియో చుక్కలు వేశారు. గాదెవారిపల్లె పీహెచ్‌సీ పరిధిలో 16 సెంటర్లు ఏర్పాటు చేసి 1845 మందికి గాను 1760 మందికి పోలియో



చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొల్నేడి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, దొడ్డా వెంకటనారాయణ, కటికల బాలకృష్ణ, వైద్యాధికారులు ఎం.విజయానాయక్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. కారంపూడి పీహెచ్‌సీ పరిధిలో 28 సెంటర్లను ఏర్పాటు చేశారు. 3612 మంది చిన్నారులు ఉండగా 3392 చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మల్లయ్య, లాలునాయక్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను హరిస్తున్న యాజమాన్యాలు

### శ్రీచక్ర సిమెంటు కార్మికులకు అండగా ఏఐటీయూసీ
### భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తాం
### ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం వెంకటసుబ్బయ్య

కారంపూడి, జూన్ 28 ప్రభాతవార్త: యాజమాన్యాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయని, అది సరైన విధానం కాదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం శ్రీచక్ర సిమెంటు ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ విషయాన్ని తెలుసుకుని ఫ్యాక్టరీ వద్దకు ఏఐటీయూసీ, సీపీఐ నేతలు చేరుకున్నారు. యాజమాన్యం అందుబాటులో లేకపోవడంతో నినాదాలు చేశారు. కార్మికులకు రక్షణ కల్పించాలని లాకౌట్ విధానాన్ని విరమించుకోవాలన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిమెంటు కర్మాగారాల్లో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు.





ఇటీవల కడప, ఒంగోలు, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల్లో సిమెంటు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేక పరిశ్రమల్లో యాజమాన్యాలు ఉన్న ఫలంగా నష్టాలు చూపిస్తూ లాకౌట్‌లు చేయాలని చూస్తున్నారని అన్నారు. దీంతో కార్మికులు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని, చట్ట ప్రకారం 100 మంది కార్మికులు ఉన్న పరిశ్రమలో ప్రభుత్వం అనుమతి తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల వ్యతిరేక విధానాన్ని అవలంభిస్తున్నాయని తెలిపారు. 400 మంది కార్మికులు ఉన్న శ్రీచక్ర సిమెంటు కర్మాగారంలో అమ్మకాలు లేవని మూసివేయాలని చూస్తున్నారని, అమ్మకాలు, లాభాలు లేని పరిశ్రమలు లేవని, ప్రభుత్వం సాగిస్తున్న కుట్రలో భాగమేమనన్నారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించడం లేదని, ప్రమాదాలు జరిగితే ప్రభుత్వం యాజమాన్యాలకు డైరెక్షన్ ఇస్తుందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటులో ఘోర ప్రమాదం జరిగి 10 మంది కార్మికులు సజీవదహనం అయితే ఒక్కో కుటుంబానికి రూ.కోటి చెల్లించాలని కేంద్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం జీవన పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రాయితీ కల్పించి యాజమాన్యాలు హక్కులను కాపాడి భద్రత కల్పించి న్యాయం చేయాలన్నారు. కార్మికుల కుటుంబాలు రోడ్డు పడకుండా చూసుకోవాలన్నారు.

**ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర**

శ్రీచక్ర సిమెంటు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతుందని ప్రైవేటు వ్యక్తుఉ బడా పారిశ్రామిక వేత్తలకు అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు. శ్రీచక్ర సిమెంటు ఫ్యాక్టరీ లాకౌట్ చేస్తే వందలాది మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. కార్మికులకు అండగా ఉండి వారి సంక్షేమం కోసం పనిచేస్తామని వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీపీఐ నేతలు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, మేకపోతు చినకోటిరెడ్డి, షేక్ సైదా, హనుమంతరావు, బూదాడ శ్రీనివాసరావు, కొమెర వెంకటరావు, యేసుపాదం తదితరులు ఉన్నారు.

## రాజుపాలెం మండలంలో పల్స్ పోలియో కేంద్రాలను పరిశీలించిన తహసిల్దార్ నెమలిపురి దుర్గేశ్వరరావు



రాజుపాలెం, జూన్ 28 ప్రభాతవార్త: మండలంలో నిర్వహించిన పల్స్ పోలియో బూతులను పరిశీలించిన, తహసిల్దార్ నెమలిపురి దుర్గేశ్వరరావు, ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నా చిన్నారులకు తప్పనిసరిగా వంద శాతం పోలియో చుక్కలు వేయించి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు, పోలియో రహిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కోరినారు. అలానే డాక్టర్ రవిపాల్ ఈరోజు 3983 మందికి గాను 3658 మందికి పోలియో చుక్కలు వేసినారు అని (92 )తెలియచేసినారు. చుక్కలు వేయని పిల్లలకు రేపు,ఎల్లుండి ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారని, తెలియచేసినారు, ఈ కార్యక్రమంలో, ఆరోగ్య పర్యవేక్షకులు జీవన్ రావు, ఏఎన్ఎం అచ్చమ్మ, ఆశా కార్యకర్తలు, రాధా, ప్రసన్న, అంగన్వాడి కార్యకర్త రమణ తదితరులు పాల్గొన్నారు.

## సత్తెనపల్లిలో ఘనంగా పల్స్‌పోలియో కార్యక్రమం

సత్తెనపల్లి, జూన్ 29, ప్రభాతవార్త: స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాను సారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసినటువంటి పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలోని పల్స్ పోలియో కేంద్రాలను తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరావు ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చౌట శ్రీనివాసరావు పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి , నియోజకవర్గ సయ్యద్ రాంబో బుడె .పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శినూర్ భాషా జానీ బాబు , క్లస్టర్ 2 చక్కపల్లి శ్రీనివాసరావు మరియు కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు .



## పోలియో రహిత సమాజ నిర్మాణమే మన అందరి బాధ్యత



సత్తెనపల్లి, జూన్ 29, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం 27 వ వార్డులో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ ఉపాధ్యక్షులు సయ్యద్ పెద కరిముల్లా . ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు, పోలియో రహిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కరిముల్లా పిలుపునిచ్చారు .

# పల్నాడు జిల్లా వార్త



## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి

నరసరావుపేట, జూన్ 28 ప్రభాతవార్త : ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తల్లిదండ్రులకు సూచించారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించి, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం పల్నాడు బస్టాండ్, 31వ వార్డు, 19వ వార్డు, కోట సెంటర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాలను ఎమ్మెల్యే సందర్శించి కార్యక్రమం నిర్వహణను పరిశీలించారు. భారతదేశం పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందినప్పటికీ ప్రపంచంలోని కొన్ని దేశాల్లో ఇంకా పోలియో వైరస్ కొనసాగుతున్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. పోలియో మళ్లీ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రతి జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో 0 5 ఏళ్ల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కోరారు. నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదాన్ని ప్రతి కుటుంబం ఆచరణలో పెట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు. జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## బీసీల జోలికి వస్తే సహించేది లేదు : ఎమ్మెల్యే డా. చదలవాడ

నరసరావుపేట, జూన్ 28 ప్రభాతవార్త : బీసీల జోలికి వస్తే సహించేది లేదని, బీసీలకు చెందిన భూములను ఆక్రమించినా, వారి హక్కులకు భంగం కలిగించినా కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని బరంపేట పీహెచ్‌సీ ఆసుపత్రి వెనుక రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న రజక అరామ క్షేత్రంకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాదరావు రెండు దశాబ్దాల క్రితం రజక సంఘానికి కేటాయించిన భూమి ఆక్రమణకు గురైందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం జిల్లా కలెక్టర్ సహకారంతో ఆ భూమిని ఆక్రమణల నుంచి విముక్తి చేసి రజక సంఘానికి తిరిగి అందించినట్లు తెలిపారు. బీసీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బీసీల అభివృద్ధికి అండగా నిలుస్తున్నారని చెప్పారు. రజక అరామ క్షేత్రంతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని, చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసి నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బీసీ సంఘాలు ఐక్యంగా ఉంటేనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, విభేదాలను సృష్టించే శక్తులను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు బాదుగున్నల శ్రీను, మడక ప్రసాద్, కూటమి నాయకులు, రజక సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పల్నాడు జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డా.గోపిరెడ్డికి సత్కారం

నరసరావుపేట టౌన్, జూన్ 28 ప్రభాతవార్త : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రచార కమిటీ నూతన అధ్యక్షునిగా తిరుమల శెట్టి సాంబశివరావు (శివ) ఆదివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక గుంటూరు రోడ్ లోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపి రెడ్డి శ్రీనివాస్ రెడ్డిని తిరుమల శెట్టి సాంబశివరావు (శివ) కలిసి దుశ్శాలువాతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ప్రచార కమిటీ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన తిరుమల శెట్టి సాంబశివరావు (శివ) కు పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు.



ఈ సందర్భంగా తిరుమలశెట్టి సాంబశివరావు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలియజేశారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను మరిచి అక్రమ కేసులతో అమాయకులను వేధిస్తున్నారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వైయస్సార్సీపి గెలుపుకు కృషి చేయాలని డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.


## నరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

రొంపిచర్ల, జూన్ 28 ప్రభాతవార్త : నరసరావుపేట కోటబజారు పులుపులవారి వీధిలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ సహిత శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయ రాతి నిర్మాణానికి భక్తులు విరాళం అందజేశారు. వివరాలను ఆలయ కమిటీ సభ్యులు వనమా సాంబశివరావు ఆదివారం తెలియజేశారు. గజవల్లి గురునాధరావు భవాని దంపతులు, వారి కుమారుడు విశ్వనాథ్ కమల్ 22వ స్తంభానికి లక్ష రూపాయలను అందజేశారు.కొత్తమాసు చంద్రశేఖర్ సుప్రియ దంపతులు ఆలయ నిర్మాణానికి రూ. 25,116 లను దేవస్థాన కమిటీవారికి అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు వనమా సాంబశివరావు,వనమా కృష్ణ,కోవూరు శివ శీను బాబు,గజవల్లి మురళి పాల్గొన్నారు.



## ఆర్ఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆర్ఎంపి లకు సదస్సు

నకరికల్లు, జూన్ 28 ప్రభాతవార్త : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దవడ ఎముకులకు శాస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు ఆర్ఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ చింతగుంట అజయ్ కుమార్ రెడ్డి అన్నారు. నకరికల్లు మండలంలోని ఆర్ఎంపి పిఎంపి వైద్యులకు నరసరావుపేట లోని ఆర్ ఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పంటి, దవడ లకు శస్త్ర చికిత్సల విభాగం, ఊపిరితిత్తులు, గుండె వ్యాధుల విభాగం, జనరల్ సర్జరి విభాగం లో ప్రాథమిక చికిత్సలు అనే అంశంపై అవగాహన వీడియో చిత్రాలతో కల్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ పంటి, ముఖ ఎముకల శస్త్ర వైద్య నిపుణులు డాక్టర్ చింతగుంట అజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ముఖ ఎముకలు విరిగిన వారికి ఆధునిక పద్ధతుల్లో శస్త్ర చికిత్సలు నిర్వహించడమే గాక రూట్ కెనాల్ పుట్టుక వచ్చే గ్రహణం మొర్రి తదితర సమస్యలకు శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రముఖ ఊపిరితిత్తుల గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ చింతగుంట శిరీష అజయ్ మాట్లాడుతూ గుండె సమస్యలను ప్రాథమిక దశలో గుర్తించగలిగితే ప్రాణాపాయాన్ని నివారించవచ్చు అన్నారు. ప్రముఖ జనరల్ సర్జరీ నిపుణులు డాక్టర్ ఎం కౌముది మాట్లాడుతూ మహిళల్లో వచ్చే జనరల్ సమస్యలకు శస్త్ర చికిత్సలతో పూర్తి నివారణ కల్పిస్తామన్నారు. అనంతరం ఆర్ఎంపి పి.ఎం.పి వైద్యులు డాక్టర్లను ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆర్.ఎం.పి.ఐ అండ్ పిఎంపి నరసరావుపేట డివిజన్ అధ్యక్షులు షేక్ బాజీ, కార్యదర్శి షేక్ సైదా, కమ్యూనికేటర్ ఆరేటి నాగేశ్వరరావు, నకరికల్లు మండల అధ్యక్షుడు బాపతు చెన్నారెడ్డి, గౌరవ అధ్యక్షుడు చింతపల్లి ఫకీర్ అహ్మద్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు



## టెట్ నిబంధనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి: ఎస్టీయు

నరసరావుపేట టౌన్, జూన్ 28 ప్రభాతవార్త : ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులందరికీ టెట్ తప్పనిసరి అన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో వేలాది మంది ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతుంటే స్పందించాల్సిన కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం తగదని ఎస్టీయూఏపి రాష్ట్ర అధ్యక్షుడు మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నరసరావుపేటలోని ఎస్టీయూ భవన్ నందు ఎస్టియు జిల్లా అధ్యక్షుడు ఎల్.వి. రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా శాఖ ద్వితీయ కార్యవర్గ సమావేశంలో రఘునాథరెడ్డి మాట్లా డుతూ అన్ని విద్యార్హతలతో నియామకం పొంది సుమారు ఇరవై, ముప్పై సంవత్సరాల పైబడిన బోధనానుభవం కలిగిన టీచర్లకు కూడా టెట్ తప్పనిసరి అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్టీయు రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సి.హెచ్. జోసెఫ్ సుధీర్ బాబు అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు కే కోటేశ్వరరావు, కె.వి.శేఖర్, జే.గంగాధర బాబు, ఎం. వెంకట కోటయ్య, సిహెచ్ అనిల్, ఎస్కె. కరీముల్లా, ఏ.ఏమండీ, షేక్.మహబూబ్ సుభాని, కే.యేసయ్య, ఏరియా కార్యదర్శులు, 30 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## సివిల్ సర్వీస్ సాధించిన డా. కట్ట ప్రత్యూషకు ఘనసన్మానం



నరసరావుపేట టౌన్, జూన్ 28 ప్రభాతవార్త : యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలో జాతీయస్థాయిలో విశిష్ట ర్యాంక్ సాధించిన డాక్టర్ కట్ట ప్రత్యూషకు ఆదివారం పెదనందిపాడు మండలం వరగాని గ్రామంలోని శ్రీనివాస కాటన్ మిల్ యూనిట్-2లో అభినందన, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో విశిష్ట ర్యాంక్ సాధించి, వరగాని గ్రామానికి గర్వకారణంగా డాక్టర్ కట్ట ప్రత్యూషను నిలిచారని ఎమ్మెల్యే అన్నారు. యూపీఎస్సీ వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక పరీక్షలో విజయాన్ని అందుకోవడం కఠోర శ్రమ, పట్టుదల, అంకితభావానికి నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం వార్షికోత్సవ వేడుకలు

సాతులూరు గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థాన 9వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారి తిరువీధి ఉత్సవం కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.అరవింద బాబు మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, భక్తుల సౌకర్యార్థం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఏఎం.రెడ్డి కళాశాలలో అంతర్జాతీయ బ్రెయిన్ సింపోజియం

రొంపిచర్ల, జూన్ 28 ప్రభాతవార్త : నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెం, ఏఎం.రెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో జూన్ 29 నుండి జూలై 1 వరకు న్యూ డిస్కవరీ ఇన్ బ్రెయిన్ అండ్ డిసార్డర్స్ అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సింపోజియం నిర్వహిస్తున్నారు. ఏఎం.రెడ్డి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ కార్యదర్శి మరియు కరస్పాండెంట్ డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒ ప్రకటనలో వివరాలు తెలిపారు. ఈ సింపోజియాన్ని ఇంటర్నేషనల్ బ్రెయిన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇబ్రో), అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. విదేశాలకు చెందిన ప్రముఖ న్యూరో సైంటిస్టులు, వైద్య నిపుణులు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని మెదడు ఆరోగ్యం, అల్జీమర్స్, పార్కిన్సన్స్, న్యూరోడిజెనరేటివ్ వ్యాధులు, నూతన పరిశోధనలు, ఆధునిక చికిత్సా విధానాలు వంటి అనేక కీలక అంశాలపై తమ అనుభవాలను, పరిశోధన ఫలితాలను పంచుకోనున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. భార్గవ్ భూషణ్ రావు తెలిపారు. ఈ అంతర్జాతీయ సింపోజియంలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, వైద్యులు ప్రజలు పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, మెదడు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

## నేడు జిల్లా కలెక్టరేట్ లో పిజిఆర్ఎస్ : కలెక్టర్ కృతిక శుక్లా

నరసరావుపేట టౌన్, జూన్ 28 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం) రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదివారం తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తప్ప కుండా హాజరు కావాలన్నారు. అర్జీదారులు అందజేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు.

## ఎర్రబాలెంలో జాతీయ పల్స్ పోలియో



క్రోసూరు( జూన్ 28 ప్రభాతవార్త) : క్రోసూరు మండలం ఎర్రబాలెం గ్రామంలో నిండు జీవితానికి రెండు చుక్కలు పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం రోజు ఎర్రబాలెం సీనియర్ టీడీపీ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని యుపి స్కూల్ లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి పార్టీ నాయకులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. టిడిపి పార్టీ సీనియర్ నాయకుడు వేపూరి ఉసియ్య నాయుడు ,ఎర్రబాలెం గ్రామ సీనియర్ నాయకులు ఎర్రబాలెం తెలుగుదేశం గ్రామ పార్టీ వేపూరి శ్రీనివాసరావు, వేపూరి గోవిందరావు, కుంభా ఏడుకొండలు, కొజ్జా అమరయ్య, పగడాల రాజు , పగడాల అమృత బాబు, మాతంగి వెంకట్రావు, గంటల మోజేసులు జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు.

## పల్స్‌పోలియో విజయవంతం

క్రోసూరు( జూన్ 28 ప్రభాతవార్త): క్రోసూరు మండలం లో 21 పల్స్ పోలియో బూత్ ల ద్వారా అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్య అధికారులు అనిల్ కుమార్, రవికుమార్, మేరీ శ్రీ కళ, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ లు తెలిపారు. మండలం మొత్తం రెండు మొబైల్ వాహనాల ద్వారా హై రిస్క్ ప్రాంతాల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వారు తెలిపారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిన పిల్లలకు సోమవారం, మంగళవారం ఇంటింటి సందర్శనల ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అందరూ ఆరోగ్య కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు, ఫార్మసిస్ట్ ఫాతిమా, మగ ఆరోగ్య కార్యకర్తలు ప్రేమ రాజ్ ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు



## నిండు జీవితానికి రెండు చుక్కలు: యరపతినేని నిఖిల్‌బాబు



పిడుగురాళ్ల, జూన్ 28 ప్రభాతవార్త : రెండు చుక్కలతో చిన్నారులకు ఆరోగ్యవంతమైన నిండు జీవితాన్ని అందించాలని టీడీపీ యువనేత యరపతినేని నిఖిల్‌బాబు అన్నారు. పట్టణంలోని సజన-సహస్ర సూపర్ మార్కెట్ వద్ద గల మెడికల్ షాపు వద్ద ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.


## ఇంద్రసేన గౌడ్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి

మాచర్ల, జూన్ 28 ప్రభాతవార్త: ఇటీవల గూండాల దాడిలో గాయపడ్డ ఇంద్రసేన గౌడ్‌ను పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం పరామర్శించారు. పట్టణానికి చెందిన 17వ వార్డు వైసీపీ కార్యకర్త పగిడిబోయిన ఇంద్రసేన గౌడ్‌పై ఇటీవల దాడికి గురయ్యారు. విషయం తెలుసుకున్న పిన్నెల్లి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## పోలియో రహిత సమాజమే కూటమి లక్ష్యం: యాగంటి

మాచర్ల, జూన్ 28 ప్రభాతవార్త: పోలియో రహిత సమాజమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే పల్స్‌పోలియో కార్యక్రమన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు అన్నారు. స్థానిక నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా రాష్ట్రంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదన్నారు. అయిదు సంవత్సరాలలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలన్నారు. రెండు చుక్కలు జీవితానికి రక్ష అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ గోలి ద్రాక్షాయణి, పట్టణ టీడీపీ నాయకులు కొమెర దుర్గారావు, సీనియర్ నాయకులు మద్దిగపు వెంకటరామిరెడ్డి, దుర్భాకుల ప్రసాద్‌రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి బండ్ల శ్రీను, చందు గౌడ్, పులుసు రఘురెడ్డి, పిన్నంశెట్టి కృష్ణ, యూనిట్ ఇన్‌ఛార్జి శంకర్‌నాయక్, ఏఎన్ఎం రాజకుమారి, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, కార్యకర్తలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.





## పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

నగరం, జూన్ 28, (ప్రభాతవార్త): తెలుగు రవితేజ నిర్మించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని నగరం ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాలు పోలియో చుక్కల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు పిల్లలు కు ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయుంచాలని తెలియజేశారు. ఈ పోలియో మహమ్మారిని రాకుండా పిల్లలకు పోలియో చుక్కలు వేయుంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో విజయవంతం

నిజాంపట్నం, జూన్ 28, ప్రభాతవార్త: పోలియో నివారణలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమం మండలంలో ఆదివారం వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 15 పంచాయితీలలో ఎంపిక చేసిన కేంద్రాల వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పల్స్ పోలియో విజయవంతానికి తమ వంతు కృషి చేశారు. పోలియో రాకుండా ఉండేందుకు చిన్నవయస్సులోనే పోలియో చుక్కలు వేస్తే భవిష్యత్తులో పోలియో వచ్చి అంగవైకల్యం సంభవించకుండా ఉంటుందని వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించటంతో 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు తల్లిదండ్రులు పోలియో చుక్కలువేసే కేంద్రాలకు ఉదయం నుంచి చేరుకున్నారు.

## పేద ప్రజల కొరకు హైవెండ్ వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం

కర్లపాలెం, జూన్ 28. ప్రభాతవార్త:మండలంలోని పేదప్రజల కొరకు కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్ యాజమాన్యం కిమ్స్ శిఖర హాస్పిటల్ ద్వారా నాణ్యమైన వైద్య సే వలందించడం అభినందనీయమని ఎన్ఆర్ బొంతు నాగిరెడ్డి, ఎంపిడివో అద్దూరి శ్రీనివాసరావు, త హసీల్దార్ దాసరి



రవీంద్ర కుమార్ లు సంయుక్తంగా అన్నారు. కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్లో ఆదివారం కిమ్స శిఖర హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో పలువిభాగాలకు చెందిన ప్రముఖ డాక్టర్లతో వైద్యశిబిరం ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా బొంతు నాగిరెడ్డి, విశిష్ఠఅతిధులుగా ఎంపిడివో అద్దూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ దాసరి రవీంద్ర కుమార్ లు పాల్గొని డాక్టర్లు ప్రదీప్ రెడ్డి, సాహితి, శ్రీనివాసరావు, బాబ్జీ లతో కలిసి వై ద్యశిబిరాన్ని ప్రారంభించారు న్యూరాలజిస్ట్ ప్రదీప్ రెడ్డి, పిల్లల వైద్యనిపుణులు సాహితి, పలమనాలజి డాక్టర్ శ్రీనివాసరావు, కార్డియాలజిస్ట్ బాబ్జీ,అఖిలలు 300మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి షుగర్, బీపీ, ఊపిరితిత్తుల పరీక్ష, ఈసిజి, టూడిఏకో, ఎముకల సాంద్రత ప రీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన మందులను రోగులకు అందజేశారు.

## నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు

కొల్లిపర, జూన్ 28, ప్రభాతవార్త:ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంటా నేహా చెప్పారు.ఆదివారం కొల్లిపర మండలంలో పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 0-5 సంవత్సరాల



వయసు పిల్లల్లో 99 శాతం పోలియో చుక్కలు అందించినట్లు ఆమె తెలిపారు.నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ముందుచూపుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లలకు పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని ఆమె చెప్పారు.మండల పరిధిలోని 26 పోలియో కేంద్రాలలో 104 మంది సిబ్బంది పాల్గొన్నారు.ఈ నెల 29,30 తేదీలలో 57 మంది సిబ్బంది



ఇంటింటికీ వెళ్ళి పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని డాక్టర్ నేహా వెల్లడించారు.తమ పిల్లలకు విధిగా పోలియో చుక్కలను తల్లులు వేయించాలని ఆమె సూచించారు.పోలియో రహిత సమాజాన్ని సాధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె సూచించారు.కొల్లిపర సిహెచ్సిలోని పల్స్ పోలియో కేంద్రాన్ని ఎంపిపి,ఆరోగ్య విస్తరణాధికారి నాగరాజు,ఎఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బస్సుల పేరిట ఆర్టీసిని ప్రైవేటుపరంచేయొద్దు: ఆర్టీసి కార్మిక సంఘాలు

విజయవాడ, జూన్ 28 (ప్రభాతవార్త): ఆర్టీసిని విద్యుత్ బస్సులు పేరుతో ప్రైవేటు పరం చేయవద్దని విద్యుత్ బస్సులన్నీ ఆర్టీసి ద్వారానే నిర్వహించాలని ఆర్టీసి ఉద్యోగ సంఘాలుఈ సందర్భంగాడిమాండ్చేశాయి. తమసమస్యలపరిష్కారం, ప్రైవేటువిద్యుత్బస్సులు, డిపోలుప్రైవేటీకరణఅంశాలపైఆర్టీసి ఉద్యోగసంఘాల జేఏసి సమావేశం ఆదివారంవిజయవాడ రెవిన్యూభవన్లో జరిగింది. ఏపీఎస్ ఆర్టీసీలో విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేటు ఆపరేటర్లకు అవకాశం కల్పిస్తూ వేల కోట్లరూపాయలవిలువైన ఆర్టీసి డిపో స్థలాలను కూడా విద్యుత్ బస్సు ఆపరేటర్లకులీజుపేరుతో కట్టబెట్టడం, దశలవారిగా ఆర్టీసీని ప్రైవేటు పరంచేయాలన్నరాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు విరమించుకోవాలని, ఆర్టీసి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసి ఉద్యోగ సంఘాలనాయకులుఈ సందర్భంగాచర్చించారు. ప్రభుత్వంనుంచి తమ సమస్యలపట్ల ఎటువంటిస్పందన లేనందున రెండవ దశ ఆందోళనను ఉధృతంగా చేపట్టాలనిఈసందర్భంగా తీర్మానించారు. రెండవదశఆందోళనలోభాగంగాఈ నెల 29వ తేదీన ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, టిఆర్ బి స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ, ఆర్టీసీ వీసీ ఎండీలకుజేఏసి రాష్ట్ర కమిటి తరపున వినతి పత్రాలు అందజేస్తామన్నారు.

**జూలై 7,8 న రెండురోజులు ఏపీఎస్ ఆర్టీసీ పరిరక్షణ దినం"**

రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, జూలై 9 నుండి 18 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాప్రతినిధుల మద్దతు కోరడం, జూలై 19 నుండి 26 వరకు ఉద్యోగులందరితో సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. జూలై 27న గ్రీవెన్స్ డే రోజున జిల్లా కలెక్టర్ల ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రాలు పంపడం, జూలై 30న జేఏసీ రాష్ట్ర స్థాయి సమావేశం విజయవాడలో నిర్వహించి, తదుపరి మూడవ దశ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని జేఏసి నాయకులు తెలిపారు.

# బాపట్ల జిల్లా వార్త



## పాండురంగాపురంలో ఘనంగా పల్స్ పోలియో

### చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

బాపట్ల. జూన్ 28: ప్రభాతవార్త .ప్రతినిధి: బాపట్ల మండలం పాండురంగాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కలు



వేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ... పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల లోపు వయసున్న పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వాలు ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలను గ్రామీణ ప్రాంత ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో పాటు గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గత ప్రభుత్వంలో అంతా అరాచకమే

### -సంక్షేమం అనేది సామాజిక బాధ్యత: ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

### -పొన్నూరులో ఘనంగా కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభ

పొన్నూరు, జూన్ 28,ప్రభాతవార్త: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అంతా అరాచకమే రాజ్యమేలిందని, దౌర్జన్యాలు, దాడులు, అక్రమాలపై పోరాడితే కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించారని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ళ విజయోత్సవ భారీ బహిరంగ సభ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగింది. తొలుత మునిసిపల్ కార్యాలయం వద్ద నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయం వద్ద బయలుదేరిన ర్యాలీ సజ్జా ఫంక్షన్ హాలు వరకు జరిగింది. కార్యకర్తల నినాదాలు, జిందాబాద్లు, కేరింతల మధ్య విజయోత్సవ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన





బహిరంగ సభలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ వైకాపా అధికారం ఉంది కదా అని సంగం డెయిరీ ఛైర్మన్గా వున్న నన్ను కూడా అక్రమంగా అరెస్ట్ చేసి 30రోజుల పాటు జైలులో పెట్టారన్నారు. ఐదేళ్ళ మన పోరాటం వల్ల స్వర్ణపురిలో టిడిపి, జనసేన, టిడిపి కలిసి పోటీ చేస్తే ప్రజలు 32వేల ఓట్ల మెజార్టీతో కూటమికి పట్టం కట్టారన్నారు. అంటే వైకాపా పాలనలో ప్రజలు ఏవిధంగా విసిగి వేసారి పోయారు అర్ధమవుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్ళు నాతోపాటు కలిసి ఉన్న ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. గత ఐదేళ్ళలో ఎటు నుంచి ఏ కేసు పెడతారో...ఎప్పుడు పోలీసులు వస్తారోనని ఎదురు చూసిన రోజులని చెప్పారు. వైకాపా పాలనలో దోపిడీలకు, దౌర్జన్యాలకు, హత్యలకు, రేషన్ మాఫియాకు, మట్టి మాఫియాను పోషించారన్నారు. మనం అధికారంలోకి వచ్చిక సంక్షేమం అనేది రాజకీయ నినాదం అని కాకుండా సమాజిక బాధ్యతగా చూశామన్నారు. రూ.వెయ్యి ఫించన్ను రూ.నాలుగువేలకు పెంచిన ఘనత మన ప్రభుత్వానిదన్నారు. వికలాంగుల పించన్ను రూ.6వేలకు పెంచాం. మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు ఇస్తున్నామన్నారు. వైకాపా నాయకుల మాటలు కోటలు దాటుతాయ్...చేతలు మాత్రం గడప కూడా దాటవని విమర్శించారు. అమ్మఒడి పేరుతో మోసం చేసి పిల్లలను చదువులకు దూరం చేస్తే....మనం మాత్రం ఎంత మంది ఉంటే అంతమందికి ఇచ్చామన్నారు. పొన్నూరులో 24,500 మందికి రూ.33కోట్లు ఇచ్చామన్నారు.రెండేళ్ళలో సీఎం సహాయనిధి కింద 1050మందికి సాయాన్ని అందించామన్నారు.డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత నియోజకవర్గంలోనే 30కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఉపాధిహామీ నిధులు తెచ్చి ప్రధాన రహదారులు వేశామన్నారు. మీ ఎంపి అయోధ్యరామిరెడ్డి ఇచ్చిన నిధులతో మీరు అభివృద్ధి చేయకపోయినా మేం మాట్లాడి పనులు పూర్తి చేయించామన్నారు.కళ్ళు తెరచి చేస్తే మేం చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. వైకాపా హయాంలో ఒక్క గ్రామంలోనైనా త్రాగునీరు ఇవ్వాలనే ఆలోచన చేశారా..? అని ప్రశ్నించారు. రూ.70కోట్లతో ఆర్అండ్బి రహదారులు అభివృద్ధి చేశామన్నారు. మరో రూ.160కోట్లతో రోడ్ల అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రచిస్తున్నామన్నారు. దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు.46మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం నియోజకవర్గానికే గర్వకారణమన్నారు.గుంటూరు ఛానల్ అభివృద్ధికి రూ.369కోట్లు ఇచ్చిన వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడన్నారు. రూ.27కోట్లతో పొన్నూరులో రోడ్లు వేస్తున్నామన్నారు. నాయకులంతా తగాదాలు పడితే మళ్ళీ 2019లో పరిస్థితే వస్తుందన్నారు. 2029టార్గెట్తో ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. జడీసిఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ 40ఏళ్ళగా పొన్నూరులో ధూళిపాళ్ళ కుటుంబం ప్రజాసేవ చేస్తుందన్నారు. బాధల్లో ఉన్న వేలాదిమంది కుటుంబాలకు కులాలకు అతీతంగా అండగా నిలిచారన్నారు. నియోజకవర్గానికి రూ.10కోట్లు సీఎం సహాయనిధి తెచ్చిన ఘనత నరేంద్రకే దక్కుతుందన్నారు. వైకాపా అల్లరిమూకలకు డాన్ అయిన జగన్మోహనరెడ్డి కులాల మధ్య చిచ్చు పెడుతున్నాడన్నారు. కాపులకు అన్యాయం జరుగుతుందంటూ కల్లబొల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. బొత్సా, గుడివాడ అమర్నాధ్, తోట త్రిమూర్తులు, వంగా గీత, పేర్ని నాని, అంబటి బ్రదర్స్ కాపులకు చెడ్డపేరు తెస్తున్నారన్నారు. వీళ్లంతా కలిసి కాపులపై బూటకపు ప్రేమ్నఉ ఒలకబోస్తూ కులాల చిచ్చు పెట్టి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. ఈ మధ్య మామిళ్ళపల్లిఓ అంబటి మురళీ అనే దుర్మార్గుడు ఏం చేశాడో రాష్ట్రమంతా చూసిందన్నారు. ధూళిపాళ్ళ నరేంద్రపై బురదజల్లేందుకు రోజుకో పేటిఎం బ్యాచ్ను ఇక్కడికి దింపారన్నారు. రాజకీయంగా నన్ను ఆశీర్వదించిన గొప్ప నాయకుడు ధూళిపాళ్ళ అని వడ్రాణం చెప్పారు. సభలో పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబూరావు, మైలా వెంకటరామరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ అహమ్మద్ఖాన్, నిడుబ్రోలు అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్, టిడిపి జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, జనసేన ఇంచార్జి వడ్రాణం మార్కండేబాబు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్కుమార్, శాసన మండలి మాజీ ఛైర్మన్, ప్రభుత్వ సలహాదారు షరీఫ్ మహమ్మద్ అహ్మద్, మాట్లాడారు. బొర్రు రామారావు, మాదల వెంకటేశ్వరరావు, చలమశెట్టి సీతారామయ్య, ఆకుల సాంబశివరావు, యరసాని శ్రీరామమూర్తి, కత్తుల రవికిరణ్,షేక్ బాజిసాహెబ్, పఠాన్ పిరోజ్ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురు కృష్ణాజిల్లా వాసులు మృతి

రేపల్లె, జూన్ 28, ప్రభాతవార్త:బాపట్ల జిల్లాలోని రేపల్లె-పెనుమూడి రహదారిలో ఆదివారం జరిగిన ఘోరమైన రోడ్డు ప్రమాదంలో కృష్ణాజిల్లాకు చెందిన ఇరువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో ముగ్గురు గాయపడ్డారు.పోలీసుల కథనం ప్రకారం కృష్ణా జిల్లా కోడూరు మండలం రామచంద్రాపురం పంచాయతీ శివారు ఈరాల గ్రామానికి చెందిన గంజాల బాపనయ్య తన భార్య నాంచారమ్మ,కుమారుడు సంతోష్కుమార్లతో కలిసి ఎపి39కెవై7236 నెంబరుగల మోటార్ బైక్పై





బయల్దేరాడు.పులిగడ్డ-పెనుమూడి వారధి మీదుగా బాపట్ల జిల్లాలోని రేపల్లెలో గల బంధువుల ఇంటికి వెళ్ళే నిమిత్తం వస్తున్నాడు.పెనుమూడి రోడ్ లోని బాణాసంచా దుకాణం వద్దకు చేరేసరికి రాంగ్రూట్లో రేపల్లె నుండి ఎదురు వచ్చిన ఎపి40ఇటి2998 నెంబరు గల మోటార్ బైక్ బలంగా ఢీకొట్టింది.దీంతో రెండు వాహనాలు చెల్లాచెదురుగా పడిపోయాయి.వాహనాలను డ్రైవ్ చేస్తున్న గంజాల బాపనయ్య(37),వ్యతిరేక దిశలో వేగంగా వచ్చి ప్రమాదానికి కారణమైన కృష్ణా జిల్లా



చల్లపల్లికి చెందిన కాకి రాకేష్(27) అక్కడికక్కడే మృతి చెందారు.తలలు పగిలిపోయాయి.తీవ్ర రక్తస్రావమైంది.హెల్మెట్లు ధరించని కారణంగా ఈ ఘోర ప్రమాదం జరిగింది.వాహనాల వెనుక భాగంలో ప్రయాణిస్తున్న గంజాల నాంచారమ్మ,గంజాల సంతోష్కుమార్,ప్రకాష్లు రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయి గాయపడ్డారు.ప్రకాష్ తలకు తీవ్రమైన గాయమైంది.పరిస్థితి విషమించడంతో వైద్య చికిత్స నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.మృతుడు బాపనయ్య భార్య నాంచారమ్మ,సంతోష్కుమార్లు స్వల ్ంగా గాయపడటంతో వైద్య చికిత్స కోసం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు.పెనుమూడి రోడ్లో జరిగిన విషాద సంఘటన సందర్శకుల హృదయాలను కలిచివేసింది.కాకి రాకేష్ నిబంధనలకు విరుద్ధంగా మోటార్ బైక్ను వేగంగా నడపడం వలన అతనితో పాటు ఎదురుగా వస్తున్న బాపనయ్యలు మృతి చెందడం,వెంట ఉన్నవారు గాయపడటం జరిగిపోయింది.సంఘటనా ప్రదేశాన్ని రేపల్లె టౌన్ సిఐ బి.అశోక్కుమార్ పరిశీలించారు.మృతుడి భార్య నాంచారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పోలియో రహిత సమాజ స్థాపనే అందరి ధ్యేయం

పొన్నూరు, జూన్ 28,ప్రభాతవార్త: పోలియో రహిత సమాజ స్థాపనే అందరి ధ్యేయమని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్బాబు అన్నారు. స్థానికంగా జరిగిన పోలియో చుక్కల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



గతంతో పోల్చుకుంటే పోలీయో మహమ్మారిని చాలా వరకు తగ్గించగలిగామన్నారు. పోలియో చుక్కలను ప్రతి ఒక్కరూ చిన్నారులకు వేయించాలని కోరారు. కమిషనర్ స్వయంగా పోలియో చుక్కలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిడుబ్రోలు పట్టణాధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్, సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## జీవితకాల వైకల్యం నుండి రక్షించేందుకే పోలియో వ్యాక్సిన్

పొన్నూరు, జూన్ 28,ప్రభాతవార్త: ఐదేళ్ళలోపు వయస్సు ఉన్న పిల్లలందరికీ పోలియో వ్యాక్సిన్ చేయించి, వారిని జీవితకాల వైకల్యం నుంచి రక్షించడానికి భారతప్రభుత్వ ఏర్పాటు చేసిన కార్యక్రమమే పల్స్ పోలియో అని సర్వశిక్షా అడిషనల్ కోఆర్డినేటర్, నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఇడుపులపాటి పద్మావతి అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని పాతరెడ్డిపాలెం ఎంపియుపి స్కూల్లో జరుగుతున్న పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ చిన్నారులకు పోలీయో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ పిల్లలకు ప్రాణాంతకమైన పోలియో వ్యాధి సోకకుండా కాపాడడం, వారి శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని



పెంచడానికే ఈ కార్యక్రమమన్నారు. పుట్టినప్పటి నుండి 5సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలందరికీ ఈ చుక్కలను వేయించాలని కోరారు. కేంద్రాలకు రాని పిల్లల కోసం ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి తరిగి చుక్కలను వేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు మండల తహశీల్దార్ కళ్ళెం శ్రీనివాసశర్మ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పెరుగు శ్రీనివాసరావు తదితరులున్నారు.

## స్వచ్ఛంద సంస్థల కృషి ప్రశంసనీయం

పొన్నూరు, జూన్ 28,ప్రభాతవార్త: పోలియో రహిత సమాజస్థాపన కోసం ఏదోకవిధంగా తాము భాగస్వాములవుతామని స్వచ్ఛంద సంస్థలు, వివిధ రకాల అసోసియేషన్లు ముందుకు రావడం అభినందనీయమని సాంబశినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అయినంపూడి గ్రీష్మ అన్నారు. ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉదయం నుంచే వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలియో రహిత సమాజస్థాపనకు వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది



పనిచేస్తున్నారు...వారికి అవసరమైన అల్పాహార, భోజన ఏర్పాట్లు చేసేందుకు తాము ఎప్పుడూ ముందుం టామంటూ పట్టణంలోని పల్స్స్ అసోసియేషన్ నాయకులు, మెడికల్ షాపుల అసోసియేషన్ నాయకులు ముందుకు వచ్చారు. పట్టణ పరిధిలో, మండల పరిధిలో పల్స్ పోలీయో కార్యక్రమంలో భాగస్వాములైనవారికి ఆహార పొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులకు డాక్టర్ గ్రీష్మ, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కారుమూరి ప్రకాష్, మెడికల్ షాపుల అసోసియేషన్ నాయకులు కోట రవిశంకర్,కాకరపర్తి హనుమంతరావు, లింగమల్లు మోహనకృష్ణ తదితరులున్నారు.

## దివ్యాంగులు కృత్రిమ అవయవాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

### -ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు

పొన్నూరు, జూన్ 28,ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్,మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు 29ఉదయం డీవిసి ఇండోర్ స్టేడియంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, కాలిపర్స్ అందజేసేందుకు రిజిస్ట్రేషన్ శిబిరం జరుగుతుందని ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అర్హులైన దివ్యాంగులు పాల్గొని తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు ఆధార్కార్డు, సదరమ్ సర్టిఫికెట్, పాస్పోర్టు సైజు పోటోలు తీసుకొని రావాలన్నారు. సోమవారం జరిగిన ఈ శిబిరాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# టీడీపీ నేత గోవాడ హనుమంతరావుకు నివాళులు

మంగళగిరి, జూన్ 28, ప్రభాతవార్త : మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయం డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్ లో టీడీపీ నాయకులు గోవాడ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ సీనియర్ నాయకులు స్వర్గీయ గోవాడ హనుమంతరావు 15వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పద్మశాలియ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య హాజరయ్యారు. స్వర్గీయ హనుమంతరావు చిత్రపటానికి చైర్మన్ నందం, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నందం మాట్లాడారు. నాడు స్వర్గీయ హనుమంతరావు, పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. హనుమంతరావును ఆయన తమ్ముళ్లు గోవాడ బ్రదర్స్ ఆదర్శంగా తీసుకొని అదే స్థాయిలో పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ ఇబ్రహీం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర, నాయకులు గోవాడ దుర్గారావు, రవి, విజయ్, షేక్ రియాజ్, మల్లెల మణికంఠ, అన్నం నాగబాబు, ఆకురాతి నాగేంద్రం, జొన్నాదుల బాలకృష్ణ, చింతా వెంకటేశ్వరరావు, తోట కరుణ కుమార్, ఆరుద్ర బాజీ, కోలా శ్రీను, కొత్త శ్రీను, మాదల శ్రీను, ఎండీ షరీఫ్, పెండెం శ్రీనివాస ప్రసాద్, కాకర్లపూడి శ్రీ హరిరాజు తదితరులు పాల్గొన్నారు.



**శరణాలయంలో అన్నదానం**

చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో టీడీపీ నేత స్వర్గీయ గోవాడ హనుమంతరావు వర్ధంతి సందర్భంగా గోవాడ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ ఇబ్రహీం, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, గోవాడ కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు గోవాడ దుర్గారావు, రవి, విజయ్, ప్రశాంతి, నెల్లూరు సాయికిరణ్, కాకర్లమూడి శ్రీహరి, రాజు, నెల్లూరి రాజేశ్వరి, మల్లెల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజం కోసం కృషి...

మంగళగిరి, జూన్ 28, ప్రభాతవార్త: మంగళగిరి వీవర్స్ కాలనీ ఏంటీఎంసి హైస్కూల్లో స్థానిక ఇందిరానగర్ యూపీహెచ్సీ ఆధ్వర్యంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు హాజరయ్యారు. నందం, పోతినేని పిల్లలకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. పోలియో రహిత దేశంగా ఉండాలని ఉద్దేశంతో ప్రభుత్వం దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం చేపట్టిందన్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పల్స్ పోలియో కేంద్రాలలో పోలియో చుక్కలు వేయించుకోనని పిల్లలకు ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటికి వచ్చినప్పుడు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పీ శ్రీనివాసరావు, హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష, ఎన్ హెచ్ ఓ డాక్టర్ మల్లిక తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు తొలి అడుగు పోలియో చుక్కలే -ఎమ్మెల్యే రామాంజనేయులు

పెదనందిపాడు జూన్ 28 (ప్రభాతవార్త) మండల కేంద్రమైన పెదనందిపాడు పంచాయతీ కార్యాలయం లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రత్తిపాడు శాసనసభ్యులు డాక్టర్.బూర్ల రామాంజనేయులు పాల్గొని,చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు.తల్లిదండ్రులందరూ తమ పిల్లలను సమీపంలోని పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు.అనంతరం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది సేవలను అభినందిస్తూ, లక్ష్యసాధనకు అనుగుణంగా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి. మండల ఆరోగ్య అధికారి డాక్టర్ నందకుమార్. కూటమి నాయకులు రావి శివరామకృష్ణయ్య. కాంద్రు ప్రసాదు.దివి నాగరాజు. వలపులు చిన్నారుల తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది ఏఎన్ఎం భాగ్యలక్ష్మి. ఆశ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి

తాడిపల్లి, జూన్ 28, ప్రభాతవార్త: జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా పెదవడ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సి)లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ. సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించడం ద్వారా భవిష్యత్తులో పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో తెలుగుదేశం గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, మాజీ సర్పంచ్ చిట్టిబొమ్ము వెంకటేశ్వర్లు, టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ మండవ రమేష్ బాబు, కొండపల్లి కిషోర్, కొప్పాక ఒంకార్,ఎంఎల్హెచ్ఓ దుర్గాప్రసాద్, సూపర్వైజర్ లాజర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# కష్టపడితే దేన్నైనా సాధించవచ్చు - ఎమ్మెల్యే రామాంజనేయులు

పెదనందిపాడు జూన్ 28 (ప్రభాతవార్త): పెదనందిపాడు మండలం, వరగాని గ్రామానికి చెందిన డాక్టర్ నందకిషోర్ కుమార్తె డాక్టర్. కట్టా ప్రత్యూష యూపీఎస్ సీ సివిల్ సర్వీస్లో విశిష్ట ర్యాంక్ సాధించిన సందర్భంగా వరగాని లో ఆదివారం కట్టా ప్రత్యూష విజయోత్సవ మరియు అభినందన సభ ఏర్పాటు చేశారు. సభలో పాల్గొన్న ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్. బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన కట్టా ప్రత్యూష కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆమె సాధించిన ఈ విజయం యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తుందని,వారి పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసం, నిరంతర సాధనతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ప్రత్యూష నిరూపించారని, గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు ఆమెవిజయంస్ఫూర్తిదాయకమని,ప్రేరణగా నిలుస్తుందని,ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తూ విశిష్ట అధికారిణిగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలను అందుకొని తెలుగు రాష్ట్రం పేరు ప్రతిష్టను దేశవ్యాప్తంగా చాటాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్. డాక్టర్ కట్టా ప్రత్యూష ను కలిసి వారి కుటుంబ సభ్యులకి అభినందనలు తెలియజేశారు.కట్టా ప్రత్యూష సాధించిన ఈ ఘనత పట్ల కుటుంబ సభ్యులు, గురువులు, స్నేహితులు మరియు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు. మండల టిడిపి అధ్యక్షులు కోమారు రాంబాబు. పార్లమెంటరీ ఛాయర్మన్ దానం శేషగిరిరావు. ముద్దన రాఘవయ్య. బండారు రాంబాబు .పోపూరి వెంకటప్పయ్య . పోపూరి రవి.వలపులు పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# కృత్రిమ అవయవాలకు 11 మంది దివ్యాంగులు ఎంపిక

మంగళగిరి, జూన్ 28, ప్రభాతవార్త : కృత్రిమ అవయవాలు, కాలిపర్స్ పంపిణీకి ఎంపిక చేయటకు ఆదివారం మంగళగిరిలో నిర్వహించిన ఎంపిక శిబిరంలో 11 మంది దివ్యాంగులను ఎంపిక చేయడం జరిగింది. మంగళగిరిలో నగరపాలక సంస్థ దగ్గర్లో గల ఈద్గా కమ్యూనిటీ హాల్ లో చేపట్టిన ఎంపిక కార్యక్రమానికి 18 మంది దివ్యాంగులు హాజరయ్యారు. మోకాలి పైభాగం వరకు అవయవాలు కోల్పోయిన ఆర్థోపెడిక్ వికలాంగులకు కృత్రిమ అవయవాలు, కాలిపర్స్ పంపిణీకి ఎంపిక చేయుటకు చేపట్టిన కార్యక్రమంలో 11 మంది ఎంపికయ్యారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆలింకో సంస్థ సహకారంతో జిల్లాలోని అర్హత, అవసరం ఉన్న దివ్యాంగుల ఎంపిక కార్యక్రమం జరుగుతుందని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఎన్.వెంకటరవణప్ప తెలిపారు.



**29వ తేదీన పొన్నూరులో..** మోకాలి పైభాగం వరకు అవయవాలు కోల్పోయిన ఆర్థోపెడిక్ వికలాంగుల ఎంపిక కార్యక్రమం సోమవారం పొన్నూరులో ఇండోర్ స్టేడియంలో పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థులకు జరుగుతుందని రమణప్ప తెలిపారు. అర్హత, అవసరం ఉన్న దివ్యాంగులు సదరం వైద్య ధృవీకరణ పత్రము, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రము, ఆధార్ కార్డు, యు.డి.ఐ.డి కార్డు ప్రతులు, రెండు ఫోటోలు, ఫోన్ నెంబర్ వివరాలతో హాజరు కావచ్చని చెప్పారు. వివరాలకు ఫోన్ నెంబరు: 08632323329 సంప్రదించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి, అలింకో ప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డుప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

యడ్లపాడు, జూన్ 28, ప్రభాతవార్త: సందేపూడి గ్రామ పరిధిలో ఈరోజు జరిగిన విషాద ఘటనలో ఓ ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు.మృతుడు గ్రామ సర్పంచ్‌కు చెందిన ట్రాక్టర్‌ను నడుపుతూ పొతూరు శంకరరావుకు చెందిన పొలంలో దున్నే పనులు నిర్వహిస్తున్న సమయంలో ట్రాక్టర్‌కు సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో ఇంజిన్ ఆపకుండా ట్రాక్టర్ దిగిన డ్రైవర్ మరమ్మతులు చేస్తుండగా, ట్రాక్టర్ అకస్మాత్తుగా ముందుకు కదలడంతో అతను ట్రాక్టర్ కింద పడి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.మధ్యాహ్నం వరకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో గ్రామ సర్పంచ్ సంఘటనా స్థలానికి వెళ్లి ట్రాక్టర్ కింద మృతదేహాన్ని గుర్తించాడు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని మృతుడిని గుర్తించారు.ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎడ్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# అమరావతిపై మొదటినుండి విషంకక్కుతున్న వైసీపీ: టీడీపీ నేతల విమర్శ

తెనాలి జూన్28(ప్రభాతవార్త): అమరావతిపై వైసీపీ పార్టీ గానీ ఆ నాయకులు గానీ మొదటినుండి విషం కక్కుతూనే ఉన్నారని, శనివారం నాడు రాజధాని ప్రాంతం లో జరిగిన రాజధాని రైతుల పరిరక్షణ కమిటీ పేరుతో వైసీపీ పార్టీ ఆడిన దండయాత్ర ను ఆంధ్ర రాష్ట్ర ప్రజలు అంతా గమనించారని రాజధానికి భూములు ఇచ్చిన రైతులపై దాడికి వెళ్లిన వైసీపీ పార్టీ నాయకులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రాజధాని రైతుల్లో విభేదాలు సృష్టించడానికి ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడలు సృష్టించటం వైసీపీ నైజం అని రాజధానికి భూములు ఇవ్వని కొంతమంది రైతులను అడ్డం పెట్టుకొని విష ప్రచారం చేస్తున్నారని తెదేపా నాయకులు విమర్శించారు. గతంలో 201419 సమయంలో,నాటి అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా అమరావతిని రాజధానిగా మద్దతు పలికి తరువాత మూడు రాజధానులు నాటకం ఆడటం వైయస్ జగన్ కి సరికాదన్నారు. రాజధానిగా అమరావతిని వ్యతిరేకించిన వైసీపీ నాయకులకు నేడు పర్యటించే అర్హత లేదన్నారు. వైసిపి నేతలు వెళ్లిన పెనుమాక గ్రామంలో 90 శాతం రైతులు రాజధానికి భూములు ఇచ్చారని,రైతులపై రౌడీయిజం చేయటానికి గుండాలను వెంటబెట్టుకుని వెళ్లిన వైసీపీ నాయకులు, ఇప్పుడు రైతులే తప్పు చేసినట్టు మాట్లాడటం సరికాదని,ఆనాడు టిడిపి కార్యాలయం పై కూడా దాడి చేసిన రైతులే రౌడీలే నేడు రాజధాని రైతులపై దాడికి వచ్చారని,ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెదేపా అధ్యక్షులు ఎండి. ఖుద్దుస్, ప్రధాన కార్యదర్శి వసంతం అశోక్, జొన్నాదుల మహేష్, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన తహసీల్దార్ గోపాలకృష్ణ:

తెనాలి, జూన్28(ప్రభాతవార్త): జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా,తహసీల్దార్ కేవీ. గోపాలకృష్ణ ఆదివారం తెనాలి మండలం అంగలకుదురు, జగ్గడిగుంటపాలెం గ్రామాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ కేవీ. గోపాలకృష్ణ మాట్లాడుతూ,05 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని, సోమ, మంగళవారాలలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు, నర్సింగ్ విద్యార్థులు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు సూపర్వైజర్లు రూట్ ఆఫీసర్లను పర్యవేక్షకులుగా నియమించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో,సూపర్వైజర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



# చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన మున్సిపల్ కమీషనర్:

తెనాలి మున్సిపాలిటీ జూన్28(ప్రభాతవార్త): జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా ఆదివారం స్థానిక చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్లో కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు,ఆరోగ్య శాఖాధికారిడాక్టర్ మొవ్వ యేసుబాబు,మాజీ కౌన్సిలర్ మానసారెడ్డి తదితరులతోకలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు మాట్లాడుతూ,పట్టణంలో05 సంవత్సరాల లోపు 11632 మంది చిన్నారుల పోలియో చుక్కలు వేయడం లక్ష్యం కాగా 11499 మందికి పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు.మొత్తం 96.4 శాతం తొలి రోజు పూర్తి చేసినట్లు, మిగిలిన వారికి సోమ, మంగళవారాలలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు మాట్లాడుతూ, పట్టణంలో మొత్తం 58 పల్స్ పోలియో బూతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని బూతులలో ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు, నర్సింగ్ విద్యార్థులు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు .వాటితో పాటు పట్టణంలో శివారు ప్రాంతాలు సంచార జీవనాన్ని కొనసాగించే వారి కోసం రెండు మొబైల్ బృందాలను ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేయించినట్లు చెప్పారు. రైల్వే స్టేషన్లో తూర్పు ,పడమర బుకింగ్ ల వద్ద , రెండు బస్టాండ్ లో పోలియో కేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణాలలో ఉన్న చిన్నారులకు సైతం పోలియో చుక్కలు వేసే విధంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు సూపర్వైజర్లు రూట్ ఆఫీసర్లను పర్యవేక్షకులుగా నియమించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో సభ్ యూనిట్ ఆఫీసర్లు,అందె బాలచంద్రమోళి ,శ్రీ కంఠ ఉమాకాంత్, రూట్ఆఫీసర్ జంగం శ్యామ్, సూపర్వైజర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అంగన్వాడీ కార్యకర్తలు నగరదీపికలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



# ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన మున్సిపల్ కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ జూన్28(ప్రభాతవార్త): మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు ఆదివారం పట్టణం లోని చినరావూరు డొంకరోడ్, బీసీ కాలనీలో జరుగుతున్న ప్రత్యేక సవివర ఓటరు జాబితా సవరణ పనితీరును పరిశీలించి బిఎల్ఓ లకు తగు సూచనలు చేశారు. ఓటర్ల జాబితాలో సమగ్రంగా సమాచారాన్ని సేకరించి సవరణ చేయాలని సూచించారు. జాబితా సవరణపై బిఎల్వోలు ,సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఓటర్లు సమర్పించే పత్రాలను పరిశీలించి , అందుకు తగిన సమాచారం ఓటరు జాబితాలో ఉన్నది లేనిది పరిశీలించారు. ఓటర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేరు వేరు ప్రాంతాల్లో నివసించేవారు, సంచార జాతులు, వలస కార్మికులు వంటి ఓటర్ల విషయంలో పూర్తిగా పరిశీలన చేయాలని సూచించారు. ఖచ్చితమైన సమాచారంతో ఓటర్ల జాబితాను తయారు చేయాలని అన్నారు. సవివర ఓటరు జాబితా సవరణ త్వరితగతిన పూర్తి చేసేందుకు స్థానిక నగరదీపికలు ,ఆర్పీలు బిఎల్వోలకు సహకారం అందించాల్సిందిగా ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బిఎల్వోలు సిబ్బంది పాల్గొన్నారు. బిఎల్ఓ లు సిబ్బంది పాల్గొన్నారు.



# రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో

తెనాలి జూన్28(ప్రభాతవార్త): రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ లో గల పోలియో చుక్కల కేంద్రం వద్ద వైద్య సిబ్బందితో కలసి చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది. క్లబ్ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్,ఐపిపి ఈదర శ్రీనివాసరావు ,సెక్రటరీ ఎలెక్ట్ కొల్లి రాజేంద్రప్రసాద్, సెక్రటరీ నామిని మల్లాది అర్జున్, ఉన్నవ సూర్యనారాయణ, ఆలపాటి కిరణ్ చౌదరి, ఏఎన్ఎం, జి ఎన్ ఎం లు పాల్గొనడం జరిగింది.




# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూన్ 28, ప్రభాతవార్త : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 32వ ఆవిర్భావ దినోత్సవం జూలై 7వ తేదీన జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాలతో మండలంలోని మేజర్ పంచాయతీ గ్రామం ముట్లూరు, బాబు జగజ్జీవన్ రామ్ కాలనీలో ఆదివారం మాదిగల పుణ్యక్షేత్ర నిర్మాణానికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయకుమార్ మాదిగ హాజరై మాట్లాడుతూ..ఉద్యమ పురిటిగడ్డ, ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో జూలై 7వ తేదీన ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న మాదిగల పుణ్యక్షేత్ర నిర్మాణానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగ, మాదిగ అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ క్షేత్రంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ పోరాటంలో అశువులు బాసిన మాదిగ అమరవీరుల స్తూపంతో పాటు, మన ఆరాధ్య దైవాలు మరియు స్ఫూర్తి ప్రదాతలైన జాంబవంతుడు, సద్గురు సంత్ రవిదాస్, అరుంధతి దేవి, కక్కయ్య మాదిగల విగ్రహాలను ప్రతిష్టించనున్నట్లు వివరించారు. ఈ ఘట్టంలో ఎంఆర్పిఎస్ నాయకులు మరియు కార్యకర్తలందరూ తమ కుటుంబ సభ్యులతో కలసి శంకుస్థాపన కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎడ్లూరి సుధాకర్ మాదిగ, మందపాటి ముత్తయ్య మాదిగ, కొక్కిలగడ్డ బాలయ్య మాదిగ, ఎడ్లూరి సాంబయ్య మాదిగ, ఈర్నపాటి మోషే మాదిగ, బుర్రి ప్రభాకర్ మాదిగ, ఎడ్లూరి జీవన్ బాబు, వై. అనిల్ మాదిగ, కొక్కిల గడ్డ సుబ్బారావు మాదిగ, ఎడ్లూరి సుభాని మాదిగ, తదితర మాదిగ సోదరులు పాల్గొన్నారు.



# రెండు పోలియో చుక్కలు చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాట..

ప్రత్తిపాడు, జూన్ 28, ప్రభాతవార్త : రెండు పోలియో చుక్కల మందు చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తాయని ముట్లూరు వట్టిచెరుకూరు కాట్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ పి.మానస ప్రియదర్శిని, డా.శివాని, డా.ఎన్. దివ్యశ్రీ పేర్కొన్నారు. మండల పరిధిలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పల్స్ పోలియో సందర్భంగా ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు అందించే రెండు చుక్కల పోలియో మందు వారి బంగారు భవిష్యత్తుకు బాట అని చెప్పారు. పోలియో వచ్చిన తర్వాత నయం చేయలేమని, అది రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అందుకే పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఆదివారం ముట్లూరు గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత దేశంగా చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం మన బాధ్యతగా తీసుకోవాలని తెలియజేశారు. పోలియో వస్తే పిల్లలు జీవితాంతం నడవలేరని, అందువల్ల ముందుజాగ్రత్తగా రెండు పోలియో చుక్కలు వేయిస్తే వారు సురక్షితంగా ఉంటారని పేర్కొన్నారు. మన దేశంలో పోలియో కేసులు నమోదు కావడం లేదని, కాని పొరుగు దేశల నుంచి వైరస్ వచ్చే అవకాశం ఉందని, ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో వచ్చిన తర్వాత నయం చేయలేమని, అది రాకుండా నివారించాలని అందుకు ఈ రెండు పోలియో చుక్కలతో పోలియో రాకుండా జాగ్రత్త పడవచ్చునని చెప్పారు. పిల్లలకు జ్వరం ఉన్నా, గతంలో ఈ చుక్కల మందు వేయించినా ఈ రెండు చుక్కల పోలియో మందు పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని చెప్పారు. పోలియో రాకుండా రెండు చుక్కల మందు ఒక్కటే శరణ్యమన్నారు. ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేయించని వారు సోమ, మంగళవారాల్లో ఆయా కేంద్రాలకు వెళ్లి పోలియో చుక్కలు వేయించాలని తెలియజేశారు. ముట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రపరిధిలో 682 మందికి 656 మంది చిన్నారులకు, కాట్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 1230 చిన్నారులకు గాను 1202మందికి, వట్టిచెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1054 మంది చిన్నారులకు గాను 970 మందికి పోలియో చుక్కలు అందించినట్లు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, స్థానిక వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# అచ్చంపేటలో విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం

అచ్చంపేట, జూన్ 28 (ప్రభాతవార్త): జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం అచ్చంపేట, మాదిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మండలంలోని 17 ఉపకేంద్రాల్లో 32 పోలియో బూత్‌లు, రెండు మొబైల్ బృందాలను ఏర్పాటు చేసి, పుట్టిన శిశువుల నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో నిరోధక రెండు చుక్కల మందును వేశారు. మండలంలోని అన్ని పోలియో కేంద్రాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. గింజుపల్లి తండా మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని మండల పరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి బి. స్వర్ణమ్మ రమేష్ నాయక్ ప్రారంభించగా, అచ్చంపేట పీహెచ్‌సీ కేంద్రంలో ఏర్పాటు చేసిన బూత్‌ను ఇన్‌చార్జి మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ వైస్ చైర్మన్ రాయిడి సాంబశివరావు, మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పార్టీ నాయకులు వెనిగండ్ల కోటయ్య, చల్లా అనూపకళ, బుచ్చిబాబు, సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డా. వి. రాంబాబు నాయక్ మాట్లాడుతూ, పోలియో వ్యాధి కారణంగా గతంలో ఎంతోమంది చిన్నారులు అవిటితనానికి గురయ్యారని, కానీ ప్రతి చిన్నారికి కోల్డ్ చైన్ విధానంలో భద్రపరిచిన వ్యాక్సిన్ ద్వారా రెండు పోలియో చుక్కలు వేయడం వల్లే భారత్ పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందిందని తెలిపారు. మాదిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డా. జె. రాములు నాయక్ మాట్లాడుతూ, అచ్చంపేట, మాదిపాడు పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 0 నుంచి 5 సంవత్సరాల లోపు 6,248 మంది చిన్నారులు ఉండగా, తొలి రోజు 32 బూత్‌లు, రెండు మొబైల్ బృందాలు, ముగ్గురు రూట్ సూపర్వైజర్ల ద్వారా 5,435 మంది (87 శాతం) చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని తెలిపారు. మిగిలిన చిన్నారులకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట వైద్యాధికారి డా. సి.హెచ్. స్రవంతి, మాదిపాడు వైద్యాధికారి డా. జి. పూజిత, ఆరోగ్య విస్తరణ అధికారి పి. వెంకటరావు, సీహెచ్‌ఓ ఇన్యాసమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ పార్వతి, హెల్త్ విజిటర్ ఎలిజబెత్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు. ఫిట్‌నెస్, అనుమతులు లేకుండానే కృష్ణానదిపై పడవల రాకపోకలు



# గింజుపల్లి - కోగంటివారిపాలెం వద్ద అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

## ప్రభుత్వ ఆదాయానికి గండి.. పంచాయతీల ఆధ్వర్యంలో పడవలు నడపాలని డిమాండ్

అచ్చంపేట, జూన్ 28 (ప్రభాతవార్త): అచ్చంపేట మండల పరిధిలోని గింజుపల్లి, కోగంటివారిపాలెం ప్రాంతాల మధ్య కృష్ణానదిపై ఫిట్‌నెస్ సర్టిఫికెట్, అధికారిక అనుమతులు లేకుండానే పడవలను నడుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే పడవలను ఇటీవల అధికారులు ఫిట్‌నెస్ లేకపోవడంతో సీజ్ చేసినప్పటికీ, ప్రస్తుతం మళ్లీ ప్రయాణికులతో నడుపుతూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో పడవల నిర్వహణకు టెండర్లు నిర్వహించి అనుమతులు ఇస్తారు. అయితే ఈసారి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి చేయడంతో జిల్లాలోని తొమ్మిది పడవ రేవుల్లో ఒక్క పడవకూ ఫిట్‌నెస్ లేకపోవడంతో టెండర్లు వాయిదా పడ్డాయి. అమరావతి మండలం దిడుగు గ్రామం నుంచి ఏటూరు వెళ్లే పడవకు మాత్రమే అన్ని అనుమతులు ఉండటంతో టెండర్ నిర్వహించారు. మిగిలిన ప్రాంతాల్లో టెండర్లు నిలిచిపోవడంతో కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండానే పడవలను నడుపుతూ ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిట్‌నెస్ లేని పడవల్లో ప్రయాణించడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొత్త పడవలకు మాత్రమే నెల రోజుల్లో ఫిట్‌నెస్ లభించే అవకాశం ఉండగా, పాత పడవలకు ఫిట్‌నెస్ పొందేందుకు మూడు నుంచి ఆరు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా గ్రామ పంచాయతీలు, సచివాలయాల ఆధ్వర్యంలో పడవలను నిర్వహించి, ఎంపీడీవోల పర్యవేక్షణలో నడిపించాలని స్థానికులు, నిపుణులు కోరుతున్నారు. ఒక్కో పడవ రేవు ద్వారా రోజుకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తుందని, నిర్వహణ ఖర్చులు పోను రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు మిగులుతుందని స్థానికులు చెబుతున్నారు. టెండర్లు లేకపోవడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం దళారుల చేతుల్లోకి వెళ్తోందని ఆరోపిస్తున్నారు. ఈ ఆదాయాన్ని గ్రామ పంచాయతీలకు మళ్లిస్తే ప్రభుత్వ ఆదాయంతో పాటు పంచాయతీ నిధులు కూడా పెరుగుతాయని అభిప్రాయపడుతున్నారు.



**దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలి:** టెండర్లు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు దళారులు అక్రమంగా పడవలను నడుపుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాత్కాలికంగా గ్రామ పంచాయతీలకు అనుమతులు ఇచ్చి, ఎంపీడీవోల పర్యవేక్షణలో పడవలను నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు . అనుమతులు లేకుండా పడవలు నడపడం చట్టవిరుద్ధం. సంబంధిత వ్యక్తులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. నిబంధనలు ఉల్లంఘించి పడవలను నడిపితే వాటిని సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

29-6Pg5_29-6Pg5.qxd 28/Jun/26 11:02 PM Page 1



# ప్రకృతి సంపదకు ఈశాన్యభారతం పుట్టినిల్లు

## మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జూన్ 28:** భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాలు ప్రకృతి సంపదకు, పర్యావరణ హితమైన జీవనశైలికి పుట్టినిల్లు. ఈ క్రమంలోనే పర్యావరణ పరిరక్షణ కోసం అక్కడి ప్రజలు సాగిస్తున్న విశేష కృషిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా పరిచయం చేశారు. ఆదివారం మన్‌కీబాత్ 135వ కార్యక్రమంలో అస్సాంలోని అరుదైన హర్గిలా పక్షి సంరక్షణ, అలాగే మేఘాలయలోని జీవన వేర్ల వంతెనల విశిష్టతను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. సమాజంలో ఉన్న అపోహలను తొలగిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడం ఎలాగో ఈ రెండు అంశాలు నిరూపిస్తున్నాయని ప్రధాని మోడీ ప్రశంసించారు. హర్ అంటే ఎముకలు, గిలా అంటే మింగడం అని అర్థం. ఈ పక్షులు ఎముకలను కూడా సునాయాసంగా మింగేయగలవు. సుమారు 1.5 మీటర్ల ఎత్తు, వింతైన రూపం కారణంగా వీటిని చూసి ప్రజలు భయ పడేవారు. అస్సాంలో కనిపించే అరుదైన హర్గిలా పక్షి సుదీర్ఘకాలంగా స్థానిక ప్రజల మూఢనమ్మకాలకు, భయాం దోళనలకు బలవుతూ వచ్చిందని మోడీ అన్నారు. నిజానికి పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచడంలో, చనిపోయిన జంతువుల అవశేషాలను తొలగించడంలో ఈ పక్షులు అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి. అయి నప్పటికీ, వీటి మనుగడను గుర్తించని స్థానికులు హర్గిలా పక్షుల గూళ్లు ఉన్న చెట్లను కూడా క్రూరంగా నరికివేసేవారు. కేవలం అజ్ఞానం వల్లే ఒక ఉప యోగకరమైన పక్షిజాతి వినాశనం అంచుకు చేరుకుందని ప్రధాని వివరించారు. ఈ గడ్డు పరిస్థితుల్లో ఆ పక్షుల రక్షణ కోసం జీవశాస్త్రవేత్త పూర్ణిమ దేవి బర్మన్ నడుం బిగించారు. సమాజంలో బలంగా నాటుకుపోయిన ఈ మూఢనమ్మకాలను తొలగించాలని ఆమె గట్టిగా సంకల్పించారు. ఇందులో భాగంగా స్థానిక మహిళలను ఏకంచేసి, శాస్త్రీయ దృక్పథంతో వారికి అవగాహన కల్పించారు. పూర్ణిమ దేవి బర్మన్ చూపిన బాటలో నడిచిన మహిళలు క్రమంగా ఒక పెద్ద ఉద్యమంగా రూపాంతరం చెందారు. అలా ఏర్పడిందే ఈనాటి పర్యావరణ రక్షక దళం హర్గిలా ఆర్మీ. నేడు వేలాది మంది గ్రామీణ మహిళలు ఈ పక్షులను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. అస్సాం స్ఫూర్తిదాయక పక్షిసంరక్షణ ఉదంతాన్ని వివరించిన అనంతరం ప్రధాని మోడీ మేఘాలయ పర్వత శ్రేణులలోని అపురూపమైన జీవన వేర్ల వంతెనల వైపు దృష్టి సారించారు. మేఘాలయ అంటేనే మేఘాల నిలయమని, అక్కడి ప్రజల ఆత్మీయత పర్యాటకులను ఎప్పటికీ ఆకట్టుకుంటుందన్నారు. అయితే వీటన్నింటికంటే ఎంతో ప్రత్యేకమైనవి అక్కడి స్థానిక గిరిజనులు నిర్మించే సహజసిద్ధమైన వంతెనలని చెప్పారు. ఇవి కేవలం కొద్దిరోజుల్లోనో లేదా కొద్ది సంవత్సరాల్లోనో కట్టేవి కాదని, వీటి తయారీ వెనుక దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ, పట్టుదల దాగి ఉన్నాయని ప్రధాని వివరించారు.

**మట్టి వినాయక ప్రతిమలనే వాడాలి:** సెప్టెంబరులో వస్తున్న వినాయకచవితికి మట్టితో చేసిన విగ్రహాలను మాత్రమే వినియోగించాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా, బియా వ్రాకు చెందిన మహిళల కృషని ప్రధాని ప్రత్యే కంగా ప్రశంసించారు. తమ పరిసరాల్లో పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను చూసి నిరాశ చెంద కుండా, ఆ మహిళలు స్వయంగా రంగంలోకి దిగి ప్లాస్టిక్ వ్యర్థాలను, ఖాళీ బాటిళ్లను సేకరించడం ప్రారంభించారని ఆయన వివరించారు. ఈ ప్లాస్టిక్‌ను ఈకోబ్రిక్స్‌గా మార్చి, బహిరంగ ప్రదేశాలను సుందరీకరించడానికి ఉపయోగిస్తున్నారని, గత కొద్దినెలల్లోనే వందలకిలోల ప్లాస్టిక్ రీసైక్లింగ్ జరిగిందని మోడీ సంతోషం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కాలుష్యానికి కారణమైన ప్లాస్టిక్, నేడు నగర సౌందర్యానికి చిహ్నంగా మారడం ఆ మహిళల కృషికి నిదర్శనమని ప్రధాని కొనియాడారు. నీటినిపొదుపు చేద్దాం క్యాచ్ దరెయిన్ ప్రకృతిని కాపాడుకోవడంలో భాగంగా, కొనసాగుతున్న క్యాచ్ ద రెయిన్‌ప్రచారంలో ప్రజలందరూ భాగ స్వాములుకావాలని ప్రధాని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మోడీ దేశ ప్రజలను కోరారు.





## బంగారం కొనవద్దన్న పిలుపునకు అద్భుత స్పందన

### ప్రజలకు ప్రధాని మోడీ కృతజ్ఞతలు

బంగారం కొనుగోళ్లపై దేశ ప్రధాని మోదీ మరోసారి స్పందించారు. తన 135వ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు తాను ఇచ్చిన పిలుపునకు సామాన్య ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా, దేశ ఆర్థిక స్థిరత్వం కోసం విలాసవంతమైన ఖర్చులు, ముఖ్యంగా బంగారం కొనుగోళ్లను కొంతకాలం వాయిదా వేసుకోవాలని మోడీ చేసిన విజ్ఞప్తిని ప్రజలు బాధ్యతాయుతంగా స్వీకరించారని వెల్లడించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు మోడీ కృతజ్ఞతలు చెప్పారు విదేశీ పర్యటనలను వాయిదా వేసుకోవడం, ఇంధన ఆదా కోసం సొంత వాహనాల వినియోగాన్ని తగ్గించు కోవడం వంటి చర్యలను ప్రజలు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారని మోడీ తెలిపారు. ఈ సానుకూల ధోరణి దేశ విదేశీ మారక నిల్వలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని పేర్కొన్నారు. బంగారం, ఇంధనం వంటి అత్యవసర దిగుమతులపై భారం తగ్గించడంద్వారా రూపాయి విలువను సుస్థిరం చేయాలనేదే ఈ ప్రయత్నం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ప్రధాని విజ్ఞప్తి తర్వాత మార్కెట్లో గణనీయమైన మార్పులు కూడా వచ్చాం. 10న 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,53,140 ఉండగా, ఆదివారం నాటికి అది రూ. 1,39,873కి పడిపోయింది. అదేవిధంగా కేజీ వెండి ధర రూ. 2,62,350 నుంచి రూ. 2,16,541కి తగ్గింది. ఈ స్వల్ప వ్యవధిలోనే బంగారం ధర రూ. 13,267, వెండి ధర రూ. 45,809 మేర తగ్గడం విశేషం.



## అమర్‌నాథ్ యాత్రకు సహకరించాలి

### ముస్లిం సంఘాల నేతలతో లెఫ్టినెంట్ గవర్నర్ సమావేశం

**శ్రీనగర్, జూన్ 28:** హిందువులు పవిత్రంగా భావించే అమర్‌నాథ్ యాత్ర మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఈ యాత్రకు కాశ్మీరీ ముస్లిం నేతలతోపాటు పౌర సంఘాల నేతలు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ యాత్ర విజయవంతం కావాలని వారంతా ఆకాంక్షించారు. తాము ఈ యాత్రికుల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని అన్నారు. యాత్ర సజావుగా సాగేందుకు యాత్రికులకు సహకారం అందించేందుకు అన్ని విధాల సహకరిస్తామని వారు స్పష్టం చేశారు. ఆదివారం శ్రీనగర్‌లో అమర్‌నాథ్ యాత్ర పుణ్య క్షేత్ర బోర్డ్ చైర్మన్, జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి కాశ్మీర్ ముస్లిం నేతలతోపాటు పౌర సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో పాల్గొని అమర్‌నాథ్ యాత్రకు మద్దతు ప్రకటించిన వారిపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రశంసలు కురిపించారు. వారంతా ఆధ్యాత్మిక సంప్రదాయ సంరక్షకులని, దేశ రక్షకులని అభివర్ణించారు. తరతరాలుగా ఈ అమర్‌నాథ్ యాత్ర ఆధ్యాత్మిక వారసత్వంగా కొనసాగుతోందన్నారని గుర్తు చేశారు. ఈ యాత్రకు మరోసారి భక్తులను స్వాగతించడానికి తాము సిద్ధమవుతున్నామని తెలిపారు. అలాంటి తరుణంలో మీ మార్గదర్శనం, సహకారం కోసం మీలో ప్రతి ఒక్కరి కోసం తాను ఎదురు చూస్తున్నానని తెలిపారు. ప్రతి యాత్రికుడు గౌరవం, భద్రతతోపాటు తాము కూడా ఈ ప్రాంతానికి చెందిన వారమనే భావన పెంపొందేలా చూడటంలో మీ పాత్ర అత్యంత కీలకమని ఈ సందర్భంగా లెఫ్టినెంట్ గవర్నర్ సిన్హా వ్యాఖ్యానించారు. తమ హోటళ్లలో బస చేసే అమర్‌నాథ్ యాత్రికుల నుంచి వసూలు చేసే ఛార్జీల్లో 30 శాతం తగ్గిస్తామని హోటల్ యజమానులు ప్రకటించారు. వారు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. జులై 3న ఈ యాత్ర ప్రారంభం కానుంది. ఆగస్టు 28వ తేదీతో ఈ యాత్ర ముగియనుంది. ఈ యాత్ర కోసం ప్రభుత్వం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. భద్రత కోసం పోలీసులు, సైన్యంతోపాటు 670 కంపెనీల పారా మిలిటరీ బలగాలను మోహరించనుంది.

## కేంద్ర మంత్రికి రూ.99లక్షలు పైగా సబ్సిడీ..

**న్యూఢిల్లీ,జూన్ 28:** కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయమంత్రి భగీరథ్ చౌదరి రాజస్థాన్‌లో తన దోసకాయల సాగు కోసం రూ.99 లక్షలకుపైగా మొత్తాన్ని సబ్సిడీగా పొందారు. ఈ రాయితీని ఆయన తాను ఉపాధ్యక్షునిగా పని చేస్తున్న బోర్డునుంచే పొందడం విశేషం. ఒక ఆంగ్లపత్రిక ప్రచురించిన వివరాల ప్రకారం కూచామన్ జిల్లా, పీహ్ గ్రామంలో నేషనల్ హార్టికల్చర్ బోర్డ్(ఎన్‌హెచ్‌బీ), వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వం వారి సహాయంతో అనే బోర్డు కలిగిన ఒక విస్తారమైన వ్యవసాయ క్షేత్రం ఉంది. దానిపై లబ్ధిదారుని పేరు దగ్గర మిస్టర్ భగీరథ్‌చౌదరి అని, సబ్సిడీ మొత్తం 50శాతం అంటే రూ.99, 60,000 అని స్పష్టంగా రాసి ఉంది. గత ఏడాది దేశవ్యాప్తంగా అమోదం




పొందిన 467 ప్రాజెక్టులలో మంత్రి ప్రాజెక్టు ఒకటి కావడం విశేషం. కేంద్ర మంత్రికి రాయితీ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తిన వేళ భగీరథ్ చౌదరి మాట్లాడుతూ తాను మంత్రి కాకముందే తన దోసకాయల సాగు ప్రాజెక్టు కోసం ప్రభుత్వ పథకం కింద రూ.99.03 లక్షల సబ్సిడీని పొందినట్లు తెలిపారు. ఈ విషయంలో తానేమీ దాచలేదని, తనపై వస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. కాగా ఈ ఉదంతంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా సోషల్‌మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ధర్మం ఇంటి నుంచే మొదలవుతుందంటారు. కానీ బీజేపీకి మాత్రం సబ్సిడీ ఇంటి నుంచే మొదలవుతుందని వ్యాఖ్యానించారు. మంత్రి చేపట్టిన ప్రాజెక్టు వ్యయం రూ.1.99 కోట్లు. ఇందులో లబ్ధిదారు వాటా రూ. 49.8 లక్షలు. మంత్రి ఈ ప్రాజెక్టు కోసం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.1.49 కోట్లు రుణం తీసుకున్నారని ఆ వార్తకథనంలోఉంది ఈ ఉదంతంపై మంత్రి కార్యాలయ సహాయకుడు స్పందిస్తూ, ఈ ప్రాజెక్టు వివరాలను త్వరలోనే ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు.

## ఈ యేడాదే బంగ్లాదేశ్‌కు వెళ్లిపోతా: మాజీ ప్రధాని షేక్ హసీనా

**న్యూఢిల్లీ,జూన్ 28:** రెండేళ్ల క్రితం బంగ్లాదేశ్ లో తలెత్తిన జెన్ జీ తిరుగుబాటు తర్వాత దేశం వదిలి భారత్ కు తరలివచ్చేసిన మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పటి నుంచీభారత్‌లో ప్రవాసంలో ఉంటున్నారు. తాను ప్రధానిగా ఉన్నప్పుడు భారత్‌లో సానుకూల సంబంధాలు నెరిపిన చరిత్ర ఉన్న హసీనాను మన ప్రభుత్వం శరణార్థిగా పరిగణించి ఆశ్రయం ఇచ్చింది. బంగ్లాదేశ్ లో ఆమెపై పలు కేసులు ఉన్నా, వాటి విచారణ కోసం ఆమెను అప్పగించాలని అక్కడి ప్రభుత్వం కోరినా భారత్ మాత్రం పట్టించుకోలేదు. అయితే హసీనా ఇప్పుడు స్వదేశం తిరిగి వెళ్లడంపై క్లారిటీ ఇచ్చారు. తాను ఈ ఏడాదే స్వదేశానికి తిరిగి వెళ్లిపోతానని తాజాగా ఇచ్చిన టివి ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు. తన పార్టీ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక శక్తి అని ఆమె స్పష్టం చేశారు. మైనారిటీలపై ఎలాంటి దాడి అయినా బంగ్లాదేశ్ స్వాతంత్రంపై దాడితో సమానమని హసీనా తేల్చి చెప్పారు. దేశవ్యాప్త నిషేధాన్ని ధిక్కరిస్తూ అవామీ లీగ్ తాజాగా తన 77వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ సందర్భంగా డజన్ల కొద్దీ కార్యకర్తలు అరెస్టు అయ్యారు. తన తిరుగు ప్రయాణం అనేది వ్యక్తిగత ఆశయానికి సంబంధించిన విషయం కాదని, ఇది బంగ్లాదేశ్ ప్రజల రాజకీయ హక్కులు, ప్రజాస్వామ్య పునరుద్ధరణ, చట్ట పాలన, మన విముక్తి పోరాట స్ఫూర్తి వంటి



అత్యంత కీలకమైన అంశాలతో ముడిపడి ఉందని టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో హసీనా తెలిపారు. తాను అధికారం కోసం రాజకీ యాలు చేయ నని, బంగ్లాదేశ్ ప్రజల సంక్షేమం కోసం, సోనార్ బంగ్లా (సువర్ణ బంగ్లా)ను నిర్మించాలన్న జాతిపిత బంగాబంధు షేక్ ముజిబుర్ రెహామాన్ కలను సాకారం చేయడం కోసం రాజకీయాలు చేస్తానని తెలిపారు. తనకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పు న్యాయమైనది కాదన్నారు.

## లోహగఢ్ కోటలో కేతన్ హత్య సీన్ రీకన్‌స్ట్రక్షన్



**పూణె,జూన్ 28:** మహారాష్ట్రలోని పూనేకు చెందిన వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసు విచారణలో ప్రధాన నిందితురాలు సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి ప్రస్తుతం పోలీసు కస్టడీలో విచారణ ఎదుర్కొంటున్నారు. దీనిలో భాగంగా సియా గోయల్‌ను పోలీసులు ఆదివారం ఉదయం 6.30 గంటలకు లోహగఢ్ కోటకు తీసుకువచ్చారు. పర్వతంపైనున్న ఈ కోట నుంచే కేతన్‌ను సియా తోసేసి చంపేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హత్యకు సంబంధించిన వివరాల్ని సేకరించేందుకు పోలీసులు కోట వద్ద సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. సియాను తీసుకెళ్లి అక్కడ ఆమెఎలా హత్య చేసిందో వివరంగా తెలుసుకున్నారు. ఈ సీన్ రీక్రియేషన్‌లో భాగంగా మనిషిని పోలిన ఒక బొమ్మను కూడా పోలీసులు పర్వతంపైనుంచి తోసేశారు. ఇక, పోలీసు కస్టడీలో విచారణలో సియా, చేతన్‌లు కీలక విషయాల్ని తెలిపారు. కేతన్ హత్యకు ముందు లోహగఢ్ కోటలో మర్డర్ రిహార్సల్స్ కూడా చేసినట్లు తేలింది. హత్య చేయడానికి కొద్ది రోజుల ముందు ఇద్దరూ కోటకు వెళ్లి ఏ ప్రదేశం నుంచి తోసేస్తే ఈజీగా చంపవచ్చు అనేది పరిశీలించారు. అనేక ప్రదేశాల్ని పరిశీలించి, అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నారు. అతడిని తోసేసిన తర్వాత అది హత్యలా కాకుండా ప్రమాదంగా అనిపించేలా ఏ జాగ్రత్తలు తీసుకోవాలో ముందే ప్లాన్ చేశారు. కేతన్ హత్య అనంతరం పోలీసులు విచారణలో అడగబోయే ప్రశ్నలు ఏంటి వాటికి ఏం సమాధానంచెప్పాలో కూడాముందుగానే సిద్ధమయ్యారు. హత్య చేసే విధానాల గురించి గూగుల్‌లో, యూట్యూబ్‌లో సెర్చ్ చేశారు. సియా, చేతన్ కలిసి చాలా పకడ్బందీగా హత్యకు ప్లాన్ చేశారు.



## రాజకీయాలంటే పార్ట్‌టైమ్ బాధ్యతలు కాదు

### రాహుల్‌పై మాజీ రాష్ట్రపతి ప్రణబ్ కుమార్తె చురకలు

**న్యూఢిల్లీ,జూన్ 28:** మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠా ముఖర్జీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయాలంటే కొద్ది రోజులు ప్రజల్లో ఉంటూ, మళ్లీ మాయమయ్యే వ్యవహారం కాదని, రాజకీయం 24 గంటలు, ఏడాది పొడవునా కొనసాగే ఫుల్‌టైమ్ బాధ్యత అని ఆమె అన్నారు. ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 2014లో రాహుల్ గాంధీ కాంగ్రెస్ ముఖ్య నేతగా ఉన్నప్పటి నుంచి పార్టీ వరసగా ఎన్నికల్లో ఓటములు చవిచూస్తోందని, ఇది ఆయన నాయకత్వ వైఫల్యంగా భావించాల్సిందే అని పేర్కొన్నారు.

## 'కన్యత్వం' పోతే బాధితురాలిని తప్పుబట్టలేం




### అత్యాచార కేసులో అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు

### నిందితుడు 10రోజుల్లోపు లొంగిపోవాలని ఆదేశం

**ప్రయాగ్‌రాజ్, జూన్ 28:** అత్యాచార బాధితురాలి వాంగ్మూలం విశ్వసనీయంగా ఉన్నట్లయితే, ఆమె హైమెన్ (కన్యత్వ పొర) చిరిగిపోయి ఉండటం అనే కారణంతో నిందితుడికి 'సందేహ ప్రయోజనం' లభించదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. అత్యాచారం అనేది ఒక చట్టపరమైన పదం తప్ప వైద్యపరమైన పదం కాదని కూడా కోర్టు పేర్కొంది. 1982లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి, అత్యాచార నేరస్తుడికి 1983లో విధించిన శిక్షను (నేర నిర్ధారణ, మూడేళ్ల జైలు శిక్ష) కోర్టు సమర్థించింది. క్రీడలు, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, గుర్రపు స్వారీ, కఠినమైన శారీరక శ్రమ లేదా ప్రమాదవశాత్తు జరిగే గాయాల వంటి వివిధ కారణాల వల్ల హైమెన్ చిరిగిపోయే అవకాశం ఉందని జస్టిస్ సంతోష్ రాయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. కొంతమందికి పుట్టుకతోనే హైమెన్ రంధ్రం కలిగి ఉండటం లేదా అసలు లేకపోవడం వంటివి జరుగుతాయని, మరికొందరిలో అది చాలా సాగే గుణం కలిగిఉంటుందని కోర్టు పేర్కొంది. కాబట్టి, ఇటువంటి వైద్యపరమైన అంశాలు బాధితురాలి విశ్వసనీయమైన వాంగ్మూలాన్ని అధిగమించలేవని కోర్టు అభిప్రాయపడింది. అత్యాచారం సాధారణంగా రహస్య వాతావరణంలో జరుగుతుందని, అంటే స్వతంత్ర ప్రత్యక్ష సాక్షులు దొరికే అవకాశం ఆచరణలో దాదాపు ఉండదని కూడా కోర్టు నొక్కి చెప్పింది. రాకేష్ అప్పటికే బెయిల్‌పై ఉన్నాడు. జూన్ 23నాటి తన తీర్పులో, హైకోర్టు ఆ దోషిబెయిల్ బాండ్లను తక్షణమే రద్దు చేసింది. తన శిక్షలో మిగిలిన భాగాన్ని అనుభవించడానికి 10 రోజుల్లోగా విచారణ కోర్టు (ట్రయల్ కోర్టు) ముందు లొంగిపోవాలని అతన్ని ఆదేశించింది.

## పెళ్లికి తిరస్కరించిందని మహిళపై దాడి, ఇంటికి నిప్పు

### నిందితుడు అరెస్టు

**భువనేశ్వర్, జూన్ 28:** ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో ప్రేమ ప్రతిపాదనను తిరస్కరించినందుకు ఒక వ్యక్తి మహిళ ఇంటికి నిప్పు పెట్టడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. నిందితుడిని అరెస్టు చేశామని, తదుపరి విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన సుందర్‌గఢ్ జిల్లాలోని బిస్రా బ్లాక్ పరిధిలోని ఒక గ్రామంలో జరిగింది. ప్రాథమిక విచారణ ప్రకారం, నిందితుడు ఆ మహిళ పట్ల తీవ్ర వ్యామోహం పెంచుకున్నాడు. ఆమె తన వివాహ ప్రతిపాదనను తిరస్కరించడంతో దాడికి పాల్పడ్డాడు. ఆమె గదిలో నిద్రిస్తుండగా, నిందితుడు కిటికీ గుండా పెట్రోల్ పోసి, ఆమెను చంపాలనే ఉద్దేశంతో నిప్పు పెట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. మంటలు చెలరేగడానికి కొద్ది క్షణాల ముందు నిందితుడు రజత్ కిరోను కిటికీ దగ్గరచూసినట్లు బాధితురాలి తండ్రి జెనా టోప్పో ఆరోపించారు. వివాహ ప్రతిపాదనను తిరస్కరించినప్పటి నుండి కిరో తన కుమార్తెను పలుమార్లు వేధించాడని కూడా ఆయన



తెలిపారు. మహిళ ఆర్త నాదాలు విని, మంటలను గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని, కాలిపోతున్న ఇంటి నుండి ఆమెను రక్షించి రూర్కెలాలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు తీవ్రమైన కాలిన గాయాలయ్యాయని (సుమారు 40 శాతం వరకు అని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి), ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. పోలీసులు శాస్త్రీయ పరిశోధన బృందంతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించారు. నిందితుడికి ఆ మహిళ పట్ల ఉన్న వ్యామోహమే ఈ దాడికి కారణమని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. "నిందితుడిని అరెస్టు చేశాము. అతన్ని కోర్టులో హాజరు పరుస్తాము. తదుపరి విచారణ కొనసాగుతోంది" అని పోలీసులు తెలిపారు.

## కరాచీలో భీకర ఉగ్రదాడి

### నలుగురు సైనికులు మృతి

### ఆరుగురు ఉగ్రవాదులు కూడా ఖతం

**కరాచి,జూన్ 28:** పాకిస్థాన్‌లోని అతిపెద్ద నగరమైన కరాచీలో శనివారం భీకర ఉగ్రదాడి జరిగింది. నగరంలోని సింధ్ రేంజర్ల స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడి, కాల్పుల ఘటనలో నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమవగా, మరొకరిని సజీవంగా పట్టుకున్నారు. కరాచీలోని గులిస్తాన్‌ఎజౌహార్ ప్రాంతంలో ఉన్న సింధ్ రేంజర్ల ప్రధాన కార్యాలయంపైకి ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో దూసుకొచ్చారు. స్థావరాన్ని ఢీకొట్టి వాహనాన్ని పేల్చివేసిన వెంటనే, మిగిలిన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. అప్రమత్తమైన భద్రతా బలగాలు వెంటనే ఎదురుదాడికి దిగడంతో ఆ ప్రాంతం మొత్తం కాల్పుల మోతతో దద్దరిల్లింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక పోలీసు బలగాలు, కమాండోలను రంగంలోకి దించారు. ఈ దాడికి తామే బాధ్యులమని తెహ్రీక్‌ఎతాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) నుంచి విడిపోయిన జమాత్‌ఉల్‌అహ్రార్ అనే ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది. పాకిస్థాన్‌లో భద్రతా బలగాలపై ఇటీవలి కాలంలో దాడులు పెరిగిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈదాడిపై సింధ్ ముఖ్యమంత్రి సయ్యద్ మురాద్ అలీషా తీవ్రంగా స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, కూంబింగ్ నిర్వహిస్తు న్నాయి. ఈ ఘటనలో సామాన్య పౌరులెవరూ గాయపడలేదని అధికారులు ప్రాథమికంగా తెలిపారు.

## 15వేల మందిని చంపే టార్గెట్‌తోనే క్యాప్సూల్స్ తెచ్చా..

### మొహర్రం వేడుకల్లో పట్టుబడిన నిందితుడు వెల్లడి

**ముంబయి,జూన్ 28:** మహారాష్ట్ర రాజధాని ముంబైలో మొహర్రం ఊరేగింపు సందర్భంగా భారీ విషాదం త్రుటిలో తప్పింది. ఊరేగింపులో పాల్గొన్న వారికి విషపూరిత క్యాప్సూల్స్ పంపిణీ చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి సుమారు 14,900 క్యాప్సూల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు క్యాప్సూల్స్‌ను నొప్పి నివారణ మాత్రలు, రోగనిరోధక శక్తిని పెంచే మందులని చెప్పి ప్రజలకు అందజేశాడు. ఆ క్యాప్సూల్స్‌లో జింక్ ఫాస్ఫైడ్ అనే అత్యంత విషపూరిత రసాయనం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ రసాయనం సాధారణంగా ఎలుకల మందులో ఉపయోగిస్తారు. ఈ క్యాప్సూల్స్ తీసుకున్న 11 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే సకాలంలో హాస్పిటల్‌లో చేర్చడంతో ప్రాణాలతో బయటపడ్డారు. తాను సుమారు 15 వేల మందిని చంపాలనుకున్నట్టు నిందితుడు ఫయాజ్ ప్రేమ్‌జీ చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. అతడు ముందుగానే 30 వేల ఖాళీ క్యాప్సూల్స్, 50 కిలోల జింక్ ఫాస్ఫైడ్ ఆర్డర్ చేసినట్టు



దర్యాప్తులో బయటపడింది. అతడి ఉద్దేశం, ఈ ఘటన వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ భారీ ప్రమాదాన్ని ముగ్గురు మహిళా వాలంటీర్లు పసిగట్టి అడ్డుకోగలిగారు. నిందితుడు అనుమానాస్పదంగా క్యాప్సూల్స్ పంచుతుండటాన్ని గమనించిన వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం లౌడ్‌స్పీకర్ ద్వారా ప్రజలకు ఆ క్యాప్సూల్స్ తీసుకోవద్దని హెచ్చరికలు జారీ చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నిందితుడు ముందుగా ఒకరోజు హోటల్‌లోనే ఉండి ఈ క్యాప్సూల్స్ తయారు చేసాడని దర్యాప్తులో అంగీకరించాడు.

## త్రిశూర్‌లో సింథటిక్‌డ్రగ్స్ ముఠా అరెస్టు..


### 308 గ్రాముల ఎంఎండిఎ స్వాధీనం

**త్రిశూర్,జూన్ 28:** కేరళలోని త్రిస్సూర్ జిల్లాలో భారీ ఎత్తున సింథటిక్ డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఇద్దరు మహిళలు సహా మొత్తం ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 308 గ్రాముల నిషేధిత ఎండిఎంఎ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో పట్టుబడిన అతిపెద్ద డ్రగ్స్ కేసుల్లో ఇది ఒకటని అధికారులు తెలిపారు. వాణియంపార ప్రాంతంలో యాంటీ నార్కోటిక్ స్పెషల్ యాక్షన్ ఫోర్స్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఈముఠా వ్యవహారం బయటపడింది. పాలక్కాడ్ నుంచి వస్తున్న స్విఫ్ట్ కారును ఆపి సోదా చేయగా, అందులో ఉన్న ఒక మహిళ తన రహస్య భాగాల్లో రెండు గ్రాముల ఎండీఎంఏను దాచి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో కారులోని షిఫాస్, విద్య, జిష్ణు, శ్రీలక్ష్మిలను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిని విచారించగా, ఈ నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు షిఫాస్ ఇంట్లో సోదాలు చేయగా మరో 18 గ్రాముల డ్రగ్స్ లభించాయి.

## సంక్షిప్త వార్తలు

### జపాన్‌లో మళ్లీ భూకంపం: రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రత

**టోక్యో, జూన్ 28:** జపాన్‌లో మరోసారి భూకంపం సంభవించింది. ఆదివారం ఉదయం మళ్లీ భూమి కంపించింది. ఆ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.1గా నమోదైంది. అమోరి ప్రిఫెక్చర్ సమీపంలో 40 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు జపాన్ వాతావరణ విభాగం (జెఎంఎ) వెల్లడించింది. కాగా గత కొన్ని రోజులుగా పలు దేశాలను భూకంపాలు వణికిస్తున్నాయి. ఈ ప్రకృతి విపత్తు ఇటీవల వెనుజులాలో భారీ విధ్వంసాన్ని సృష్టించి విషాదాన్ని మిగిల్చింది. వెనుజులాలో భూకంపం సంభవించిన సమయంలోనే జపాన్‌లో 7.2 తీవ్రతతో భూకంపం వచ్చింది. మళ్లీ కొద్ది రోజుల వ్యవధిలో ఇలా రెండోసారి ప్రకంపనలు రావడంపై జపాన్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది.



### 13యేళ్ల బాలికపై 5 రోజుల్లో 30మంది అత్యాచారం

**న్యూఢిల్లీ, జూన్ 28:** రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో 13యేళ్ల బాలికపై 30 మందికి పైగా వ్యక్తులు ఐదు రోజుల పాటు అత్యాచారం చేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ లైంగిక దాడి ఘటనలు పలు హోటళ్లలో జరిగినట్లు చెబుతున్నారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం, ఇంటి నుండి అదృశ్యమైన బాలికను ఒక రిక్షా డ్రైవర్ హోటల్ యజమానికి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మైనర్ బాలిక లైంగిక దోపిడీలో మరికొందరు హోటల్ నిర్వాహకులు కూడా ప్రమేయం కలిగి ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. బాధిత బాలిక ఫిర్యాదుతో పలువురు హోటల్ యజమానులు, నిర్వాహకులను అరెస్టు చేశారు.

### రాజధానిలో రాహుల్ కనిపించడంలేదంటూ పోస్టర్లు..




**న్యూఢిల్లీ,జూన్ 28:** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ కలకలం రేగింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కనిపించడం లేదు అంటూ ఆదివారం ఢిల్లీలోని పలు కీలక ప్రాంతాల్లో వెలిసిన పోస్టర్లు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. రాహుల్‌గాంధీ తాజా విదేశీ పర్యటనను లక్ష్యంగా చేసుకుని అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య సాగుతున్న పొలిటికల్ వార్‌లో ఈ పరిణామం సరికొత్త మలుపు తిప్పింది. ఢిల్లీలోని ఫిరోజ్‌షా రోడ్డుతో పాటు పలు ప్రధాన కూడళ్లలో రాహుల్ గాంధీ ఫొటోతో కూడిన మిస్సింగ్ పోస్టర్లు ప్రత్యక్షమయ్యాయి. అయితే ఈ పోస్టర్లను ఎవరు అంటించారనేది ప్రస్తుతానికి స్పష్టంగా తెలియరాలేదు.

### ప్రొఫెల్లర్ తగిలి ట్రైనీ పైలట్‌కు గాయాలు..

**లక్నో, జూన్ 28:** శిక్షణలో భాగంగా విమానం నడిపిన మహిళా ట్రైనీ పైలట్ ల్యాండింగ్ తర్వాత ఇంజిన్ ఆన్‌లో ఉండగానే కిందకు దిగింది. దీంతో తిరుగుతున్న ప్రొపెల్లర్ ఆమె వెనుక భాగానికి తగలడంతో గాయపడింది. ఆ మహిళను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూంలో ఈ సంఘటన జరిగింది. ఈనెల 26న కాన్పూర్‌లోని చకేరి విమానాశ్రయంలో గార్గ్ ఏవియేషన్‌కు చెందిన ట్విన్ ఇంజిన్ విమానంలో మహిళా ట్రైనీ పైలట్ రాత్రిపూట శిక్షణ పొందింది. ఆమెతో పాటు ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్ కూడా అందులో ఉన్నారు.



### పార్టీగుర్తు ఫోర్జరీ చేశారంటూ టిఎంసి లీగల్‌సెల్ ఫిర్యాదు



**కోల్‌కత్తా,జూన్ 28:** పశ్చిమ బెంగాల్‌లో అధికారాన్ని కోల్పోయిన అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు తీవ్రమయ్యాయి. ఇప్పటికే పార్టీ రెండుగా చీలింది. మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బయటికి వెళ్లి పోయారు. అసలు టీఎంసీ ప్రతిపక్ష హోదా సైతం కోల్పోయింది. ఎన్నికలు ముగిసిన నెల రోజుల్లోపే తృణమూల్ మొత్తం కూడా చెల్లాచెదురైంది. పార్టీ అధినేత్రి మమత బెనర్జీ, ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ సహా పార్టీ సీనియర్లు కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిణామాల మధ్య మమత బెనర్జీ తాజా ఎత్తుగడవేశారు. పార్టీ అధికారిక గుర్తును ఫోర్జరీ చేయడంతో పాటు, పేరును దుర్వినియోగం చేస్తూ కొందరు నేతలు ప్రైవేట్‌గా సమావేశాలు నిర్వహించారనే అంశాన్ని తెర మీదికి తెచ్చారు. ఈ క్రమంలో పార్టీ లీగల్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

29-6Pg6exHMNWJQE_29-6Pg6exHMNWJQE.qxd 28/Jun/26 10:51 PM Page 1



# రిజిస్ట్రేషన్లలో ప్రైవేటు భాగస్వామ్యం

- పిపిపి పద్ధతిలో సేవా కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనపై అభ్యంతరాలు
- ప్రజల వివరాల గోప్యతపై అనుమానాలు
- పూర్తిగా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్




**నూజివీడు, జూన్ 28 ప్రభాతవార్త:** రిజిస్ట్రేషన్ల శాఖ ప్రతిపాదించిన 'సేవా కేంద్రాల'పై విముఖత వ్యక్తమవుతోంది. వీటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో నిర్వహిస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించడాన్ని చాలామంది వ్యతిరేకిస్తున్నారు. దళారుల బెడద లేకుండా, పారదర్శకంగా సేవలు అందించడానికి వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు చెబుతున్నారు. అయితే స్థిరాస్తుల కొనుగోళ్లు, వీలునామాలు, వారసత్వ ఆస్తుల పంపిణీ వివరాలు వంటివి ఆయా వ్యక్తులు గోప్యంగా ఉండాలని భావిస్తారు. ఇలాంటి వ్యవహారాలను నమోదుచేసే బాధ్యతను పిపిపిలో ఏదో ఒక సంస్థకు అప్పగించడమేమిటనే ప్రశ్న వినిపిస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దళారుల ప్రమేయం లేకుండా ఎవరి డాక్యుమెంట్ వారు రాసుకోవడానికి 'పబ్లిక్ డేటా ఎంట్రీ (పిడిఇ)' విధానం అమలు చేస్తోంది. అక్కడ దరఖాస్తు తీసుకొని ఆస్తి వివరాలు, సరిహద్దులు, కొనుగోలుదారు, అమ్మకందారు పేర్లు రాస్తే సరిపోతుంది. రెడీమేడ్ డాక్యుమెంట్ సిద్ధం అయిపోతుంది. తగిన ఫీజు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది. ఇప్పుడు కొత్తగా సేవా కేంద్రాలు ఏర్పాటుచేస్తే, అక్కడ దళారులు ప్రత్యక్షం కారని గ్యారంటీ ఏమీ లేదు. దీనికి ఫీజులు కాకుండా అదనపు రుసుము రూ.2 వేలు చెల్లించాలని అంటున్నారు. డాక్యుమెంట్ రైటర్‌ను కక్షిదారులు వ్యక్తిగత సహాయకుడిగా నమ్మి అతడికి వివరాలన్నీ చెప్పి రాయించుకుంటారు. అదే ప్రభుత్వం ఏర్పాటుచేసిన మనిషి (సంస్థ) అనగానే అన్ని విషయాలు చెప్పలేని పరిస్థితి ఉంటుంది. పైగా ఇప్పుడు ఆస్తి కొనుగోలు చేసినా, అమ్మినా డాక్యుమెంట్లో రాసే ధర వేరు. బయట వారికి ఇచ్చే ధనం వేరు. ఇది బ్లాక్ అండ్ వైట్‌లో ఉంటుంది. ఇది జగమెరిగిన సత్యం. ఇలాంటి వన్నీ సేవా కేంద్రాల్లో చర్చించలేని, ప్రశ్నించలేని అంశాలు. పారదర్శకత అని చెప్పినా అక్కడ పాటించ లేని అంశాలన్నీ ఉంటాయి. పిపిపి అనగానే ఏదో ఒక సంస్థ కాంట్రాక్టు తీసుకుంటుంది. వారికి సంబంధించిన వ్యక్తులను సేవా కేంద్రాల్లో పెడతారు. వారు సక్రమం గా విధులు రిజిస్ట్రేషన్లలో ప్రైవేటు భాగస్వామ్యం నిర్వహిస్తారని చెప్పలేం. సమర్పించిన ఆస్తుల వివరాలు వేరే వ్యక్తులకు చేరవేయకుండా ఉంటారని విశ్వసించలేము. పాస్‌పోర్టు సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ వ్యవహారాలు నడపాలని ప్రభుత్వం ముందు నుంచి భావిస్తోంది. పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో వ్యక్తిగత సమాచారం మాత్రమే ఉంటుంది. ఆధార్, వేలిముద్రలు, ఐరిస్, సర్టిఫికెట్ల పరిశీలన వరకు మాత్రమే అక్కడి సిబ్బంది పరిమితమవుతారు. మిగిలినవన్నీ పాస్‌పోర్టు కార్యాలయం చూసుకుంటుంది. రిజిస్ట్రేషన్ల విషయానికి వస్తే కోట్ల రూపాయల వ్యవహారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు థర్డ్ పార్టీకి సమర్పించాలి. వారి ద్వారా అవి సబ్ రిజిస్ట్రార్లకు వెళతాయి. అక్కడి నుంచి క్లియరెన్స్ వస్తేనే రిజిస్టర్ చేస్తారు. డాక్యుమెంట్ రాయడానికి, ఆయా పత్రాలు తీసుకోవడానికి రూ.2 వేలు ఫీజు కట్టాలని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో విశ్వసనీయత ఉండదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. సేవా కేంద్రం ఏర్పాటుచేస్తే అక్కడ రోజుకు కనీసం 50 డాక్యుమెంట్లు తీసుకున్నా ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.2 వేలు చొప్పున రోజుకు లక్ష రూపాయల ఆదాయం అధికారికంగా వారికి వస్తుంది.

పిపిపిలో కాకుండా ప్రభుత్వమే వీటిని నిర్వహిస్తూ, అక్కడ న్యాయశాస్త్రం చదివిన వారిని కనీసం కాంట్రాక్టు విధానంలో తీసుకున్నా బాధ్యతగా పనిచేస్తారు. అందరికీ నమ్మకం ఏర్పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 298 సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా సొంత భవనాలు లేవు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అద్దె కూడా సక్రమంగా చెల్లించలేకపోతున్నారు. కార్యాలయాలకు అవసరమైన ప్రింటర్లు, ఇతర సామగ్రి కూడా సరిగ్గా ఇవ్వడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో మరో భవనం తీసుకొని సేవా కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం

## పివి నరసింహారావు దార్శనికుడు: సిఎం



**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత మాజీ ప్రధాని, దివంగత పివి నరసింహారావు 105వ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. పివి నరసింహారావు దేశానికి చేసిన సేవలను ప్రశంసించారు. క్లిష్ట సమయంలో దూరదృష్టితో ఆలోచించి దేశాభివృద్ధికి తోడ్పడ్డారని, భావి తరాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

### పివి నరసింహారావు మహానేత: సిఎం చంద్రబాబు

"భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు 105వ జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నా. దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి, దూరదృష్టితో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. భారత అభివృద్ధి దిశను మార్చిన మహానేతగా ఆయన చిరస్మరణీయులు. పివి దార్శనిక నాయకత్వం, దేశాభివృద్ధికి చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆ మహనీయుడి పుణ్యస్మృతికి మరొకసారి వినమ్ర నివాళి" అంటూ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

### ఆర్థికవేత్తగా ఎన్నో సంస్కరణలు: మంత్రి లోకేశ్

"ప్రధానమంత్రిగా, ఆర్థికవేత్తగా ఎన్నో సంస్కరణలను అమలులోకి తీసుకువచ్చి దేశాభివృద్ధికి విశేషకృషిచేసిన భారతరత్న పివి నరసింహారావు జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నా. రాజనీతిజ్ఞుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచిన పివి నరసింహారావు తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణం. పివి జయంతి సందర్భంగా రాష్ట్రానికి, దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకుందాం" అంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

### పివి గొప్ప రాజనీతిజ్ఞుడు: డి.సిఎం పవన్ కల్యాణ్

"భారతరత్న పివి నరసింహారావు జయంతి సందర్భంగా నా హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నా. భారతదేశపు అత్యంత దార్శనిక రాజనీతిజ్ఞులలో ఒకరు, అసాధారణ పండితుడు పివి నరసింహారావు. ఆయన నాయకత్వం మన దేశ చరిత్ర గమనాన్ని మార్చేసింది. కీలక సమయంలో ఆయన ధైర్యం, దూరదృష్టి, చారిత్రాత్మక ఆర్థిక సంస్కరణలు భారతదేశ వృద్ధికి, ప్రపంచ స్థాయిలో దాని స్థానానికి కొత్త మార్గాలను తెరిచాయి. పివి అద్భుతమైన మేధస్సు, పరిపాలనా నైపుణ్యం, జాతీయ ప్రగతి పట్ల అచంచలమైన నిబద్ధత శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ఆయన స్ఫూర్తి ప్రతి భారతీయుడిని నిబద్ధతతో దేశానికి సేవ చేయడానికి ప్రేరేపిస్తూనే ఉండాలని ఆశిస్తున్నా" అని డి.సిఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ప్రాచీన కళలను పరిరక్షించాలి

- ముగిసిన జాతీయ సంగీత నృత్యోత్సవాలు




**తిరుపతి, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి మహతి కళాక్షేత్రం వేదికగా జరుగుతున్న శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ – రాయలసీమ రంగస్థలం జాతీయస్థాయి జానపద సంగీత, నృత్య పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఆదివారం నిర్వహించిన పోటీల్లో వివిధ కళా బృందాలు ప్రదర్శించిన సంప్రదాయ కళారూపాలు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన చప్పట్లతో ప్రశంసలు అందుకున్నాయి. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ డాక్టర్ జి ఎస్ ప్రసాద్, రామలింగేశ్వర స్వామి గుడి చైర్మన్ దొడ్డ రెడ్డి మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొని విజేతలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆధునిక వినోద మాధ్యమాల ప్రభావంతో కనుమరుగవుతున్న కళలను పరిరక్షించడం, ప్రోత్సహించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కళలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని, వాటిని భావితరాలకు అందించేందుకు ఇలాంటి జాతీయస్థాయి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. గత 35 సంవత్సరాలుగా తిరుపతిని వేదికగా చేసుకుని నిరంతరాయంగా జాతీయస్థాయి సంగీత, నృత్య, జానపద పోటీలను నిర్వహిస్తూ కళాకారులకు ప్రోత్సాహం అందిస్తున్న రాయలసీమ రంగస్థలం సేవలను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న సంస్థ చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి రాజాతో పాటు నిర్వాహక బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాబృందాలు తమ అద్భుతమైన జానపద సంగీత, నృత్య

## కేశినేని సోదరుల ప్రచ్ఛన్న యుద్ధం

- చిన్నిపై నాని భూకబ్జా ఆరోపణలు
- తెలంగాణ సిఎంకు బహిరంగ లేఖ
- నాని లేఖపై చిన్ని వ్యంగ్యాస్త్రాలు



**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ రాజకీయాల్లో అన్నదమ్ముల సవాళ్లు, ప్రతి సవాళ్లు కొనసాగుతున్నాయి. తాజాగా మాజీ ఎంపి, వైసిపి నేత కేశినేని శ్రీనివాస్(నాని) తన సోదరుడు, ప్రస్తుత విజయవాడ టిడిపి ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) లక్ష్యంగా సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ శివార్లలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు చిన్ని ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోషల్ మీడియా వేదికగా ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ భూకబ్జా యత్నాన్ని తక్షణమే అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు హైదరాబాద్ నగర శివారులోని ప్రగతినగర్, షంషిగూడ ప్రాంతంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు (టిజిఐఐసి) చెందిన 112.72 ఎకరాల భూమి ఉంది. దీనిని ఐటీ పార్క్ కోసం కేటాయించారు. అయితే, ఈ అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎంపి కేశినేని చిన్ని, ఆయన బినామీగా వ్యవహరిస్తున్న మెసర్స్ ఎక్సెల్లా ప్రాపర్టీస్ అనే సంస్థ అక్రమంగా చేజిక్కించుకోవాలని చూస్తున్నాయని కేశినేని నాని తన లేఖలో ఆరోపించారు. ఈ భూమిపై ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు ఆదేశాలు, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) ఆంక్షలు అమల్లో ఉన్నాయని, ఈ కీలక విషయాలను దాచిపెట్టి మోసానికి పాల్పడుతున్నారని నాని పేర్కొన్నారు. ఈ వాస్తవాలను మరుగునపరిచి, సుప్రీంకోర్టులో ఒక మోసపూరిత రాజీ ఒప్పందాన్ని చూపి ప్రభుత్వ భూమిని కొట్టేయాలని కుట్ర చేస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. గతంలో జిల్లా కలెక్టర్ సమర్పించిన అఫిడవిట్ ప్రకారం ఈ భూమిపై ప్రైవేటు వ్యక్తులకు ఎలాంటి హక్కులు లేవని (జీరో ప్రైవేట్ టైటిల్) స్పష్టంగా ఉన్నప్పటికీ, అక్రమార్కులు రాత్రికి రాత్రే ఆక్రమణలు మొదలు పెట్టారని నాని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కేశినేని నాని కోరారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు అడ్వకేట్ జనరల్ ద్వారా న్యాయస్థానాల్లో జోక్యం చేసుకుని, ఈ అక్రమ భూ బదలాయింపును నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' యంత్రాంగాన్ని వెంటనే రంగంలోకి దించి, ఇప్పటికే మొదలైన అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. నకిలీ పత్రాలు, మోసపూరిత ఒప్పందాలతో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న ఎంపి కేశినేని చిన్ని, ఆయన బినామీలు, సూత్రధారులపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

**చాల్లే.. ఇక పక్కకు వెళ్ళి ఆడుకో: ఎంపి కేశినేని శివనాథ్:** మాజీ ఎంపీ నానిపై తెలుగుదేశం ఎంపీ కేశినేని శివనాథ్ వ్యంగ్యాస్త్రాల సంధిం చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నాని రాసిన లేఖపై చిన్ని తీవ్రంగా స్పందిం చారు. ఈర్ష్య, ద్వేషం, కసి, పగతో నాని నిత్యం రగిలిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఆదివారం విజయవాడలో కేశినేని శివనాథ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్ని మీడియాతో మాట్లా డారు. ఇంతకుమించి దిగజారవు అనుకున్న ప్రతిసారి నాని ఇంకా ఇంకా దిగజారుతూనే ఉన్నారని శివనాథ్ సెటైర్లు గుప్పించారు. రేవులో తాడిచెట్టు మాదిరిగా పెరిగాడని, కానీ కొంచెమైనా ఇంగిత జ్ఞానం మాత్రం లేదని వ్యంగ్యంగా అన్నారు. ప్రధానికి, రాష్ట్రపతికి ఇరువురు ముఖ్యమంత్రులకు తనపై నాని ఫిర్యాదు చేశారని చెప్పుకొచ్చారు. ఇక మిగిలింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పుతిన్, కిమ్, కెఎ పాల్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. నాని వల్ల ఏం కాదని, పక్కకెళ్లి ఆడుకో అని కేశినేని శివనాథ్ విమర్శలు గుప్పించారు.

## ఉండవల్లి ఘటనలో వైసిపి నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపి నేతల నిన్నటి అమరావతి పర్యటనలో రౌడీషీటర్లు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో టిడిపి కార్యాలయంపై దాడి చేసిన వారే శనివారం రైతులపై దాడి, కవ్వింపు చర్యల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. పోలీసు కానిస్టేబుల్‌పై దాడి వెనకా ఆ రౌడీ బ్యాచే ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత రాళ్ల దాడికి పాల్పడి రైతుల్ని రెచ్చకొట్టింది వైఎస్సార్సీపి వెంట వచ్చిన రౌడీషీటర్లే అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో టిడిపి ఆఫీస్‌పై దాడికి పాల్పడిన చైతన్య శనివారం వైఎస్సార్సీపి నేతల వెంటా ఉన్నట్లు ఇప్పటికే పోలీసులు గుర్తించారు.

**3 కేసులు నమోదు:** గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని సహా పలువురు నేతలపై కేసులు నమోదు చేసారు.

పోలీసుల నివేదికల ప్రకారం, తాడేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి అంబటి రాంబాబుపై ఒక కేసు నమోదైంది. అలాగే, తాడేపల్లి తెలుగు విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాయపూడి కిరణ్ ఫిర్యాదుతో మరికొన్ని కేసులు నమోదు చేశారు. అంబటి రాంబాబు, పేర్ని నానితో పాటు లేళ్ల అప్పిరెడ్డి, పనుగంటి చైతన్య, వేమారెడ్డి తదితరులు నిందితుల జాబితాలో ఉన్నారు. వీరితో పాటు రైతులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా కూడా వైసిపి నేతలపై కేసులు నమోదు చేశారు.

మరోవైపు, వైసీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైతులపై పోలీసులు కౌంటర్ కేసు నమోదు చేశారు. ఈ పరిణామాలతో తాడేపల్లి ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరుపక్షాల నుంచి అందిన ఫిర్యాదులపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## తిరుపతి ఇఎస్ఐ ఆస్పత్రిని బలోపేతం చేయండి

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు



**తిరుపతి, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** పారిశ్రామికంగానూ, వివిధ రంగాల్లోనూ వేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతి జిల్లాలోని తిరుపతిలోని ఇఎస్ఐ ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి పరచాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నర్సింగరావు కోరారు. వేలాదిగా పెరుగుతున్న వలస కార్మికులు, రాయలసీమ జిల్లాల అవసరాలు దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలోని ఇఎస్ఐ ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న నర్సింగ్ సిబ్బంది సంఖ్యను, హౌస్ కీపింగ్ కార్మికుల సంఖ్యను గణనీయంగా పెంచాలని నర్సింగరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ నర్సింగ్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, తిరుపతి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షుడు జయచంద్ర, తిరుపతి నగర అధ్యక్షురాలు పి.బుజ్జి, కె.వేణుగోపాల్, ఎస్.శంకర్‌తో కూడిన సిఐటియు బృందం తిరుపతిలోని ఇఎస్ఐ ఆసుపత్రిని సందర్శించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, కార్మికులతో పలకరించి సమస్యలను తెలుసుకున్నారు. ఇఎస్ఐ ఆసుపత్రిలోని కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

- రచయితల పుస్తకాలు ఎక్కువ కొనుగోలు చేసేలా చర్యలు
- వచ్చే నెలలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శ్రీకారం
- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు
- సందర్శన యాత్రను జెండా ఊపి ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ




**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి అతిపెద్ద సెంట్రల్ లైబ్రరీ నిర్మాణ పనులకు జులైలో శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. కవులు, రచయితల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయాల సందర్శన యాత్ర జరిగింది. తొలుత ఈ బస్సు యాత్రను సివిల్ కోర్టుల వద్ద ఉన్న విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గ్రంథాలయం వద్ద ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాల ప్రాశస్త్యాన్ని నేటి తరం వారికి తెలియజేసే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఇటువంటి యాత్ర చేపట్టడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని సహాయ సహకారాలు రచయితలకు అందజేసేందుకు తానెప్పుడు సిద్ధంగా ఉంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విబిఎఫ్ఎస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అధ్యక్షతన ప్రారంభ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రచయితల పుస్తకాల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తానని హామీ ఇచ్చారు. అమరావతిలో సకల సౌకర్యాలతో విశాలమైన సెంట్రల్ లైబ్రరీ నిర్మాణ పనులకు జులైలో శంకుస్థాపన చేస్తామని రెండేళ్లల్లో పూర్తిచేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని వివరిం చారు. గ్రంథాలయాల ప్రస్తుత స్థితి మార్పు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచంద్, సాహితీవేత్తలు గుమ్మా సాంబశివరావు, వేముల హజరత్తయ్య గుప్తా, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మయ్య, తదితరులు పాల్గొని ప్రసంగించారు. యాత్ర ఉద్దేశాలను ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాశ్ సభకు వివరించారు. ఈ సందర్భంగా చెన్నాప్రగడ శర్మ రచించిన కవిత్వం కురిసింది కవితా సంకలనం, ఎం.ఎన్.వి. ప్రసాద్ రచించిన ఆవకాయ్ శతకం, ఎస్.ఆర్.పృధ్వి రచన ఆరుద్ర సప్తతి ఉత్సవం పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం బస్సుల్లో కవులు, రచయితలు బయలుదేరి నగరంలోని ఠాగూర్ గ్రంథాలయం, రామ్మోహన్ లైబ్రరీ, హనుమంతరాయ గ్రంథాలయం, సర్వోత్తమ గ్రంథాలయాలను సందర్శించి వాటి విశిష్టతలను అక్కడ పుస్తకాలను పరిశీలించారు. ముగింపు వేడుకల్లో పలువురు పాల్గొని వారి సందేశాలను ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం తరపున ప్రభుత్వ ఉగాది పురస్కార విజేత గబ్బిట దుర్గాప్రసాద్‌ను సత్కరించారు. అతిథులు, కవులు, రచయితలకు సంస్థ పక్షాన ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమాలను సంఘ ప్రతినిధులు నానా, సోమేపల్లి వశిష్ట, శర్మ సీహెచ్. రాజశేఖర్ పాణిగ్రాహి, కోపూరి పుష్పాదేవి, చింతా లక్ష్మీ, సుజాత, వేలూరి

## నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమం జరగనుంది. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు 89777 16661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.

సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఇ: డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు 'డయల్ యువర్ ఎస్ఇ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 94906 15721 నంబర్లకు ఫోన్‌చేయాల్సి ఉంటుంది.

## ఎపిఎస్‌పిడిసిఎల్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎపిఎస్‌పిడిసిఎల్) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత కలిగిన అభ్యర్థుల ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల ప్రక్రియ జూన్ 30 నుంచి ప్రారంభం కానుంది. ఈ నియామక ప్రక్రియలో మొత్తం 135 ఖాళీలను భర్తీ చేయనున్నారు. వీటిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) 125 పోస్టులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) 6 పోస్టులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెలికాం) 4 పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత విభాగాల్లో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బిఇ లేదా బిటెక్ (ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్, సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. వయస్సు 2026 జులై 1 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బిసి, ఇడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది. ఈ అర్హతలు కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో జులై 20 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు కింద అప్లికేషన్ ప్రాసెసింగ్, కామన్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ నిర్వహణ కోసం రూ.1,000 చెల్లించాలి. ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు రెండేళ్ల ప్రొబేషన్ కాలంలో నెలకు రూ.75,000 కన్సాలిడేటెడ్ వేతనం చెల్లిస్తారు. అనంతరం రెగ్యులర్ పే స్కేల్ రూ.86,245 నుంచి రూ.2,08,915 వరకు వర్తిస్తుంది.


## పోలియోపై విజయం శాశ్వతం కావాలి: కలెక్టర్ లక్ష్మీశా



**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త:** మన దేశం పోలియోపై సాధించిన విజయం శాశ్వతం కావాలంటే తల్లిదండ్రులు అందరూ తమ ఐదేళ్ళలోపు చిన్నారులకు పోలియో నివారణ చుక్కల మందులు వేయించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా కోరారు. విజయవాడలోని అయోధ్యనగర్ పిహెచ్‌సిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని చిన్నారులకు చుక్కల మందు వేసి కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా లక్ష్మీశా మాట్లాడుతూ పోలియోరహిత సమాజాన్ని శాశ్వతంగా కొనసాగించే కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిల పరిధిలో 966 పోలీయో కేంద్రాల్లో పల్స్‌పోలియో కార్యక్రమం జరుగుతుందన్నారు. 4,274 మంది వ్యాక్సినేటర్‌లు, 104మంది రూట్ సూపర్‌వైజర్లు పాల్గొంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లవద్ద 35 ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా పోలియో నివారణ చుక్కల మందు వేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం చుక్కలమందు వేయించకపోతే సోమ, మంగళవారాల్లో ఆరోగ్యసిబ్బంది ఇంటివద్దకే వచ్చి చిన్నారులకు పోలియో నివారణ చుక్కలమందు ఇస్తారని చిన్నారులందరికీ చుక్కలమందు వేయించాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో డియంహెచ్ఓ డాక్టర్ ఇందుమతిదేవి, డాక్టర్ చిలకపాటి రామ్‌చంద్, డాక్టర్ శ్వేత, తదితరులు, అరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల దోపిడికి అడ్డుకట్టేయండి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్



**చిత్తూరు(హెల్త్), జూన్ 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల దోపిడికి అడ్డుకట్ట వేయడానికి విద్యార్థులు పోరాటం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. చిత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ చిత్తూరు జిల్లా ప్లీనరీ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఏకైక సంస్థ ఎస్ఎఫ్ఐ ఒక్కటే అన్నారు. దేశంలో మతోన్మాత బిజెపి ప్రభుత్వం విద్యను కాషాయికరణ చేసి విద్యను భవిష్యత్ తరాలకు దూరం చేయడానికి ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ పనిచేస్తూ దేశ వ్యాప్తంగా బలోపేతం అవుతున్నదన్నారు. నీట్ పరీక్షా ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి సత్వరం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు భగత్‌రవి, ఎస్ఎఫ్ఐ నాయకులు బాలసుబ్రమణ్యం, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

MN 11 common_MN 11 common.qxd 29-06-2026 AM 01:04 Page 1



## తప్పు తెలుసుకొని అమరావతికి జై కొడితేనే.. జగన్‌కు ప్రజల మద్దతు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 28, ప్రభాతవార్త: అమరావతికి జై కొడితేనే... జగన్ కు ప్రజల మద్దతు లభిస్తుందని, అలా కాకుండా కుట్రలు, కుతంత్రాలతో, రౌడీమూకలతో అమరావతి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే, భవిష్యత్ లో వైసీపీ నామరూపాల్లేకుండా పోతుందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన నాదెండ్ల మండలం గణపవరం, చవిటిపాలెం గ్రామాల్లో పర్యటించారు. చవిటిపాలెం ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలియో శిబిరాన్ని ప్రారంభించి, చిన్నారులకు స్వయంగా చుక్కల మందు వేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అమరావతిని స్వాగతిస్తేనే.. జగన్ కు ప్రజల మద్దతు అధికారంలో ఉన్నప్పుడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన వైసీపీ గూండాలే, శనివారం అమరావతిలో రైతుల ముసుగులో విధ్వంసానికి ప్రయత్నించారని ప్రత్తిపాటి ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, క్లస్టర్ గంగా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు వలేటి హిమవంతరావు, పెంట్యాల శేషయ్య, జాను, హుస్సేన్ దాదా, సలీసం శ్రీను, గాలి బుచ్చయ్య, టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు తప్పనిసరి: మాజీ మున్సిపల్ చైర్మన్ రఫాని

చిలకలూరిపేట, జూన్ 28, ప్రభాతవార్త: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేట పట్టణంలోని కళామంది సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రఫాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిన్న పిల్లలకు పోలియో చుక్కలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని పోలియో రహితంగా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



## శ్రీనివాసరావు మృతికి మర్రి ఘననివాళి

చిలకలూరిపేట, జూన్ 28, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామ వాస్తవ్యులు గొట్టిపాటి సుబ్బారావు కుమారుడు శ్రీనివాసరావు స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకొని వారి స్వగృహం వద్ద ఉన్న వారి పార్థివ దేహానికి శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ నివాళులర్పించారు.. ఈ కార్యక్రమంలో వారి వెంట కంతేటి హనుమంతరావు, పావులూరి వెంకటేశ్వర్లు ,కట్టా నాగేశ్వరరావు ,దొప్పలపూడి రాజేష్ , దేవరకొండ గోపి , యడవల్లి రాజేష్ తదితరులున్నారు



## 167ఎ చిలకలూరిపేట - నకరికల్లు అడ్డరోడ్డు 4 వరసల రహదారి నిర్మాణానికి అడుగులు

చిలకలూరిపేట, జూన్ 28, ప్రభాతవార్త:. చీరాల ఓడరేవు నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు వద్దగల అద్దంకి నార్కెట్ పల్లి జాతీయ రహదారి కి కనెక్టివిటీగా ఉన్న పాత రోడ్డును నాలుగు వరుసల రహదారిగా రూపుదిద్దుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి అనుమతులు మంజూరు చేయడం జరిగింది. కోర్టు కేసులు, పొలాలు ఇచ్చిన రైతుల సమస్యలను అధిగమించి రోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఇటీవల పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల కాంట్రాక్టరు తోపాటు సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం సిబ్బంది ఫీల్డ్ కి వచ్చి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.

## విజయవాడ, గుంటూరు బస్సుల కోసం ప్రయాణికుల అవస్థలు

చిలకలూరిపేట, జూన్ 28, ప్రభాతవార్త:చిలకలూరిపేట ఆర్టీసీ డిపోలో గుంటూరు, విజయవాడ వెళ్లే బస్సులు సరిపడా లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇతర డిపోల నుంచి వచ్చే బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. తీరా బస్సు వచ్చినా అందులో కూర్చోవడానికి సీట్లు లేకపోగా, నిలబడేందుకు కూడా ఖాళీ ఉండటం లేదు. అయినా సరే తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అలాగే నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. రోజురోజుకూ పెరుగుతున్న ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి, విజయవాడ, గుంటూరులకు అదనపు బస్సు సర్వీసులను పెంచాలని చిలకలూరిపేట పట్టణ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



## సాంకేతిక పరిజ్ఞానం. ప్రజల అవగాహనతోనే వేగంగా సమస్యల పరిష్కారం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 28, ప్రభాతవార్త: ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంతో పాటు.. వారు పొందే ప్రభుత్వ సేవలు, ఇతర ప్రయోజనాల్లో వారికి ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారంపై యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మన మిత్ర యాప్ నిర్వహణలో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై వారికి అవగాహన కల్పిస్తే, అధికారులకు కొంత మేలు జరుగుతుందన్నారు. ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలు స్వీకరించిన ప్రత్తిపాటి, వాటి పరిష్కారంలో భాగంగా ప్రభుత్వ యంత్రాంగానికి, సిబ్బందికి కీలక సూచనలు చేశారు. ప్రజల సమస్యల్ని ప్రభుత్వ కార్యక్రమాలకు అనుసంధానించడంపై దృష్టి పెట్టండి సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై పౌరుల్లో ఆసక్తి పెరగాలని, అప్పుడే ప్రభుత్వ సేవలపై వారికి స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని, ఈ దిశగా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ప్రజలతో మమేకం కావాలని ప్రత్తిపాటి సూచించారు. ప్రజల నుంచి ఎక్కువగా రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సమస్య, వీధిలైట్లు, ఇళ్ల నిర్మాణం, ఇంటిస్థలాలు, ఉద్యోగాలకు సంబంధించిన అర్జీలే వస్తుంటాయని, వీటిని ప్రభుత్వం చేపట్టే ప్రజాహిత కార్యక్రమాలకు అనుసంధానిస్తే చాలా వరకు పరిష్కారమవుతాయన్నారు. ఆర్థిక సమస్యల వల్ల ప్రభుత్వం సకాలంలో చేపట్టలేని, ప్రజలకు అత్యవసరమైన అభివృద్ధి కార్యక్రమాల్ని పీ4కు అనుసంధానించడంపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ అబ్జర్వర్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు బత్తినేని శ్రీనివాసరావు , మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, గంగా శ్రీనివాసరావు, ఇనగంటి జగదీష్, కొత్త కోటేశ్వరరావు, షేక్ మస్తాన్ వలి, కుమీర్, మురకొండ మల్లిబాబు, పిల్లి కోటేశ్వరరావు, బేరింగ్ మోలాలి, సి.వి.ఏపీ యూనిట్ సయ్యద్ మహమ్మద్ అలీ, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాల్లో సిద్ధాంతాలు, జీవితంలో క్రమశిక్షణ చాలా ముఖ్యం

**• విజయవాడలో మాశర్మ రచించిన వెంకయ్య నాయకుడు పుస్తక పరిచయ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**విజయవాడ, జూన్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏ విషయాన్ని సూటిగా చెప్పడం రాజకీయ నేతలు నేర్చుకోవాలని వెంకయ్యనాయుడు అన్నారు. జై ఆంధ్ర ఉద్యమం నాడే రాష్ట్ర విభజన జరిగి ఉంటే ఇవాళ ఏపీ ఎక్కడో ఉండేదని, రెండు రాష్ట్రాలు బాగా అభివృద్ధి చెందేవన్నారు. విభజన అనివార్యం అని తెలిసిందని, నేను ఏదో రకంగా విభజన అడ్డుకుంటానని అందరూ అనుకున్నారన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు నా వద్దకు వచ్చి మాట్లాడారని, పార్టీ సిద్ధాంతానికి అనుగుణంగా వ్యవహరిస్తామని చెప్పానని స్పష్టంచేశారు. విజయవాడలో సీనియర్ పాత్రికేయులు మాశర్మ రచించిన వెంకయ్య నాయకుడు పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. వెంకయ్య నాయుడు జీవన ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. పుస్తక పరిచయ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు చిన్నతనంలోనే తల్లి చనిపోయింది ఆర్‌యస్‌యస్‌లో చేరడం ద్వారా ఎన్నో నేర్చుకున్నాను. ఇటీవల కొంతమంది ఆర్.యస్.యస్ ను నిషేధించాలని డిమాండ్ చేస్తున్నారు. అది నిషేధించాలి అనే వారినే ముందు నిషేధించాలి. తుపాకీ కన్నా బ్యాలెట్ చాలా శక్తివంతమైంది. ఇందిరాగాంధీ, వాజ్ పాయ్, యన్టీఆర్ వంటి వారే ఓడిపోయారు. నక్సలైట్లు తప్పుదారి పట్టి అనేక మంది ప్రాణాలు కోల్పోయారు, అభివృద్ధిని కూడా అడ్డుకోవడంతో ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టింది. ఆయుధంతో బెదిరించి ఎవరినీ లొంగదీసుకోలేరు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో కొంతమంది కి బూతు మాటలు మాత్రమే వస్తున్నాయి. నాయకులు ఇలా మాట్లాడుతున్నారని నన్ను అడిగితే.. బూతులు మాట్లాడేవారికి, బూత్‌లలోకి వెళ్లి బటన్ నొక్కు అని చెప్పా, మొన్న ఎన్నికలలో ఇలా బూతులు మాట్లాడే వారు ఒక్కరు కూడా గెలవలేదు, వారి పేర్లు నేను ప్రస్తావించను.. వారి గురించి అందరికీ తెలుసు. నేను వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకం. వారసత్వం కాదు... జవసత్వాలు కావాలి, వారసులుగా వచ్చేవారు కష్టపడి కింద నుంచి పైకి రావాలి. అంతే కానీ హెలికాప్టర్‌లో పై నుంచి కిందకు దింపకూడదు అని నా సిద్ధాంతం, అందుకే నా పిల్లలను నేను రాజకీయాల్లో ప్రోత్సహించలేదు. దక్షిణాది వారిని పైకి రానివ్వరనే పేరు ఉండేది. వాజ్‌పేయ్, అద్వానీ మధ్యలో కూర్చుని అధ్యక్షుడిగా పని చేశాను. ఆర్‌యస్‌యస్, బిజెపిలో పని చేయడం వల్లే ఈ స్థాయికి ఎదిగాను. ఇప్పుడు ఇక రాజకీయాలు నేను మాట్లాడను. రాజకీయాల్లో సిద్ధాంతాలు, జీవితంలో క్రమశిక్షణ చాలా ముఖ్యం. చట్టసభల్లో గౌరవప్రదమైన భాషను ఉపయోగించాలి, మనమే అసెంబ్లీలో గొడవులు పెట్టుకుని, కాగితాలు చించడం, మైకులు విరగకొట్టడం చూస్తున్నాం. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ సమీక్ష చేసుకోవాలి. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు ఆత్మ సమీక్ష చేసుకుని విలువలను పాటించాలి. వాళ్ల వాళ్ల పార్టీ సభ్యులకు మార్గనిర్దేశిక నియమావళిని అమలు చేయాలి. అప్పుడే సమాజంలో మన నాయకులకు గౌరవం ఉంటుంది. కుటుంబ వ్యవస్థలో పిల్లలతో ఉండేలా తల్లిదండ్రులు సమయం ఇవ్వాలి. నేడు టీవీలు, ఫోన్ లలో ఎవరికి వారే ఒంటరిగా ఉంటున్నారు. గుడ్ మార్నింగ్‌కు నేను వ్యతిరేకం.. పెద్దలకు నమస్కారం చెప్పే విధానం పిల్లలకు నేర్పాలి. మన బొట్టు, కట్టు, మాట, ఆట, పాట, బాట, యాస, గోస ఎప్పుడూ మరచిపోకూడదని చెబుతా, మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ వ్యవస్థ చూసే ఇతర దేశాలు మనల్ని గౌరవిస్తాయి, కార్యక్రమంలో మాశర్మ వెంకయ్య నాయుడు వ్యక్తిత్వాన్ని చక్కగా ఆవిష్కరించారని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి ఆయన ఉన్నత శిఖరాలు అధిరోహించారని చెప్పారు. రాజకీయాల్లో వెంకయ్య చూపించిన చొరవ అసామాన్యమని కొల్లు రవీంద్ర వివరించారు. వెంకయ్యనాయుడు నిబద్ధత కలిగిన నేత మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. దార్శనికత ఆయనలోని సుగుణమన్నారు. సుజనాచౌదరి, గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమా మహేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.




మాశర్మ రచించిన వెంకయ్య నాయకుడు పుస్తక పరిచయ కార్యక్రమ దృశ్యం

# రాష్ట్ర అభివృద్ధే మా ఆకాంక్ష

**• యేటా రొట్టెల పండగలో అదే కోరిక • ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్**

**నెల్లూరు(వైద్యం), జూన్ 28 ప్రభాతవార్త:** రాష్ట్ర అభివృద్ధే తమ ఆకాంక్ష అని, ఏటా రొట్టెల పండగలో అదే కోరిక కోరుటమని, రొట్టెల పండగకు భక్తుల సంఖ్య ఏటికేటికీ పెరిగిపోతొందని, దర్గా ప్రాంగణంలో భక్తుల కోసం చేసిన ఏర్పాట్లు అద్భుతమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లు అన్నారు. వారు ఆదివారం రొట్టెల పండగ సందర్భంగా నెల్లూరు బారాషహీద్ దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి బారాషహీదులను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే గొప్ప పుణ్యక్షేత్రం బారా హషీద్ దర్గా అని, నెల్లూరులో ఈ దర్గా ఉండటం జిల్లా ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ఏటా రొట్టెల పండగ సందర్భంగా ఇక్కడకు వచ్చి రాష్ట్ర అభివృద్ధిని కోరుకోవడం మాకు సంప్రదాయంగా వస్తోందన్నారు. గతంలో రొట్టెల పండగకు 4 లక్షల మంది హాజరైతే, ఇప్పుడు ఆ సంఖ్య 18 లక్షలకు చేరడం సంతోషంగా ఉందన్నారు. ఎన్ని లక్షల మంది వచ్చినా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తుండటం గొప్ప విషయమన్నారు. అందులో భాగంగా మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్. అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. అదేవిధంగా అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో కసుమూరు లో నిత్యాన్నదానం ప్రారంభించడంతో పాటు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. అనంతరం ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రొట్టెల పండగను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. దర్గా ప్రాంగణంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇటీవల జరిగిన ఘటనలను సమీక్షించుకుని, భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. దర్గా ప్రాంగణాన్ని మరింత విస్తరించే ఆలోచన ఉందన్నారు.
శనివారం రాత్రి నిర్వహించిన గంధోత్సవానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చినా పోలీసులు పకడ్బందీగా పనిచేయడంతో చిన్న అవాంఛనీయ ఘటన కూడా చోటుచేసుకోలేదని తెలిపారు. దర్గా ప్రాంగణంలో ఎవరైనా తప్పిపోతే అప్పటికప్పుడే సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా చైర్మన్ మునీర్ అహ్మద్, బొమ్మి సురేంద్ర, సాబీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**• పరిరక్షణ సమితి పేరిట పర్యటనలు బూటకం • అమరావతి పేరు ఎత్తే హక్కు కూడా వైకాపాకు లేదు • గజపతినగరంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**గజపతినగరం, జూన్ 28 ప్రభాతవార్త:** ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాజధాని అమరావతి అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అలుపెరగని పోరాటం చేస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం గజపతి నగరంలో మీడియా చిట్‌చాట్‌లో రాజధాని గురించి పలు విషయాలు వెల్లడి చేశారు. పరిరక్షణ సమితి పేరిట అల్లర్లు సృష్టిస్తూ వైకాపా నాయకులు బూటకపు పర్యటనలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో ఉండగా "అమరావతి వద్దు.. మూడు రాజధానులు ముద్దు" అని ప్రకటించి అధికారం వచ్చాక రంగులు మార్చటం బులుగు పార్టీకే సాధ్యమన్నారు. అమరావతి ప్రాంతం రైతులను, మహిళలు అని కూడా చూడకుండా హింసకాండ సృష్టించి, అరెస్టులు సైతం చేయించిన ఘనత గొడ్డలి పార్టీది అన్నారు. రాజధాని ప్రాంతంలో నీళ్లు నిలుస్తున్నాయని, రాజధానికి అమరావతి ప్రాంతం తగదని ప్రకటించిన కుతంత్రాల మహామేధావి జగన్ అని మంత్రి అన్నారు. రాజధాని ప్రాంత ప్రజలు పాదయాత్ర చేస్తుంటే అడ్డుకున్న ఘనత ఆనాటి వైకాపా ప్రభుత్వానిదన్నారు. ఆంధ్ర ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అమరావతిని అంతర్జాతీయ హంగులతో తీర్చిదిద్దడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2047 విజన్‌తో ముందుకు సాగుతున్నారన్నారు.
మెడికల్ జోన్, ఎడ్యుకేషనల్ జోన్ వంటి అత్యాధునిక సౌకర్యాలతో రాజధాని నిర్మాణం చంద్రబాబు సారధ్యంలో రూపుదిద్దుకుంటుందన్నారు. దాడులు చేశారని రాజధాని ప్రాంత రైతులపై అభియోగం మోపుతున్నారని, ఆ ప్రాంత రైతులంతా రాజధానికి మేము అనుకూలమని చెప్పి వైకాపా అధినేతలు పర్యటనలు చేయాలన్నారు. మూడు రాజధానులా, మావిగనా అన్నదానిపై వైకాపా అధినేతతో స్పష్టత ఇప్పించాలని ఆ పార్టీ నాయకులకు సూచించారు. జగన్ తండ్రి వైయస్సార్ అనుభవం కలిగిన నాయకుడిగా నాడు ఉమ్మడి రాజధాని హైదరాబాదులో చంద్రబాబు ప్రారంభించిన హైటెక్ సిటీ వంటి వాటిని ప్రోత్సహించారని, అనుభవలేమితో అధికారం వచ్చాక జగన్ ప్రవర్తించడంతోనే ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కుంటు పడిందన్నారు. జగన్ విధ్వంస పాలనతో గజిబిజి సృష్టించిన పాలనను కూటమి ప్రభుత్వం నేడు గాడిలో పెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణాలను చిత్తశుద్ధితో పారదర్శకంగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. భావితరాల అభివృద్ధి కోసం రాజకీయాలు చేయాలని, రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయకూడదని వైకాపా నాయకులకు హితవు పలికారు. అమరావతి పేరు ఎత్తే హక్కు కూడా వైకాపాకు లేదని కొండపల్లి శ్రీనివాస్ ధ్వజమెత్తారు.




# కేసులపై ప్రమాణానికి సిద్ధమా!

**• రాజకీయాలను రాజకీయంగానే చేద్దాం • మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి**

**అనంతపురం సిటీ, జూన్ 28 ప్రభాతవార్త:** వైసిపి పాలనలో తనపై 70 కేసులు నమోదు చేశారని పదేపదే చెప్పుకుంటున్న జెసి ప్రభాకర్‌రెడ్డి, ఆ కేసులు ఎందుకు నమోదు అయ్యాయో దేవుని సన్నిధిలో ప్రమాణానికి సిద్ధమా అని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సవాల్ విసిరారు. జిల్లా వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం తాడిపత్రిలో శాంతియుత దీక్షకు వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వైసిపి సమన్వయ కర్తలు మద్దతు ప్రకటించారన్నారు. అయితే దీనిపై మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి, వైసిపి సమన్వయ కర్తలు అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి తలారి రంగయ్యలపై చేసి అసభ్యకరంగా ధూషించడం సరికాదన్నారు. వారిపై చేసిన దూషణలు జెసి ప్రభాకర్‌రెడ్డి వ్యక్తిగతమా, చంద్రబాబునాయుడు, నారా లోకేష్ సూచనలతో చేసిన దూషణలా అని ఆయన ప్రశ్నించారు. జెసి ప్రభాకర్‌రెడ్డి టిడిపి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలు ఏవీ చేయరని, కేవలం వ్యక్తిగత ప్రోగ్రాంలు మాత్రమే చేస్తుంటారని ఆయన విమర్శించారు. రెండేళ్ల కూటమి పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగానే తాడిపత్రిలో కూడా నిరసన కార్యక్రమం చేపడితే పోలీసులు అనుమతించ లేదని, దీనిని నిరసిస్తూ ఎస్పీ కార్యాలయం ఎదుట తాను నిరసన వ్యక్తం చేశానన్నారు. అయితే జెసి ప్రభాకర్‌రెడ్డి పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేసి, అక్కడే స్నానం చేసి పోలీసులపై ఒత్తిడి తెచ్చి తనపై అక్రమ కేసులు నమోదు చేయించారని విమర్శించారు. కానీ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టిన జెసి ప్రభాకర్‌రెడ్డిపైన మాత్రం పోలీసులు కేసులు నమోదు చేయలేదని ఆయన విమర్శించారు. తాడిపత్రి నియోజకవర్గంలో వైసిపి శ్రేణులపై టిడిపి నేతలు దాడులు చేస్తారని, బాధితులు ఫిర్యాదులు చేసినా కేసులు నమోదు చేయకపోయినా, బాధితులపైనే కౌంటర్ కేసులు నమోదు చేస్తారని ఆయన విమర్శించారు. జెసి కుటుంబం కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు వారి కుటుంబం రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధిలో అనంత వెంకటరామిరెడ్డి తోడుగా నిలిచి రాజకీయ భవిష్యత్తు ఇచ్చారన్నది గుర్తించుకోవాలని పెద్దారెడ్డి సూచించారు. తాడిపత్రిలో ఐపిఎస్ అధికారి ఉన్నా లా అండ్ ఆర్డర్ కాపాడటం లేదన్నారు. గతంలో తాడిపత్రి పోలీస్‌స్టేషన్‌కు తాళం వేసిన చరిత్ర జెసి కుటుంబానికి ఉందన్నారు. వైసిపి హయాంలో తాను నష్టపోయానని జెసి ప్రభాకర్‌రెడ్డి యాక్టింగ్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వారసులు రాజకీయాల్లోకి రావాలని కోరుకోవడం సహజమని, అయితే జెసి ప్రభాకర్‌రెడ్డి కొడుకు ఎమ్మెల్యే అయినా ఆయనను బయటికి రాకుండా చూస్తున్నారన్నారు. ఈ వయస్సులో సలహాలు, సూచనలు ఇవ్వాలని, కొడుకును ప్రజలలో తిప్పితే రానున్న రోజుల్లో మరింత మంచి నేతగా ఎదిగే అవకాశం ఉందని గుర్తించాలన్నారు. కొడుకు భవిష్యత్తు, రాజకీయం గురించి ఆలోచన చేయాలని కక్షలు, కార్పణ్యాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. నీవు తప్పులు చేసి వాటిపై కేసులు నమోదైతే సానుభూతి కోసం మాపై నిందలు వేస్తావా అని ఆయన ప్రశ్నించారు. దీనిపై నీవు నమ్మే శ్రీకాళహస్తీశ్వరుడుపైన కాని, తాము నమ్మే వేంకటేశ్వర స్వామిపై కాని ప్రమాణానికి సిద్ధమా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాజకీయాలను రాజకీయంగానే చేద్దామని, మీరు విరమిస్తే తాను కూడా విరమిస్తానని పెద్దారెడ్డి స్పష్టంచేశారు.



## పల్స్ పోలియో 94.7శాతం చిన్నారులకు పంపిణీ

యడ్లపాడు, జూన్ 28, ప్రభాతవార్త : యడ్లపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న అన్ని ఆరోగ్య సచివాలయాలలో ఏర్పాటు చేసిన 29 సాధారణ పోలియో కేంద్రాలలో, 2 ట్రాన్సిట్ కేంద్రాలలో మరియు మొబైల్ టీమ్ ద్వారా హై రిస్క్ కేంద్రాలలో జరుపుట జరిగినది. ఈ కార్యక్రమంలో మండల పరిధిలో ఉన్న 4523 మంది 05 సంవత్సరాల చిన్నారులకు గాను మొదటిరోజున 4284 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసి 94.7 సాధించుట జరిగిందని ప్రాథమిక వైద్యులు భరద్వాజ్ తెలిపారు. ఈ కార్యక్రమమునకు జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ఎమ్ పద్మావతి, సందర్శించి కార్యక్రమం అమలును పర్యవేక్షి ంచారు. మొత్తం 122 మంది ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తల విశేష సహకారంతో నిర్వహించుట జరిగిందని తెలిపినారు. మిగిలిన చిన్నారులను 29 మరియు 30 తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని పి భరద్వాజ, మండల వైద్యాధికారి తెలిపినారు.



## యడ్లపాడులో మెడికల్ క్యాంపుకు విశేష స్పందన

యడ్లపాడు, జూన్ 28, ప్రభాతవార్త : యడ్లపాడు గ్రామంలో రెగ్యూలర్‌గా ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంపుకు విశేష స్పందన రావటం జరిగింది. ఇందులో 270 మంది రోగులకు సేవలు జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో బాసట సామాజిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కామ్రేడ్ పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రం, యడ్లపాడు లో రెగ్యులర్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇందులో షుగర్, బీపీ, ఫిట్స్, పక్షవాతం వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ప్రత్యేక దృష్టి సారించి డాక్టర్ల పర్యవేక్షణలో రెండు నెలలకు సరిపడా మందులు అందించారు. ఈ క్యాంపులో మొత్తం 270 మంది రోగులు సేవలు పొందారు. డాక్టర్లు శోంఠినేని నవ్య, గుంటుపల్లి భవ్యతేజ, ఎడ్ల రణ్వీత్ లు రోగులను పరీక్షి ంచి వారికి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. నిర్వాహకులు బాసట సామాజిక వేదిక కార్యదర్శి సామినేని శ్రీనివాసరావు, కోశాధికారి కేత రామబ్రహ్మం, సి.హెచ్. రంగారావు, కోయ రామోజీ, రావూరి సురేష్, పోపూరి శ్రీనివాసరావు, బచ్చు రాజేష్, ముత్తవరపు వేణు తదితరులు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. నారాయణ హై స్కూల్ విద్యార్థినులు వాలంటీర్లుగా పాల్గొని క్యాంపును విజయవంతం చేశారు. వాలంటీర్లకు భోజన సదుపాయాలను శారదా నికేతన్, గుంటూరు నుంచి ప్రొఫెసర్ రావూరి దేవయ్య అందించారు. క్యాంపు నిర్వాహకులు వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## కరుణాకర్‌కు ఘనంగా సత్కారం

సత్తెనపల్లి, జూన్ 28, ప్రభాతవార్త: కరుణాకర్‌కు డిఎస్పీ గా ప్రమోషన్ వచ్చిన సందర్భంగా సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. . బుడగాల సుబ్బారావు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా తెలుగుదేశం మాజీ ఉపాధ్యక్షులు, జనసేన, టిడిపి నాయకులు గండేపల్లి వేంకటరావు, మామిడి ఏడుకొండలు, ఆలపాటి వేంకటరావు, బోడపాటి తిరుపతిరావు, బొడ్డు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పీవీ నరసింహారావు జయంతి



సత్తెనపల్లి, జూన్ 28, ప్రభాతవార్త:సత్తెనపల్లి పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డ గల నేడు పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన అభిమానులు మరియు ఐక్యవేదిక సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో పీవీ నరసింహారావు అభిమానులు మరియు ఐక్యవేదిక సభ్యులు పెద్దింటి ఫణి కృష్ణ, వేదా ్నతం రమణ చార్యులు, కళ్యాణ్ చక్రవర్తి, అభిమానులు రాజవరపు నరసింహారావు , నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు

## ఎన్నికల విధులలో నిర్లక్ష్య ధోరణి (సర్) వార్డు రెవెన్యూ సెక్రటరీ సస్పెన్షన్: ఆర్డీఓ వెల్లడి

సత్తెనపల్లి, జూన్ 28, ప్రభాతవార్త: సత్తెనపల్లి మున్సిపాలిటి పరిధిలో గల 11వ సచివాలయం నందు వార్డు రెవెన్యూ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న దాసరి కోటి రాము సత్తెనపల్లి పట్టణం నందు పోలింగ్ బూత్ నంబర్ 60 కి బూత్ లెవెల్ అధికారిగా నియమించబడి ప్రస్తుతం జరుగుతున్న స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గత వారం రోజులుగా విధులకు గైర్హాజరు అయినందువలన 98 సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఆర్డీఓ .గోపాలకృష్ణ, బూత్ లెవెల్ అధికారిని సస్పెండ్ చేసియున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

## ఆలయం వద్ద విద్యుదాఘాతంతో చిన్నారి మృతి

సత్తెనపల్లి, జూన్ 28, ప్రభాతవార్త:రెడ్డిగూడెంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో కరెంట్ షాక్‌కు గురై షేక్ రేష్మా (9) అనే చిన్నారి మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు చిన్నారులు గాయపడగా, ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టగా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది



## 'పరివర్తన' చెవిటి, మూగ, మానసిక వికలాంగులకు స్పీచ్ థెరపీ

సత్తెనపల్లి, జూన్ 28, ప్రభాతవార్త: మొహరం పండుగ సందర్భంగా 'పరివర్తన' చెవిటి, మూగ, మానసిక వికలాంగులకు స్పీచ్ థెరపీ జరిపారు. కార్యక్రమంలో షేక్ రేష్మ భాను, మహ్మద్ తారిఖ్, ధరీష, బీబీజాన్, మీరాబి, షమీన్ తదితరులు పాల్గొన్నారు.




# అంజూ 22 యేళ్ల లాంగ్‌జంప్ రికార్డు బ్రేక్

**భువనేశ్వర్, జూన్ 28:** భువనేశ్వర్‌లో జరుగుతున్న జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో మరో రికార్డు బద్ద లైంది. అంజు బాబీ జార్జ్ పేరిట ఉన్న 22 ఏళ్ల నాటి లాంగ్ జంప్ జాతీయ రికార్డును కేరళకు చెందిన అన్సీ సోజన్ బ్రేక్ చేసింది. 25 ఏళ్ల అన్సీ తన ఐదవ ప్రయత్నంలో 6.88 మీటర్ల దూరం దూకి... 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో అంజూ నెలకొల్పిన 6.83 మీటర్ల జాతీయ రికార్డును అధిగమించింది. అలాగే భారత అథ్లెటిక్స్ సమాఖ్య నిర్దేశించిన 6.48 మీటర్ల ఆసియా క్రీడల అర్హత ప్రమాణాన్ని కూడా అన్సీ దాటింది. ఈ సీజన్‌లో ఆసియా అథ్లెట్లలో ఆమె అగ్రస్థానానికి చేరుకుంది. శైలి సింగ్ (ఉత్తరప్రదేశ్) 6.67 మీటర్లతో రెండో స్థానంలో, ముబస్సినా(లక్షద్వీప్) 6.53 మీటర్లతో మూడో స్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన ముగ్గురు అర్హత సాధించినా జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో అన్సీ, శైలిసింగ్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందారు.

### పురుషుల హైజంప్‌లో మరో రికార్డు

మహారాష్ట్రకు చెందిన సర్వేష్ కుషారే పురుషుల హై జంప్‌లో 2.31 మీటర్ల అద్భుత ప్రదర్శనతో జాతీయ రికార్డును నెలకొల్పాడు. గత ఏడాది టోక్యోలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ పురుషుల హై జంప్ ఫైనల్‌కు అర్హత సాధించిన తొలి భారతీయుడిగా నిలిచిన కుషారే... 2.31 మీటర్ల ఎత్తును అధిగమించి 2018 నుండి తేజస్విన్ శంకర్ పేరిట ఉన్న 2.29 మీటర్ల జాతీయ రికార్డును మెరుగు పరిచాడు. కుషారే 2.35మీటర్ల ఎత్తును అధిగమించడానికి ప్రయత్నించినప్పటికీ, రెండు ప్రయత్నాల లోనూ విఫలమయ్యాడు. ఈఛాంపియన్‌షిప్‌లలో ఇప్పటివరకు 5 జాతీయ రికార్డులు నమోదయ్యాయి.



# ప్రపంచ రోయింగ్‌లో భారత్‌కు తొలి స్వర్ణం

**లూసర్నే(స్విట్జర్లాండ్), జూన్ 28:** ప్రపంచ రోయింగ్ కప్‌లో భారత రోయర్లు చరిత్ర సృష్టించారు. ప్రపంచ రోయింగ్‌లో తొలిసారి భారత్‌కు స్వర్ణం అందించారు. స్విట్జర్లాండ్‌లోని లూసర్నే వేదికగా జరుగుతున్న ప్రపంచ రోయింగ్ కప్‌లో భాగంగా ఆదివారం జరిగిన పురుషుల లైట్ వెయిట్ డబుల్స్ స్కల్స్ ఫైనల్లో ఉజ్వల్ కుమార్, లక్షయ్ జోడీ పోటీపడ్డారు. రేసు ఆరంభం నుంచి వేగంగా దూసుకుపోయిన భారత జోడీకి హాంకాంగ్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. ఉజ్వల్, లక్షయ్ జోడీ 6 నిమిషాల 26.09 సెకన్లలో రేసు పూర్తి చేశారు. అగ్రస్థానంతో పసిడి పతకం అందుకున్నారు. తరువాతి రెండు స్థానాల్లో నిలిచిన హాంకాంగ్, నెదర్లాండ్స్ ఖాతాలో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ చేరాయి. భారత్‌కు ప్రపంచకప్ రోయింగ్‌లో ఇదే తొలి స్వర్ణం. గతంలో 3 కాంస్యాలు మాత్రమే అందుకుంది. 2009లో మహిళల క్వాడ్రపుల్‌లో.. 2019, 2022లో మహిళల పారా పెయిర్స్ విభాగాల్లో భారత్ కాంస్యాలు నెగ్గింది. భారత్‌కు స్వర్ణం అందించిన ఉజ్వల్ కుమార్, లక్షయ్ భారత ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్నారు.

## లక్ష్య ఛేదనలో మరోసారి విఫలమైన టీమిండియా

# టి20 సిరీస్ ఐర్లాండ్ కైవసం



**బెల్‌ఫాస్ట్, జూన్ 28:** ప్రపంచ టీ20 ఛాంపియన్ల టీమిండియా మరోసారి లక్ష్య ఛేధనలో బోల్తా కొట్టింది. 155 పరుగులను ఛేధించడంలో విఫలమైన శ్రేయాస్ సేన నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 153 పరుగులకే పరిమితమైంది. చివరి ఓవర్లో 20 పరుగులు చేయాల్సిన టీమిండియా 18 రన్స్ మాత్రమే చేసింది. దీంతో రెండో టీ20లోనూ క్రికెట్ కూన ఐర్లాండ్ ఒక పరుగు తేడాతో నెగ్గి సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఐర్లాండ్ పర్యటనను పరాజయంతో ముగించింది.

### ఓపెనర్లు డకౌట్

155 పరుగుల లక్ష్య ఛేధనలో మరోసారి భారత్ బ్యాటింగ్ తడబడింది. తొలి ఓవర్లోనే ఓపెనర్లిద్దరినీ కోల్పోయింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సంజూ శామ్సన్(0)ను ఎల్బీగా అవుట్ చేసిన మూంద్రా...నాలుగో బంతికి అభిషేక్(0)ను పెవిలియన్ చేర్చాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(10) కూడా నిరాశ పరిచాడు. ఇషాన్ కిషన్(12) రనౌట్ కావడంతో 35 పరుగులకే నాలుగు టాప్ ఆర్డర్ వికెట్లను కోల్పోయింది.

### తిలక్, హర్షిత్ ఒంటరిపోరాటం

అక్షర్ పటేల్(14)తో కలిసి కొద్దిసేపు వికెట్ల పతనానికి తిలక్ వర్మ(46 బంతుల్లో 55 రన్స్; 3 ఫోర్లు, ఒ సిక్స్) ఫుల్ స్టాప్ పెట్టాడు. అయిదో వికెట్‌కు 39 రన్స్ జోడించాడు. ఇక శివమ్ దూబే(20)తోకలిసి స్కోరును వంద దాటించాడు. ఈక్రమంలో తిలక్ వర్మ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఇద్దరూ ఆడుతున్నంత సేపు భారత్ గెలుస్తుందన్న ఆశలు కలిగాయి. అయితే 8 పరుగుల తేడాతో దూబే, తిలక్‌వర్మ అవుట్ కావడంతో భారత్ ఆశలు సన్నగిల్లాయి. తొలి వన్డే ఆడుతున్న సూర్యాంష్ షెడ్గే (1) కూడా తొందరగానే అవుటయ్యాడు. చివర్లో హర్షిత్ రాణా 10 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్స్‌తో 21 రన్స్‌తో మెరుపులు మెరిపించినా భారత్‌ను ఓటమి నుంచి తప్పించలేకపోయాడు. ఐర్లాండ్ బౌలర్లు మూంద్రా, మాట్ హోలార్డ్ మూడేసి వికెట్లు తీసి భారత్‌ను దెబ్బతీశారు.

### ప్రిన్స్ వికెట్ల బోణీ

అంతకుముందు టాస్ నెగ్గిన టీమిండియా.. ఐర్లాండ్‌కు బ్యాటింగ్ అప్పగించింది. ఐర్లాండ్ ఇన్నింగ్స్‌ను టిమ్ టెక్టార్(5), రాస్ అడైర్(16) ప్రారంభించారు. హర్షిత్ రాణా తన తొలి ఓవర్లోనే టిమ్ టెక్టార్‌ను అవుట్ చేశాడు. రెండు సిక్స్‌లతో ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన మరో ఓపెనర్ రాస్ అడైర్‌ను అర్ష్‌దీప్ సింగ్ పెవిలియన్‌కు చేర్చాడు. కెప్టెన్ లోర్కాన్ టక్కర్(15)ను తొలి వన్డే ఆడుతున్న ప్రిన్స్ యాదవ్ బోల్తా కొట్టించాడు. దీంతో ఐర్లాండ్ 48 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

### హ్యారీ టెక్టార్ అర్ధ శతకం

ఈ క్రమంలో వన్‌డౌన్ బ్యాటర్ హ్యారీ టెక్టార్(47 బంతుల్లో 53), బెంజమిన్ కాలిట్జ్ (37) క్రీజ్‌లో నిలదొక్కుకుని ఐర్లాండ్ స్కోరును వంద దాటించారు. నాలుగో వికెట్‌కు 65 రన్స్ జోడించారు. ఈ దశలో శివమ్ దూబే వరుసబంతుల్లో కాలిట్జ్, గరెత్(0)ను ఔట్ చేసి దెబ్బతీశాడు. మరో ఎండ్‌లో అర్షదీప్, ప్రిన్స్ యాదవ్ కూడా వికెట్లు తీయడంతో ఐర్లాండ్ వేగంగా వికెట్లు కోల్పోయింది. కాగా అర్ధసెంచరీ పూర్తి చేసిన హ్యారీ టెక్టార్... ఐర్లాండ్ స్కోరును 150 మార్కు దాటించాడు. భారత బౌలర్లలో అరంగేట్ర పేసర్ ప్రిన్స్ యాదవ్ మూడు వికెట్లు తీయగా.. అర్ష్‌దీప్ సింగ్, శివం దూబే చెరో రెండు, హర్షిత్ రాణా ఒక వికెట్ పడగొట్టారు.


ప్రిన్స్ యాదవ్ మూడు వికెట్లు

## ఆస్ట్రేలియా చేతిలో ఓడిన భారత్ మహిళలు

# టి20 ప్రపంచకప్ నుంచి ఔట్



**లండన్, జూన్ 28:** ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్-2026 టోర్నీలో భారత్ పోరు లీగ్ దశలోనే ముగిసింది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఓడి సెమీస్‌కు దూరమైంది. మొదట భారత్ ఉమెన్స్ 4 వికెట్లకు 170 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా మరో ఓవర్ ఉండగానే నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా టాప్ ప్లేస్‌తో, సౌతాఫ్రికా సెకండ్ ప్లేస్‌తో గ్రూప్-నుంచి సెమీఫైనల్లో ప్రవేశించాయి. భారతన ఆడిన 5 మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, రెండు పరాజయాలతో ఆరు పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ మహిళలు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన(37 బంతుల్లో 38), షఫాలీ వర్మ(26 బంతుల్లో 34).. తొలి వికెట్‌కు 66 పరుగుల శుభారంభాన్నిచ్చారు. అయితే స్కోరును వేగంగా పెంచలేకపోయారు. తర్వాత వచ్చిన రోడ్రిగ్స్(28 బంతుల్లో 34)తో కలిసి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన హర్మన్‌ప్రీత్(27 బంతుల్లో 56 రన్స్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడి స్కోరు వేగం పెంచింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కెప్టెన్ సోఫీ మోలినెక్స్ రెండు వికెట్లు తీసింది.

ఇక లక్ష్య ఛేదనకు దిగిన ఓపెనర్ జార్జియా వోల్ (4)ను ఔట్ చేసి ఆసీస్‌కు ఆదిలోనే రేణుకా సింగ్ షాకిచ్చింది. అయితే, బెత్ మూనీ (22), ఫోబీ లిచిఫీల్డ్ (22) నిలకడగా ఆడుతూ స్కోరును ముందుకు నడిపారు. ఆ తర్వాత వచ్చిన పెర్రి (38 బంతుల్లో 56),గార్డ్‌నర్ (29 బంతుల్లో 53 నాటౌట్) అద్భుత అర్ధ శతకాలతో దుమ్మురేపారు. నాలుగో వికెట్‌కు వంద పరుగులు జోడించి విజయానికి బాటలు వేశారు. ఆరు వికెట్ల విజయాన్ని అందించారు.



# యుఎస్ ఓపెన్ ఫైనల్లో కిడాంబి శ్రీకాంత్

**కాలిఫోర్నియా, జూన్ 28:** భారత్ స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్... యుఎస్ ఓపెన్‌లో టైటిల్ ఆశలను రెట్టింపు చేశాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఆదివారం జరిగిన సెమీ ఫైనల్లో జపాన్ ప్లేయర్ యుదై ఒకిమోటోను మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో 22-20, 15-21, 21-19తో ఓడించాడు. ఈ మ్యాచ్ గంటా 12 నిమిషాల పాటు జరిగింది. ఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన సు లి యాంగ్‌తో కిడాంబి తలపడనున్నాడు. కాగా భారత యువ షట్లర్లు రౌనక్ చౌహాన్, దేవికా సిహాగ్ పోరు సెమీఫైనల్లోనే ముగిసింది.

2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్ సిల్వర్ మెడలిస్ట్ కిదాంబి శ్రీకాంత్.. సెమీస్‌పోరును చక్కగా ఆరంభించాడు. 9-5తో ఆధిక్యం చాటాడు. ఆ తర్వాత దానిని 17-10కి పెంచుకున్నాడు. అయితే ఒకిమోటో అద్భుతమైన కమ్ బ్యాక్‌తో ఏకంగా పది పాయింట్లు సాధించి సమవుజ్జీగా నిలిచాడు. ఇద్దరూ మధ్య సుదీర్ఘ ర్యాలీలు కొన సాగాయి. చివరకు కిడాంబి తొలి గేమ్‌ను 22-20తో నెగ్గి కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో పుంజుకున్న ఒకిమోటో 21-15తో నెగ్గి సమం చేశాడు. ఫలితం తేల్చే మూడోగేమ్‌లోనూ ఇరువురూ పోటీపోటీగా తలపడ్డారు. చివరకు కిడాంబి వరుసగా ఆరు పాయింట్లు సాధించి పైచేయిగా నిలిచాడు. ఈ గేమ్‌ను తన ఖాతాలో వేసుకుని ఫైనల్లో ప్రవేశించాడు.

### సెమీస్‌లో రౌనక్, దేవికా బోల్తా

మరో పురుషుల సింగిల్స్ సెమీస్‌లో యువ షట్లర్ రౌనక్ చౌహాన్ అద్భుత ప్రదర్శన ముగిసింది. అతను సు లి యాంగ్ చేతిలో 17-21, 19-21 తేడాతో వరుస గేమ్‌ల్లో పరాజయం పొందాడు. ఈమ్యాచ్ 46నిమిషాల్లోనే ముగిసింది. ఇక ఈ ఏడాది ఆరంభంలో థాయిలాండ్ మాస్టర్స్ గెలిచిన ఆరో సీడ్ దేవిక సిహాగ్... మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో రెండో సీడ్ లైన్ క్రిస్టోఫర్‌సెన్(డెన్మార్క్) చేతిలో 21-15, 11-21, 15-21 తేడాతో ఓటమి పాలైంది. తొలి గేమ్‌ను నెగ్గి శుభారంభం చేసిన దేవిక అదే రోజు మిగతా రెండు గేమ్‌ల్లో చాటలేక చతికిలపడింది.

## టాప్ ఆరు కంపెనీల్లో

# 89వేల కోట్ల ఎంక్యాప్ వృద్ధి



**ముంబయి,జూన్ 28:** దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో ఆరు సంస్థలు గత వారం రూ.88 వేల 678 కోట్లకు పైగా మార్కెట్ విలువను పెంచుకున్నాయి. మరో నాలుగు కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ తగ్గింది. కాగా ఐసీఐసీఐ బ్యాంక్ అత్యధిక లాభం నమోదు చేసింది. సెలవు కారణంగా నాలుగు ట్రేడింగ్ రోజులకే పరిమితమైన మార్కెట్ విలువ పెరుగుదలలో ఐసీఐసీఐ బ్యాంక్ అగ్రస్థానంలో నిలిచింది. ఆ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.29 వేల 589 కోట్లు పెరిగి దాదాపు రూ.9.96 లక్షల కోట్లకు చేరింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.24 వేల 718 కోట్లు పెరిగి రూ.12.26 లక్షల కోట్లకు చేరింది. దేశీయ దిగ్గజ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.12 వేల 44 కోట్లు పెరిగి రూ.17.84 లక్షల కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ రూ.11 వేల 580 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్ విలువ రూ.9 వేల 323 కోట్లు, లార్సెన్ అండ్ టుబ్రో మార్కెట్ విలువ 1,424కోట్లు పెరిగాయి.

మరోవైపు, మార్కెట్ విలువ కోల్పోయిన కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్ అత్యధిక నష్టాన్ని చవిచూసింది. ఆ సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.35 వేల 615 కోట్లు తగ్గింది. అలాగే ఎల్‌ఐసీ మార్కెట్ విలువ రూ.21 వేల 189 కోట్లు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ విలువ రూ.11 వేల 144 కోట్లు, హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.5 వేల 322 కోట్లు తగ్గాయి. మార్కెట్ విలువల్లో మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అత్యంత విలువైన కంపెనీగా తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. ఆతర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో, ఎల్‌ఐసీ, హిందుస్థాన్ యూనిలీవర్ స్థానాల్లో నిలిచాయి.

# ఎక్సైజ్ సుంకాలతో రాష్ట్రాల ఖజానా కళకళ



**న్యూఢిల్లీ,జూన్ 28:** మద్యం అమ్మకాలతో రాష్ట్రాల ఖజానా కళకళలాడింది. రెండు నెలల వ్యవధిలోనే కొన్ని రాష్ట్రాల్లో ఎక్సైజ్ సుంకం వసూళ్లు 82 శాతం వరకు పెరిగింది. వసూళ్లలో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలవగా వృద్ధి రేటులో హర్యానా మొదటి స్థానాన్ని దక్కించుకుంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సీఏజీ) విడుదల చేసిన 10 ప్రధాన రాష్ట్రాల నెలవారీ కీలక సూచికల చూస్తే ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌మే కాలంలో ఉత్తరప్రదేశ్ రూ.10,600 కోట్లకు పైగా ఎక్సైజ్ ఆదాయాన్ని నమోదు చేసింది. హర్యానాలో ఎక్సైజ్ వసూళ్లు 82 శాతానికి పైగా పెరిగి రూ.2,300 కోట్లను దాటాయి. మొత్తం ఆదాయ పరంగా కర్ణాటక రెండో స్థానంలో ఉండగా వృద్ధి శాతంలో కేరళ రెండో స్థానంలో నిలిచింది.

మద్యం వినియోగం 14 శాతం పెరగడం, పలురాష్ట్రాలు ఎక్సైజ్ రేట్లను పెంచడం, తయారీ సంస్థలు ప్రాథమిక ధరలను సవరించడం వల్ల ప్రభుత్వాలకు అధిక ఆదాయం సమకూరిందని పేర్కొంటున్నాయి. కర్ణాటక దేశంలోనే తొలిసారిగా ఆల్కహాల్‌ఇన్‌బెవరేజ్ ఆధారిత ఎక్సైజ్ విధానాన్ని అమల్లోకి తీసుకురాగా తక్కువ ఆల్కహాల్ శాతం ఉన్న మద్యంపై అమ్మకపు పన్ను తగ్గించే ప్రతిపాదనను కేరళ ప్రభుత్వం పరిశీలిస్తోంది.

రాష్ట్రాల సొంత పన్ను ఆదాయంలో ఎక్సైజ్ సుంకం వాటా 13.5 శాతంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ రూ.52,575 కోట్లతో అత్యధిక ఎక్సైజ్ ఆదాయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత కర్ణాటక 35వేల 784 కోట్లు, మహారాష్ట్ర రూ.25,466 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ.19,882 కోట్లు, పశ్చిమ బెంగాల్ రూ.19,521 కోట్లు, తెలంగాణ రూ.18,604 కోట్లు, మధ్యప్రదేశ్ రూ.15,201 కోట్లు, రాజస్థాన్ రూ.15,104 కోట్లతో ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ ప్రాంత రాష్ట్రాల్లో ఉత్తరాఖండ్ రూ.4,362 కోట్లతో అగ్రస్థానంలో ఉండగా మిజోరం కేవలం రూ.2 కోట్ల ఎక్సైజ్ ఆదాయంతో చివరి స్థానంలో నిలిచింది.





# కోల్‌కత్తాలో జీఎస్టీ సమావేశం

**న్యూఢిల్లీ,జూన్ 28:** దేశంలో పరోక్ష పన్ను విధానంలో మరో కీలక మార్పులకు జిఎస్టీ మండలి రంగం సిద్ధంచేస్తోంది. జీఎస్‌టీ కౌన్సిల్ 57వ సమావేశం వచ్చే నెలలో కోల్‌కతాలో నిర్వహించనున్నారు. పన్ను సంస్కరణలు, తయారీ రంగానికి ఊరటనిచ్చే నిర్ణయాలు, ఆటిజం కేర్ సెంటర్ల పై జీఎస్‌టీ తగ్గింపు వంటి కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశముంది. పశ్చిమ గత జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం గత ఏడాది సెప్టెంబర్ 3న జరిగింది. దాదాపు తొమ్మిది నెలల విరామం తర్వాత జరిగిన ఆ సమావేశంలో "జీఎస్‌టీ 2.0" సంస్కరణలను ప్రవేశపెట్టారు.

పన్ను రేట్ల సరళీకరణతో పాటు వ్యాపారాలకు అనుకూలంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈసారి కూడా పరోక్ష పన్ను వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చే అవకాశముందని పన్ను నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తయారీ రంగంపై భారం తగ్గించే అంశాలు జీఎస్‌టీ కౌన్సిల్ పరిశీలించే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఇన్‌వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ కారణంగా ఇన్‌పుట్ సర్వీస్ ఐటీసీ రీఫండ్ లభించకపోవడం వల్ల తయారీ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందని బెంగాల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జాతీయ ఫిస్కల్ అఫైర్స్ అండ్ టాక్సేషన్ కమిటీ ఛైర్మన్ వివేక్ జలాన్ పేర్కొన్నారు. ఈ లోపాన్ని సరిదిద్దితే పన్నుల భారం తగ్గడంతో పాటు తయారీ రంగ పోటీతత్వం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆటిజం కేర్ సెంటర్లు, వాటికి సంబంధించిన సేవలపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించాలని కూడా జీఎస్‌టీ కౌన్సిల్‌ను కోరినట్లు తెలుస్తోంది.

# డివిడెండ్లు,షేర్ బైబాక్‌లతో ఈ వారం బిజీ




**ముంబయి,జూన్ 28:** వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్లో పలు ప్రముఖ లిస్టెడ్ కంపెనీల షేర్లకు కీలక కార్పొరేట్ చర్యలు అమల్లోకి రానున్నాయి. 29 నుంచి జూలై 3 వరకు డివిడెండ్లు, ప్రత్యేక డివిడెండ్లు, షేర్ బైబ్యాక్‌లు, స్పిన్‌ఆఫ్ వంటి చర్యలకు సంబంధించిన ఎక్స్‌డేట్లు నిర్ణయించబడ్డాయి. దీంతో ఆయా కంపెనీల షేర్లపై పెట్టుబడిదారుల దృష్టి కేంద్రీకృతమైంది.

29న జ్యోతి ల్యాబ్స్ షేరుకు రూ.3.50 తుది డివిడెండ్, కన్సాయ్ నెరోలాక్ పెయింట్స్ షేరుకు రూ.2.50, కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ షేరుకు రూ.11, రేమండ్ లైఫ్‌స్టైల్ షేరుకు రూ.1 తుది డివిడెండ్‌లకు ఎక్స్‌డేట్ ఉంటుంది. 30న బజాజ్ ఫిన్‌సర్వ్ రూ.1.50 తుది డివిడెండ్ ఇవ్వనుండగా, బజాజ్ హోల్డింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఒక్కో షేరుకు రూ.50 తుది డివిడెండ్‌తో పాటు మరో రూ.50 ప్రత్యేక డివిడెండ్ ప్రకటించింది. బజాజ్ ఫైనాన్స్ రూ.6 ప్రత్యేక డివిడెండ్, మహారాష్ట్ర స్కూటర్స్ రూ.60 ప్రత్యేక డివిడెండ్, వెల్‌స్పన్ కార్ప్ రూ.5 ప్రత్యేక డివిడెండ్‌లకు కూడా అదే రోజు ఎక్స్‌డేట్ ఉంటుంది.

జూలై 1న డీసీఎం శ్రీరామ్ ఫైన్ కెమికల్స్, గ్రోవీ ఇండియా, కెమ్‌బాండ్ మెటీరియల్ టెక్నాలజీస్ కంపెనీల ప్రత్యేక డివిడెండ్లకు ఎక్స్‌డేట్ నిర్ణయించారు. భారత్ ఫోర్జ్ ఒక్కో షేరుకు రూ.6.50, బయోకాన్ రూ.0.50, మహీంద్రా అండ్ మహీంద్రా రూ.33, టెక్ మహీంద్రా రూ.36, శ్రీరామ్ ఫైనాన్స్ రూ.6, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.5, వెల్‌స్పన్ ఎంటర్‌ప్రైజెస్ రూ.3, థర్మాక్స్ రూ.14 తుది డివిడెండ్‌తో పాటు రూ.6 ప్రత్యేక డివిడెండ్ ప్రకటించాయి. అదే రోజున ఎస్కార్ట్స్ కుబోటా రూ.33, ఎక్స్‌డ్ ఇండస్ట్రీస్ రూ.2, మ్యాక్స్ హెల్త్‌కేర్ రూ.2, రెడింగ్టన్ రూ.6, ఎస్‌కేఎఫ్ ఇండియా రూ.40, స్వరాజ్ ఇంజిన్స్ రూ.110, బాలాజీ అమీన్స్ రూ.11 తదితర కంపెనీలు కూడా డివిడెండ్లు అందించనున్నాయి. కార్పొరేట్ చర్యల్లో భాగంగా 29న కజారియా సెరామిక్స్ మరియు పటేల్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ కంపెనీలు షేర్ బైబ్యాక్ చేపట్టనున్నాయి.



# ఇరాన్‌వార్, ఇన్వెస్టర్ల ధోరణులే కీలకం

## ఈవారం మార్కెట్ ధోరణులపై స్టాక్ నిపుణుల దిక్సూచి

**ముంబయి,జూన్ 28:** అమెరికా-ఇరాన్ మధ్య తాజా సైనిక పరిణామాలు, వాటి ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల కదలికలు, దేశీయ ఆర్థిక గణాంకాలు వంటివి ఈ వారం ఈ వారం భారత స్టాక్ మార్కెట్ దిశను నిర్దేశించనున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల పెట్టుబడి ధోరణి, నైరుతి రుతుపవనాల పురోగతి కూడా మార్కెట్‌పై ప్రభావం ఉంటుంది. రిలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా మాట్లాడుతూ ఈ వారం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ, హెచ్‌ఎస్‌బీసీ తయారీ, సేవలు, కాంపోజిట్ పీఎంఐ తుది గణాంకాలు, దేశ విదేశీ మారక నిల్వల వివరాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తారన్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరల మార్పులు, పశ్చిమాసియాలోని భౌగోళిక ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా కొనసాగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

జూలై 1న విడుదల కానున్న ఆటోమొబైల్ కంపెనీల నెలవారీ విక్రయాల గణాంకాలపై కూడా మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్‌ముడి ఆర్ మాట్లాడుతూ అమెరికా-ఇరాన్ మధ్య తాజా సైనిక పరిణామాల నేపథ్యంలో మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల ఆందోళనకు కారణమవుతున్నాయని తెలిపారు. పరిస్థితులు సద్దుమణిగితే మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ కొనసాగుతుందని, అయితే ఉద్రిక్తతలు మరింత పెరిగితే ప్రపంచ ఆర్థిక వృద్ధి అంచనాలు, ఇంధన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా మాట్లాడుతూ ఈ వారం భారత్‌కు సంబంధించిన తయారీ పీఎంఐ, మే నెల పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలతో పాటు అమెరికా తయారీ సూచీ విడుదల కూడా మార్కెట్లకు కీలకం అవుతుంది.




# వచ్చేనెలలో వస్తున్న మార్పులు చేర్పులు ఇవే!

**ముంబయి,జూన్ 28:**మరోరెండురోజుల్లో జులై నెల ప్రారంభం అవుతున్న తరుణంలో వచ్చేనెల 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పలు నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు సామాన్యుల రోజువారీ జీవితంతో పాటు వారి ఖర్చులపై కూడా ప్రభావం చూపనున్నాయి. ఎల్పీజీ సిలిండర్ ధరల నుంచి క్రెడిట్ కార్డు నిబంధనలు, ఆధార్ సేవలు, విమాన ప్రయాణాలు, కార్ల ధరల వరకు మొత్తం ఐదు ప్రధాన మార్పులు అమల్లోకి రానున్నాయి. ప్రతి నెల మొదటి తేదీ మాదిరిగానే జూలై 1న కూడా చమురు సంస్థలు ఎల్పీజీ సిలిండర్ ధరలను సవరించనున్నాయి. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో వాణిజ్య ఎల్పీజీ ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఏవియేషన్ టర్బయిన్ ఫ్యూయెల్ ఎటిఎఫ్ ధరలను కూడా సవరించనుండటంతో విమాన టికెట్ ధరలపై ప్రభావం పడే అవకాశముంది హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రెగాలియా గోల్డ్ క్రెడిట్ కార్డు వినియోగదారులకు కూడా కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఉచిత దేశీయ విమానాశ్రయ లాంజ్ సదుపాయాన్ని పొందాలంటే, గత త్రైమాసికంలో కనీసం రూ.60 వేల ఖర్చు చేసిన వారికే ఈ సౌకర్యం కొనసాగుతుంది. ఆధార్ కార్డు వినియోగదారులకు మాత్రం ఊరట లభించనుంది. యుఐడిఎనిర్ణయం ప్రకారం ఆధార్‌లో ఈమెయిల్ ఐడీని అప్‌డేట్ చేసుకునే సేవ జూలై 1 నుంచి డిసెంబర్ వరకు ఉచితంగా అందుబాటులో ఉంటుంది. గతంలో ఈ సేవకు రూ.75 రుసుము వసూలు చేసేవారు. కారు కొనుగోలు చేయాలనుకునే వారికి జూలై నెల నుంచి అదనపు భారం తప్పదు. కియా, టాటా మోటార్స్ వంటి ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలు తమ వాహనాల ధరలను 1.5 శాతం నుంచి 2 శాతం వరకు పెంచనున్నట్లు ప్రకటించాయి. దీంతో జూలై నుంచి కొత్త కారు కొనుగోలు మరింత ఖరీదుగా మారనుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14